: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

ఖమ్మం

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

1-11-2025
శనివారం
సంపుటి: 31
సంచిక: 270
పేజీలు: 8+16
వెల: 6.50

# 12 జిల్లాల్లో తీవ్ర నష్టం



హనుమకొండలో తుఫాన్‌వల్ల నష్టపోయిన ఇళ్లను శుక్రవారం పరిశీలిస్తున్న సిఎం రేవంత్, మంత్రి పొంగులేటి తదితరులు

## మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, నష్టం జరిగిన ఇంటికి రూ. 15 వేలు పరిహారం

### క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తి తుఫాన్ నష్టాన్ని అంచనా వేయండి: అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

### నాలాల కబ్జాలను వెంటనే తొలగించండి

### వరంగల్లు, హనుమకొండ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే జరిపిన ముఖ్యమంత్రి

### కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

**హన్మకొండ బ్యూరో. అక్టోబర్ 31, ప్రభాత వార్త:** శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించండి.. క్షేత్ర స్థాయిలో పర్యటించండి.. నష్టాన్ని అంచనా వేయండి..నాలాల కబ్జాలను తొలగించండి.. ఎంత వారైన ఉపేక్షించేది లేదు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో భారీ వర్షాలతో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి రాష్ట్రస్థాయి అధికారులు, 12 జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారు లతో సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. అంతకు ముందువరంగల్, హన్మకొండ ప్రాంతాలలో హెలికాప్టర్ ద్వారా మంత్రులతో ఏరియల్ సర్వే నిర్వహించారు. వరద బారిన పడ్డ క్షత గాత్రులతో ఆయన స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నాడు.వరదల్లో నష్ట పోయిన వారికి తక్షణమే సహాయం అందనించును న్నట్లు తెలిపారు.నష్టం జరిగిన ఇంటికి 15వేలు, చనిపోయిన వారికి 5లక్షలు తక్షణమే ఇవ్వనున్నట్లు తెలిపారు.సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయండి అని ప్రాణ నష్టం, పంట నష్టం, పశు సంపద, అన్ని శాఖలకు సంబంధించి ఇన్ఫ్రాస్ట్రక్చర్ నష్టానికి సంబంధించి నివేదికలు తెప్పించుకోండి అని తెలిపారు.
ఇందుకు ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోండి ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వండి, తుఫాను ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాలి అని కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడంలో అలసత్వంవద్దు అని అన్నారు. కేంద్రంనుంచి రాబట్టుకోవాల్సిన నిధులను రాష్ట్రప్రభుత్వం రాబట్టు >>2

**జూబ్లీపై మూడు రంగుల జెండా ఎగరేస్తాం: సిఎం రేవంత్** 7లో



శుక్రవారం సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్ కేవడియాలోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రధాని మోదీ

## శత్రువుల ఇళ్లలోకి చొరబడి కొడతాం

### పాక్‌కు ప్రధాని మోదీ హెచ్చరిక 2లో




## ఎమ్మెల్యేల విచారణకు మరో 2 నెలలు!

### సుప్రీంలో అసెంబ్లీ కార్యదర్శి పిటిషన్

### ఇంకా ఆరుగురు పెండింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు31:** ఎమ్మెల్యేల అనర్హత అంశంలో మరో 2 నెలల సమయం కావాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తరఫున అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు సుప్రీంకోర్టులో శుక్రవారం పిటీషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ విచారణ చేపట్టినట్లు పిటీషన్‌లోపేర్కొన్నారు.10మంది ఎమ్మెల్యేల విచారణలో నలుగురు ఎమ్మెల్యేల విచారణ ప్రక్రియ మాత్రమే పూర్తయినట్లు సుప్రీంకోర్టుకు నివేదించారు. మరోఆరుగురు ఎమ్మెల్యేలను విచారించాల్సి ఉందని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు రెండు నెలల సమయం పడుతుందని అందుకు అనుమతించాలని పిటీషన్‌లో కోరారు. పలురకాల అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని స్పీకర్ కార్యాలయం తెలిపింది. కాగా శుక్రవారం (అక్టోబరు 31)తో ఈ కేసుపై సుప్రీంకోర్టు విధించిన 3 నెలల గడువు ముగిస్తోంది. >>2

## ఇద్దరికి 'కీ'లక పదవులు

- ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- ఆరు గ్యారెంటీల బాధ్యత ఆయనదే..
- పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు
- కేబినెట్ హోదాతో పదవుల కేటాయింపు
- స్థానిక ఎన్నికల తర్వాత కేబినెట్ విస్తరణ!



సుదర్శన్ రెడ్డి



ప్రేమ్‌సాగర్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు31:** సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. పార్టీలోని ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదాతో కూడిన ముఖ్యమైన పదవులను కేటాయించింది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. రామకృష్ణరావు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యత అప్పగించారు. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్‌రెడ్డికి ఇప్పుడు కీలక బాధ్యత లభించడం పార్టీ అంతర్గత రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నం జరిగింది.
పైగా ఆయన కేబినెట్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరయ్యే అవకాశం కల్పించారు. ఈ మేరకు మంత్రులకు ఉండే సదుపాయాలన్నీ ఆయనకు కల్పిస్తూ జీవో జారీచేశారు. అదేవిధంగా, మంచిర్యాలఎమ్మెల్యే కె.ప్రేమ్‌సాగర్‌రావుకు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పించడం గమనార్హం. కొంతకాలంగా మంత్రివర్గంలో చోటు కోసం ఈ ఇద్దరు సీనియర్ నేతలు ఎదురుచూస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో,వారిని సంతృప్తిపరిచేందుకే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.
వారి అనుభవాన్ని ప్రభుత్వానికి ఉపయోగించుకోవడంతో పాటు, పార్టీలో వారికి సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రాష్ట్ర కేబినెట్ ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తున్నది. పనితీరు సరిగా లేని మంత్రులను పక్కన పెట్టి, వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవడం లేదా వారి శాఖలను మార్చేందుకు యోచనచేస్తున్నట్లు సమాచారం.
అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకోవడంతో ఇంకా రెండుస్థానాలు ఖాళీగాఉంటాయి. అప్పుడే ఆ స్థానా లను కూడా భర్తీ చేయాలని హైకమాండ్ యోచిస్తున్నది. అలా కాకుండా రెండు స్థానాల కోసం మళ్లీ విస్తరణ వల్ల సామాజిక సమీకరణాల కూర్పు కష్టంగా ఉంటుంది. అందుకనే ప్రక్షాళన చేసే సమయంలోనే అన్ని వర్గాలకు ప్రయారిటీ ఇవ్వొచ్చని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుత మంత్రుల భవిష్యత్ స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత తేలనుంది. ఎందుకంటే కొంతమంది మంత్రులు తమకు కేటాయించిన శాఖల్లో ఆశించిన >>2



శుక్రవారం రాజ్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణం చేసిన అజారుద్దీన్‌ను అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారు.

## మంత్రిగా అజారుద్దీన్

### రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు31:** భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజారుద్దీన్ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. అల్లా పేరుమీద అజారుద్దీన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, దామోదర >>2

## 8 మంది ఐఎఎస్‌ల బదిలీ

### సంక్షేమ పనుల విభాగం స్పెషల్ సెక్రటరీగా బి. సైదులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు31:** రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ ఆఫీసర్లు బదలీలు అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి, సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక సిఎస్‌గా సవ్యసాచి ఘోష్ బదిలీ అయ్యారు. సంక్షేమ శాఖ ప్రత్యేక సిఎస్‌గానూ ఘోష్ కొనసాగనున్నారు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులుకు ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి,సంక్షేమ పనుల విభాగం స్పెషల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ కార్యదర్శి, కమిషనర్‌గా అనితా రామచంద్రన్ (మహిళా శిశు సంక్షేమం)కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ కార్యదర్శిగా ఉన్న ఇలంబర్తి రవాణాశాఖ కమిషనర్‌గా బదలీ అయ్యారు. >>2

## 3 జోన్‌లుగా తెలంగాణ

### కీలక పారిశ్రామిక కారిడార్‌గా ఒఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ప్రాంతం

### మేక్ ఇన్ సౌత్, స్కేల్ ఫర్ ది వరల్డ్ కోసం కలిసి పనిచేద్దాం

### సిఐఐ సదరన్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు31:** మా ప్రభుత్వం దృష్టిలో జిడిపి అంటే కేవలం గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ కాదని, గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్(జిఇపి) అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భారత్ 15 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే ప్రయాణంలో తెలంగాణ్ను కీలక భాగస్వామిగా మార్చుతామన్నారు. శుక్రవారం బేగంపేట్‌లోని ఐటిసి కాకతీయలో నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో డ్రైవింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్; తెలంగాణ రోడ్ మ్యాప్ టూ త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. అర్బన్ ఇంజిన్, ఇండస్ట్రియల్ హార్ట్ ల్యాండ్, రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ జోన్ అనే మూడు మూల స్థంభాలుగా తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఆయన వివరించారు.
ఇందుకోసం అమలులో వేగం, అవకాశాలలో పారదర్శకత, రూపకల్పనలో ఫ్యూచర్‌రెడీగా ఉండే కొత్త అభివృద్ధి నమూనాకు రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. 2035 నాటికి హైదరాబాద్ జిడిపి 350 బిలియన్ డాలర్లకు చేరేలా సర్వీసెస్, సస్టైనబిలిటీ, స్మార్ట్ లివింగ్‌కు గ్లోబల్ క్యాపిటల్, నెట్‌జీరో ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఓఆర్ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ప్రాంతాన్ని గ్లోబల్ చైనా+1 అవకాశాన్ని అందిపుచ్చుకునేలా కీలకమైన పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి రైతును పారిశ్రామికవేత్తగా మార్చేలా అగ్రిప్రాసెసింగ్ క్లస్టర్లు, డిజిటల్ అనుసంధానం కలిగిన ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేస్తామన్నారు. >>2

## చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసులో దశాబ్ద కాలం తర్వాత కోర్టు సంచలన తీర్పు

### రూ.70 లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశం



చింటూ | వెంకటాచలపతి | జయప్రకాష్ రెడ్డి | మంజునాథ్ తోటి | వెంకటేష్

## దోషులకు ఉరిశిక్ష

**చిత్తూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త:** చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లను నగరపాలకసంస్థ కార్యాలయంలోనే 2015 హత్య కేసులో ఐదుగురు హంతకులకు ఉరిశిక్ష విధిస్తూ చిత్తూరుజిల్లా కోర్టు న్యాయమూర్తి సంచలనం తీర్పువెలువడించారు. ఈ హత్య కేసులో ఇప్పటికే మిగిలిన 18 మంది నిందితుల పాత్ర లేదని కోర్టు భావించి వారిని విడుదల చేసింది. దశాబ్ధకాలంపాటు కోర్టులో విచారణ సాగిన హత్యకేసులో శుక్రవారం ఉదయం చిత్తూరు 9వ అదనపు జిల్లా కోర్టు తుదితీర్పు వెలువడించడంతో సంచలనంగా మారింది. చిత్తూరు నగరపాలక మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌లను హత్య చేసిన కేసులో ఐదు మంది నిందితులకు ఒకే >>2

## సిపిఎం నేత రామారావు హత్య

### కత్తులతో పొడిచి చంపిన దుండగులు

### పాతర్లపాడులో దారుణం



**చింతకాని, ప్రభాతవార్త అక్టోబరు 31 :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో సిపిఎం నేత సామినేని రామారావు దారుణ హత్య తీవ్ర కలకలం రేపుతుంది.. సామినేని రామారావు శుక్రవారం తెల్లవారుజామున సుమారు ఐదున్నర గంటల ప్రాంతంలో వాకింగ్ చేసి ఇంటి ఆవరణములో సేద తీరుతున్న క్రమంలో >>2

## ఫిబ్రవరి నుంచి ఇంటర్ పరీక్షలు

### నేటినుంచి ఎగ్జామ్ ఫీజు వసూలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 31:** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 18 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శుక్రవారం ప్రకటించారు. నేటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫీజును స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా >>2

## ఎకరానికి 10 వేలు మొంథా పరిహారం



### రాష్ట్ర వ్యాప్తంగా రూ.448 కోట్లు అంచనా

### ప్రభుత్వ పరిశీలనలో పంటనష్టం

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త :** తీవ్రమైన తుఫాను మొంథ కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం ఇచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఎకరానికి 10 వేల రూపాయల మేర పరిహారం చెల్లించే అంశాన్ని చురుగ్గా పరిశీలిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ విధంగా రాష్ట్రంలో మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు దాదాపు 448 కోట్ల రూపాయల మేర నష్ట పరిహారంగా చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఇప్పటికే ప్రతి జిల్లాలో నష్టం ఎంత ఉందో తెలిపే ప్రాథమిక అంచనాలు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు. మరోపక్క శుక్రవారం నుండి వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో అంచనా వేసి, పూర్తి పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారు. ఆయా జిల్లాల్లో అధికారులు పర్యటించి బాధిత ప్రతి రైతు నుండి వివరాలను నమోదు చేస్తున్నారు. కాగా మొంథా తుఫాను ప్రభావంతో తెలంగాణలో 4.5 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా >>2



శుక్రవారం సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్ కేవడియాలోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

# శత్రువుల ఇళ్లలోకి చొరబడి కొడతాం

## కాంగ్రెస్ వల్లే కాశ్మీర్‌లో సమస్యలు

## సర్దార్ పటేల్‌ను పట్టించుకోలేదని విమర్శలు

## ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంపు విడుదల

**అహ్మదాబాద్, అక్టోబరు 31:** శత్రువులకు భారత్ ఇచ్చే సమాధానం ఇప్పుడు చాలా స్పష్టంగా, బలంగా ప్రపంచానికి కనిపించేలా ఉంది... ఎవరైనా భారత్ వైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే, భారత్ వారి ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బకొడతాం అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరోక్షంగా పాకిస్తాన్‌ను హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తి ఏమిటో ప్రపంచమంతా చూసింది. నేడు పాకిస్తాన్‌కు, ఉగ్రవాద నిర్వాహకులకు భారత్ అసలైన శక్తి ఏంటో బాగా తెలుసు అని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుజరాత్‌లోని "స్టాట్యూ ఆఫ్ యూనిటీ" వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "ఆపరేషన్ సిందూర్" ద్వారా శత్రు భూభాగంలోకి ప్రవేశించి మరీ దాడులు చేయగలమని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వ దృఢవైఖరి, సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగానే ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్‌పై ప్రధాని తీవ్ర విమర్శలుచేశారు.

**కశ్మీర్‌పై పటేల్ ఆకాంక్షలు**

కశ్మీర్ పూర్తిగా భారత్‌లో కలవాలని పటేల్ కోరుకున్నారని, అయితే ఆ సమయంలో నెహ్రూ ఆ అభిప్రాయాన్ని గౌరవించలేదని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పటేల్ ఆశయాలను పూర్తిగా మరిచిపోయిందని ఆరోపించారు. పటేల్ దూరదృష్టిని కాంగ్రెస్ మరచిపోయిందన్న ప్రధాని, ఆయన అభిప్రాయాలను నెహ్రూ గౌరవించలేదని చెప్పారు. కాంగ్రెస్ తప్పు వల్ల కశ్మీర్‌లో కొంతభాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించిందని వివరించారు. ఇప్పుడు చొరబాటుదారులతో కలిసి విపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. "గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను పణంగా పెట్టాయి. దేశం బలహీనపడినా చొరబాటుదారుల కోసం పోరాడేవారు పట్టించుకోరు. కానీ దేశ భద్రత, గుర్తింపు ప్రమాదంలో పడితే ప్రతి పౌరుడూ ప్రమాదంలో పడినట్లే. అందుకే, చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ప్రతి చొరబాటుదారుడిని దేశం నుంచి తొలగించాలని మనం సంకల్పించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. కేవలం బాహ్యశత్రువులకే కాకుండా నక్సలిజం, చొరబాట్లు వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో కూడా తమ ప్రభుత్వానికి పటేల్ ఆదర్శాలే మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. చొరబాట్లు దేశ ఐక్యతకు పెను ముప్పుగా పరిణమించాయని ప్రధాని హెచ్చరించారు. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించిందని, దాన్ని అంతం చేస్తున్నామని వివరించారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, విభజన శక్తుల కుట్రలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పటేల్ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంపును విడుదల చేసినట్టు మోడీ వెల్లడించారు. ఈ వేడుకల్లో సైనిక దళాల కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# 12 జిల్లాల్లో తీవ్ర నష్టం

>> కుంటుంది తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించండి. సమన్వయ లోపంతో సమస్యలు పెరుగుతున్నాయి. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి నాలాల కబ్జాలను తొలగించాల్సిందే. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు అని అన్నారు. పది మంది కోసం పదివేలమందికి నష్టం జరుగుతుంటే ఉపేక్షించొద్దు దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందుకు వెళ్లాల్సిందే. వరదలు తగ్గిన నేపథ్యంలో శానిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి అన్నారు.వరదల్లో ప్రాణ నష్టం జరిగినచోట రూ. 5 లక్షలు పరిహారం ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందుకు సంబధించి వివరాలు సేకరించండి పంటనష్టం, పశు సంపద నష్టపోయిన చోట వారికి పరిహారం అందించాలి ఇసుక మేటలు పేరుకున్న రైతులను ఆదుకునేందుకు అంచనాలు వేయండి అని అన్నారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయండి ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించండి అని అన్నారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి స్మార్ట్ సిటీలో చేయాల్సిన పనులపై ప్రత్యేక నివేదిక తయారు చేయండి ఎక్కడా పనులు ఆపే ప్రసక్తి ఉండొద్దు అని అన్నారుక్షేత్రస్థాయిలో ఒక కో ఆర్డినేషన్ కమిటీ వేసుకుని పనిచేయాలి వాతావరణ మార్పులతో క్లౌడ్ బరస్ట్ అనేది నిత్యకృత్యమైంది. దీనికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిం చుకోవాలి తెలిపారు.అధికారులు నిర్లక్ష్యం వదలండి క్షేత్రస్థాయికి వెళ్లండి కలెక్టర్లు ఫీల్డ్ విజిట్స్ చేయాల్సిందే అని ఆర్డర్ వేశారు.



శుక్రవారం మంత్రి పొంగులేటితో కలిసి హన్మకొండ తుఫాన్ ప్రాంతంలో ఏరియల్ సర్వే జరిపిన సిఎం రేవంత్

# ఇద్దరికి 'కీ'లక పదవులు

>> స్థాయిలో పనిచేయలేదని విమర్శలు ఉన్నాయి. కొందరిపై అవినీతి ఆరోపణలు తీవ్ర స్థాయిలో వచ్చాయి. అలాగే సదరు మంత్రుల అనుచరులు, బంధువుల ఆగడాలు గీత దాటాయని విమర్శలు ఉన్నాయి. అయినప్పటికీ మంత్రుల పనితీరుకు ప్రమాణంగా తీసుకోనున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు మంత్రుల రాజకీయ భవిష్యత్తుకు అగ్నిపరీక్షగా మారనున్నాయి. మంత్రుల సొంత జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులు కాంగ్రెస్ ఖాతాలోకి రాకపోతే సదరు మంత్రులపై వేటు పడటం ఖాయం కానుంది. ఇదే సమయంలో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్వతహాగా రంగంలోకి దిగుతున్నారు. డివిజన్ల వారీగా మంత్రులకు కూడా బాధ్యతలు అప్పగించారు. ఈ ఎన్నికల్లో కూడా మంత్రులు తమ పనితీరును నిరూపించుకోవాల్సి ఉంది. ఇప్పుడు పనితీరు బాగుంటే వారి పదవులకు డోకా ఉండదని, లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా మంత్రులు తమ సత్తాచాటుకోవాలని అధిష్ఠానం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. పి.సుదర్శన్‌రెడ్డి,ప్రేమ్‌సాగర్‌రావుకు కేబినెట్ ర్యాంక్ పోస్టులు రావడంతో ఖాళీగా ఉన్న మిగతా రెండు మంత్రి పదవులపై ఆశావాహులు తీవ్ర యత్నాలు చేసే అవకాశం ఉంది. కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, మరికొందరు ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే ఎదురు చూసే అవకాశం ఉంది. డిసెంబర్ నెల తర్వాతే మంత్రివర్గ విస్తరణతో పాటు,మంత్రివర్గ ప్రక్షాళన ఉండనుంది.

# 8 మంది ఐఎఎస్‌ల బదలీ

>> కాగా, ఆయనకు పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సిఎస్ రామకృష్ణారావు వద్దే మెట్రో పాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలు ఉంచుకున్నారు. మున్సిపల్ బాధ్యతలను అదనంగా చూడనున్నారు. జిఎడి కార్యదర్శిగా ఇ శ్రీధర్(బీసీ సంక్షేమం)కు అదనపు బాధ్యతలు అప్పగించారు. టిజి ఆయిల్‌ఫెడ్ ఎండిగా యాస్మిన్ బాషా (ఉద్యానవన శాఖ డైరెక్టర్)కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆదిలాబాద్ జెడ్పీ సిఇఒగా ఉన్న జి.జితేందర్‌రెడ్డి ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కాగా, ఎస్సీ సహకార సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.



శుక్రవారం న్యూఢిల్లీలో ఇందిరాగాంధీ సమాధివద్ద నివాళులర్పిస్తున్న ఖర్గే, సోనియా, రాహుల్ తదితరులు

# శక్తిస్థల్ వద్ద ఇందిరాగాంధీకి ఘన నివాళులు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు దివంగత ప్రధాని సమాధి వద్ద ఘన నివాళులర్పించారు. న్యూఢిల్లీలోని శక్తిస్థల్‌వద్ద ఉన్న ఇందిర సమాధి వద్ద కాంగ్రెస్ నేత సోనియా, ఎంపిలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితర అగ్రనేతలందరూ నివాళి అర్పించి ఇందిరాగాంధీ సేవలను స్మరించుకున్నారు. అలాగే సఫ్దర్‌జంగ్ రోడ్డులో ఉన్న దివంగత ప్రధాని స్మారకం వద్దకూడా అగ్రనేతలువెళ్లి నివాళి అర్పించారు. భారత్ ఆత్మగౌరవంతో నిలిచేవిధంగా స్వర్గీయ ఇందిర కృషిచేసారని, తనకు ఆత్మనిర్భర్‌కంటే ఏదీ ముఖ్యంకాదని ఇందిర చాటిచెప్పారని కాంగ్రెస్‌నేతలు ఈసందర్భంగా గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడుమల్లికార్జున్‌ఖర్గే సైతం సమాధివద్ద ఘననివాళులర్పించి ఆమెతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. భారత మొట్టమొదటి మహిళా ప్రధాని మనందరికీ రోల్‌మోడల్ అని ఆమె వర్ధంతిరోజున దేశ అభివృద్ధి, సర్వతోముఖాభివృద్ధికి స్వర్గీయ ఇందిరచేసిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలని సూచించారు. సమైక్యత, సమగ్రతలతోనే భారత్ మరింతగా రాణిస్తుందని స్వర్గీయ ప్రధాని విశ్వసించేవారని, ఆమె చూపించిన అడుగుజాడలే నేటి తరానికి మార్గదర్శకమని ఖర్గే ఆకాంక్షించారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేష్ మాట్లాడుతూ ధైర్యసాహసాలకు ప్రతీక స్వర్గీయ ఇందిర అని కొనియాడారు. 1977లో ఆమె బీహార్ పర్యటనలో ముందు కారు, తర్వాత జీపు, ఆపై ట్రాక్టర్ ఆ తర్వాత బెల్చి ప్రాంతానికి ఒక ఏనుగుపైనా ప్రయాణంచేసారని,ప్రజలకు చేరువకావాలన్న ఆమె ఆకాంక్షకు ఈ సంఘటన నిదర్శనమని పేర్కొన్నారు.

# 3 జోన్‌లుగా తెలంగాణ

>> ఎఐ ఇన్నోవేషన్ హబ్, ఎఐ సిటీ, ఇమేజ్ టవర్స్, టిహబ్ ఫేజ్ 2 ద్వారా రాష్ట్రంలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ మరింత పటిష్ఠమవుతుందన్నారు. రాష్ట్రంలో 2030 నాటికి 20 గిగావాట్స్ పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వాటితో పోటీపడేలా మేక్ఇన్ సౌత్, స్కేల్ ఫర్‌ది వరల్డ్ ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు దక్షిణాది రాష్ట్రాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. విశ్వసనీయమైన లాంచ్ ప్యాడ్‌గా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. పరిశ్రమలు, ప్రభుత్వం మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఎపి తరహాలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ థామస్ జాన్ ముత్తూట్, డిప్యూటీ ఛైర్మన్ రవి చంద్రన్, సీఐఐ తెలంగాణ కౌన్సిల్ ఛైర్మన్ శివప్రసాద్ రెడ్డి, వైస్ ఛైర్మన్ గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దోషులకు ఉరిశిక్ష

>> సారి ఉరిశిక్ష విధిస్తూ జడ్జి శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. 2015లోనే ఈ కేసులో చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు మొత్తం 23 మంది నిందితులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలు చేసింది. పదేళ్ళపాటు జరిగిన ఈ విచారణలో ఈ నెల 24వ తేదీన మేయర్ దంపతుల హత్య కేసులో మొదటి ఐదు మంది నిందితులు మాత్రమే ఈ హత్యలు చేశారని మిగిలిన 18 మంది నిందితుల పాత్ర ఈ హత్యల్లో లేదని కోర్టు భావించి వారిని విడుదల చేసింది. ఆపై శిక్ష ఖరారుకు ఈ కేసును మూడు సార్లు వాయిదా వేసినప్పటికీ శుక్రవారం మేయర్ దంపతుల హత్య కేసు శిక్షను జడ్జి శ్రీనివాసరావు ఖరారు చేసి ఈ కేసులో మొదటి ఐదు మంది నిందితులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈమేరకు మేయర్ దంపతులహత్యకేసులో ప్రధాన నిందితుడిగా వున్న శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు వెంకటాచలపతి అలియాస్ ముల్బాగల్ వెంకటేష్, జయప్రకాష్ రెడ్డి అలియాస్ రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్‌లకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

# 10 వేలు మొంథా పరిహారం

>> వేసింది. ముఖ్యంగా వరంగల్, ఖమ్మం, సూర్యాపేట్, నల్లగొండ జిల్లాల్లో పంట నష్టం తీవ్రంగా ఉందని తేల్చింది. 2 లక్షల 82 వేల 379 ఎకరాల్లో వరి, 1 లక్షా51 వేల 707 ఎకరాల్లో పత్తి, 4 వేల 963 ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల 613 ఎకరాల్లో మిర్చి, 1 వెయ్యి 228 ఎకరాల్లో పప్పు ధాన్యాలు, 2 వేల 674 ఎకరాల్లో వేరుశెనగ పంటలు దెబ్బతిన్నాయి. ఇక 1 వెయ్యి 300 ఎకరాల్లో ఉద్యాన పంటలు కలిపి మొత్తం 4 లక్షల 47 వేల 864 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించింది. మరోపక్క రైతులు నష్టాల అమ్మకాలకు దిగకుండా నిరోధించడానికి వర్షంలో తడిసిన వరి ధాన్యాన్ని తక్షణమే సేకరించేందుకు వీలుగా చర్యలు చేపడుతోంది. అంతేకాకుండా తడిసిన వాటితో సహా 11 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

# ఒకేసారి రూ. 1,032కోట్లు విడుదల

## ఉద్యోగుల బకాయిలు రూ. 712 కోట్లు

## డి.సిఎం భట్టి ఆదేశంతో బిల్లులు చెల్లించిన ఆర్థిక శాఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు31:** ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు, పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన పెండింగ్ బిల్లులు అక్టోబర్ మాసానికి సంబంధించి సుమారు 1,031 కోట్ల రూపాయలను ఒకేసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. శుక్రవారం ఉదయం ప్రజా భవన్ లో ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను దశలవారీగా ప్రతినెలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్లియర్ చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా అక్టోబర్ మాసానికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు 712 కోట్ల రూపాయలను డిప్యూటీ సీఎం ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా 10 లక్షల లోపు పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది.ఇందులో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు 320 కోట్ల రూపాయలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు విడుదల అధికారులు చేశారు. రోడ్లు మరియు భవనాల శాఖకు చెందిన రూ.10 లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95 కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు.

# సిపిఎం నేత రామారావు హత్య

>> గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి అత్యంత కిరాతకంగా కత్తులతో పొడిచి హత్య చేశారు స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే గ్రామంలో రామారావును హత్య చేశారంటూ స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు సామినేని రామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాతర్లపాడు సర్పంచిగా పనిచేశారు. రామారావు హత్య వెనక దాగిఉన్న కుట్ర కోణాన్ని, నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రంగ ప్రవేశం చేసి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గ్రామంలో రాజకీయ ఆధిపత్య ధోరణితోనే ఈ హత్య చేసి ఉంటారని పలు రకాలుగా అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సంఘటన స్థలానికి చేరుకున్న ఖమ్మం సిపి సునీల్ దత్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. గ్రామంలో ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకుండా భారీ ఎత్తున పోలీసులను మోహరించారు.

**హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం : సిపి సునీల్ దత్**

సామినేని రామారావు హత్యపై అన్ని కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఖమ్మం సిపి సునీల్ దత్ పేర్కొన్నారు. సామినేని రామారావు శుక్రవారం తెల్లవారుజామున దుండగుల చేతిలో హత్య గావించబడిన సందర్భంలో విలేకరులతో మాట్లాడుతూ హత్యఎలా జరిగింది? ఎవరు చేశారు?దీని వెనక నిందితులుఎవరున్నారు?అనే కోణంలో డాగ్ స్క్వాడ్,క్లూస్ టీమ్స్ ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశామని అదే కోణంలో విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు కుటుంబీకుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేసి త్వరితగతిన నిందితులను పట్టుకొని శిక్షిస్తామని ఆయన తెలిపారు అప్పటివరకు గ్రామములో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఉంటుందన్నారు.

# ఫిబ్రవరి నుంచి ఇంటర్ పరీక్షలు

>>ఇంటర్ బోర్డు కార్యదర్శి ప్రకటించారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25, 2026 నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 18 వరకు కొనసాగనున్నాయి. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. మొదటి సెషన్‌ను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. రెండో సెషన్‌ను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షను జనవరి 23న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహిస్తారు. ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామ్‌ను జనవరి 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించనున్నారు.

**నేటి నుంచి ఫీజు స్వీకరణ..**

నేటి(శనివారం) నుంచి ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజును స్వీకరించనున్నారు. ఈ నెల 14 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజును స్వీకరిస్తారు. అపరాధ రుసుం రూ. 100తో ఈ నెల 16 నుంచి 24 వరకు, రూ. 500తో ఈ నెల 26 నుంచి డిసెంబరు 1 వరకు స్వీకరిస్తారు. అపరాధ రుసుం రూ. 1000తో డిసెంబరు 3 నుంచి డిసెంబరు 8 వరకు, రూ. 2000 అపరాధ రుసుంతో డిసెంబరు 10 నుంచి డిసెంబరు 15 వరకు అవకాశం కల్పించారు. పరీక్ష ఫీజు మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులకు రూ. 530, ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌కి రూ. 100, మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులకు రూ. 870. సెకండియర్ జనరల్ ఆర్ట్స్ విద్యార్థులకు రూ. 530 ఇంగ్లీష్ ప్రాక్టికల్‌కి రూ. 100, సెకండియర్ జనరల్ సైన్స్ విద్యార్థులకు, సెకండియర్ ఒకేషనల్ విద్యార్థులకు రూ. 870గా ఫీజును నిర్ణయించారు.

**మొదటి సంవత్సరం పరీక్షల షెడ్యూల్..**

| | |
|---|---|
| ఫిబ్రవరి 25 | సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 |
| ఫిబ్రవరి 27 | ఇంగ్లీష్ పేపర్-1 |
| మార్చి 2 | గణితం పేపర్-1ఏ, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1 |
| మార్చి 5 | గణితం పేపర్-1బి, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1 |
| మార్చి 9 | ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1 |
| మార్చి 14 | పబ్లిక్అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, బ్రిడ్జికోర్సు గణితం పేపర్-1(బైపీసీ స్టూడెంట్స్) |
| మార్చి 17 | మోడరన్ లాంగ్వేజ్ పేపర్-1, జియోగ్రఫీ పేపర్-1 |

**రెండో సంవత్సరం పరీక్షల షెడ్యూల్..**

| | |
|---|---|
| ఫిబ్రవరి 26 | సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 |
| ఫిబ్రవరి 28 | ఇంగ్లీష్ పేపర్-2 |
| మార్చి 3 | గణితం పేపర్-2ఏ, బోటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2 |
| మార్చి 6 | గణితం పేపర్-2బి, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2 |
| మార్చి 10 | ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2 |
| మార్చి 13 | పబ్లిక్అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, బ్రిడ్జికోర్సు గణితం పేపర్-2(బైపీసీ స్టూడెంట్స్) |
| మార్చి 18 | మోడరన్ లాంగ్వేజ్ పేపర్-2, జియోగ్రఫీ పేపర్-2 |

# మరో 2 నెలలు!

>> కాగా, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలు చేపట్టాలని స్పీకర్‌ను ఆదేశాలు జారీ చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుప్రీం కోర్టుకు జూలైలో ఆశ్రయించారు. మూడు నెలలోపు చర్యలు చేపట్టాలని స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో స్పీకర్ ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ చేపట్టడం ప్రారంభించారు. కానీసమయం సరిపోక పోవడంతో ఇంకా రెండునెలల సమయం కావాలని సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

# వారం - వర్జ్యం

01-11-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
దశమి ఉ.9.09
శతభిషం సా.6.14, స్వాతి కార్తె
వర్జ్యం : రా.9.17-10.02
దు.ఉ.6.06-7.40
శుభసమయం:ఉ.8.15-8.45
రాహుకాలం - ఉ.9.00-10.30

# వార్తాఫలం

**మేషం:** అనుకున్న పనులు పూర్తి అవుతాయి. నూతన ఉద్యోగా వకాశాలు లభిస్తాయి.ఆర్థికపరిస్థితి బాగుంటుంది.

**వృషభం :** మొండి పట్టుదల మాట తీరు వల్ల మీ సహాయసహకారాలకు రావలసిన పేరు రాదు. వస్త్రలాభం

**మిథునం:** తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల సేవా తత్పరత కలిగి వుంటారు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాలలో నూతన పద్ధతుల వల్ల లాభపడతారు. ధనలాభం కల్గుతుంది.శుభకార్యాలలో పాల్గొంటారు.

**సింహం:** కుటుంబంలో ఏర్పడిన కొద్ది పాటి విభేదాలు తొలగుతాయి. ఓర్పు, నేర్పు, నైపుణ్యం అవసరమవుతాయి.

**కన్య :** చేపట్టిన కార్యక్రమాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. అంతర్గత రాజకీయాలు కొంత బాధిస్తాయి.

**తుల :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి.అరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. శుభ వార్తలు అందుకుంటారు. వస్త్రలాభం.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో లాభాలు గడిస్తారు. ప్రయాణాలు అనుకూలం.

**మకరం:** అవకాశాలు అంచులవరకూ వచ్చి చేజారిపోకుండా జాగ్రత్తలు పాటించండి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** భూ, స్థలాలకు సంబంధించిన కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. బంధువులు కలుస్తారు.

**మీనం:** ఆర్థిక లావాదేవీలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఇంటా బయటా ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మంత్రిగా అజారుద్దీన్

>> రాజనర్సింహా, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర కేబినెట్ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం పూర్తయిన అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ప్రమాణ స్వీకారం అనంతరం సిఎం రేవంత్ రెడ్డికి మంత్రి అజారుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. సరిగ్గా మధ్యాహ్నం 12:25 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం కేవలం 9 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం తర్వాత సిఎంతో పాటు మంత్రివర్గమంతా గవర్నర్‌తో ఫోటో దిగారు. అనంతరం మంత్రులందరికీ గవర్నర్ తేనేటి విందు ఇచ్చారు.

**క్రికెట్ కేప్టెన్ టు మినిస్టర్**

హైదరాబాద్ నగరంలో 1963 ఫిబ్రవరి 8న అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. నిజాం కళాశాలలో బీకాం చదవారు. తన మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ రంగం వైపు అడుగులు వేశారు. 1984లో అజారుద్దీన్ అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. క్రికెటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పట్లో తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా అజారుద్దీన్ బాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ అనంతరం రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19వ తేదీన కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే ఏడాది యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు. తాజాగా రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

**ముస్లిం మైనార్టీ వర్గానికి అవకాశం ఇవ్వాలని :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ముస్లిం మైనార్టీ వర్గానికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకత్వం భావించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఒక్కరూ విజయం సాధించకపోవడంతో ఆ సామాజిక వర్గానికి పదవి ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. గతంలో జూబ్లీహిల్స్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన అజారుద్దీన్‌కు తిరిగి అక్కడ జరిగే ఉప ఎన్నికలో పోటీ చేసే అవకాశం వచ్చింది. గతంలో 16 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన అజారుద్దీన్‌తో తిరిగి పోటీ చేయించడం కంటే, గవర్నర్ కోటా కింద శాసన మండలి సభ్యుడిగా అవకాశం కల్పిస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అజారుద్దీన్‌తో పాటు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు(టీజేఎస్) కోదండరామ్‌ను గవర్నరు కోటా కింద ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపారు. గవర్నర్ కోటా కింద అజారుద్దీన్ ఎంపిక విషయంలో ఏదైనా సాంకేతికపరమైన ఇబ్బంది తలెత్తితే వచ్చే ఏడాదిలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీల్లో ఇతర కోటా కింద ఎంపిక చేసేందుకు అవకాశం ఉందని అంచనా వేసిన ఎఐసిసి ఆ నిర్ణయం తీసుకుంది. మైనారిటీ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వడం ద్వారా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కలిసి వస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. మరోవైపు, అజారుద్దీన్‌కు ఏ శాఖ కేటాయిస్తారనే విషయం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## వివేకా హత్యపై సిబిఐ కోర్టులో సునీతారెడ్డి పిటిషన్

### నాలుగో తేదీకి విచారణ వాయిదా

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మాజీమంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసుపై విచారణను కొనసాగించాలని నాంపల్లి సిబిఐ కోర్టులో ఆ యన తనయ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నవంబరు నాలుగవ తేదీకి వాయిదా పడింది. సునీతా రెడ్డి పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరి గింది. ఈ కేసులో నిందితులుగా వున్న అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిపాటు ఇతర నిందితులు కౌంటర్ దాఖలు చేయగా ఏ2గా వున్న సునీల్‌యాదవ్ ఇందుకు సమయం కోరారు. దీనిని పరిగణలోకి తీసు కున్న సిబిఐ కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.



## ప్రపంచ గుర్తింపు లభించేలా చిత్రపరిశ్రమకు మౌలికవసతులు

### మహారాష్ట్ర మంత్రి ఆశిష్‌శెలార్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ

### మహారాష్ట్ర ఫిల్మ్‌సిటీ సందర్శనకు ఆహ్వానం

**హైదరాబాద్, అక్టోబరు 31,ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రపంచ గుర్తింపు లభించే రీతిలో చిత్రపరిశ్రమకు మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని సినిమాటోగ్రఫీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మహారాష్ట్ర ఐటీ, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి ఆశిష్‌శెలార్ సెక్రటేరియట్‌లో శుక్రవారం సమావేశమైనారు.సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలసీ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సినిమా నిర్మాణ రంగం అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించిందని, రాచ కొండ లాంటి ప్రాంతాలు సినిమా షూటింగ్స్‌కు ఎంతో అనువైనవి మహా రాష్ట్ర మంత్రికి వివరించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించిన రామోజీ ఫిలిం సిటీలో బాలీవుడ్, హాలీవుడ్ స్థాయి సినిమాలు నిర్మిస్తారని మహా మంత్రికి వివరించారు. హైదరాబాద్ తో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న టూరిజం ప్రాంతాలు సినిమాలు నిర్మించేందుకు ఉత్తమ వేదికలుగా తీర్చిదిద్దుతున్నామని మహా రాష్ట్ర మంత్రితో అన్నారు.తెలంగాణను హాలీవుడ్ స్థాయి ఫిల్మ్ హబ్‌గా డెవలప్మెంట్ చేస్తున్నామని మంత్రి వివరిం చారు. సినిమా పరిశ్రమకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు, సినీకార్మికుల సంక్షేమం లాంటి ప్రోత్సాహక కార్యక్రమాలకు తెలంగాణ ప్రభు త్వం కృషి చేస్తున్నదని తెలిపారు.సినిమా పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని, మహారాష్ట్ర లో కూడా ఇట్లాంటివి అమలు చేసేందుకు తెలంగాణ పర్యటనకు వచ్చినట్లు మహారాష్ట్ర మంత్రి ఆశిష్‌శెలార్ వివరించారు. మహారాష్ట్ర ఫిల్మ్‌సిటీని విజిట్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మహారాష్ట్ర మంత్రి ఆశిష్‌శెలార్ ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## పెళ్లి వేడుకలో విషాదం

### బొలెరో, డిసిఎం ఢీకొని ముగ్గురు మృతి

### 10 మందికి తీవ్రగాయాలు

**హన్మకొండ బ్యూరో, అక్టోబరు 31, ప్రభాతవార్త:** పెళ్లి వేడుక ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న ఓ కుటుంబంలో ఘోర రోడ్డు ప్రమాదం రూపంలో అంతులేని విషాదం చోటుచేసుకుంది. భీమ దేవరపల్లి మండలం, కొత్తపల్లి శివారులో బుధవారం రాత్రి అతివేగంగా వచ్చిన బోర్వెల్ డిసిఎం వాహనం బొలెరో వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 10 మందికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా, వెంకటాపురం గ్రామానికి చెందిన రెడ్డబోయిన శ్రీకాంత్ కుటుంబ సభ్యులు కురవి మండలం, సుధన్ పల్లికి చెందిన నాగలక్ష్మి ్మ, వెంకట పురం (సిద్దిపేట జిల్లా)కు చెందిన భాస్కర్ వివాహ నిమిత్తం సుధన్ పల్లికి వెళ్లారు. పెళ్లి పూర్తయ్యాక, మరుసటి రోజు మారుపెళ్లి కోసం వెంకటాపురం వచ్చి, అక్కడ నుండి రాత్రి 8 గంటలకు తిరిగి సుధన్ పల్లికి బొలెరో వాహనంలో బయలుదేరారు. ప్రయాణంలో మార్గమధ్యంలో భీమదేవరపల్లి మండలం, కొత్తపల్లి గ్రామ శివారులో మూత్రవిసర్జన కోసం వాహ నాన్ని రోడ్డు పక్కకు ఆపారు. సరిగ్గా అదే సమయంలో, ఎల్కతుర్తి వైపు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన బోర్వెల్ డీసీఎం వ్యాను ఆగి ఉన్న వీరి బొలెరో వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోరప్రమాదంలో రెడ్డబైన స్వప్న (16), శ్రీనాథ్ (6), కలమ్మ (55) అక్కడి కక్కడే మృతి చెందారు. అలాగే, అనసూయ, అక్షయ, మారుతి, రమాదేవి, దేవేందర్, నవలోక్, రిత్విక్, సరోజన, కార్తిక్, శ్రీరామ్ సహా మొత్తం 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రి, రాజుగార్డెన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

## నేడు 'దళితుల ఆత్మగౌరవ మహాప్రదర్శన'

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 31, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడికి వ్యతిరేకంగా శనివారం ఉదయం హైదరాబాద్ నగరంలో 'దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శన' నిర్వ హిస్తున్నామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఇందిరా పార్కు నుంచి ప్రారంభమై, ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం మీదగా బషీర్ బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు కొనసాగు తుందన్నారు. ప్రదర్శనలో దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గవాయ్‌పై సుప్రీంకోర్టులో ఒక న్యాయ వాది చెప్పుతో దాడికి పాల్పడి మూడు వారాలు దాటినప్పటికి అతనిని అరెస్టు చేయకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణ మన్నారు. ప్రధాన న్యాయమూర్తి గవాయ్ దళితుడైనందు వల్లనే వివక్షత కొనసాగుతున్నదని, దళితుల అస్థి త్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. నిందుతుడిని అరెస్టు చేసేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని మంద కృష్ణమాదిగ హెచ్చరించారు.

# ఐదు అడుగులు ఎత్తిన నాగార్జునసాగర్ 12 క్రస్ట్‌గేట్లు

### దిగువకు వదిలిన 96,696 క్యూసెక్కుల నీరు

### గోదావరి, కృష్ణా ప్రాజెక్టులలో మళ్లీ జలకళ



**హైదరాబాద్,అక్టోబరు 31 ప్రభాతవార్త:** నాగార్జున సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద 1,46,744 క్యూసె క్కుల నీరు రావడంతో శుక్రవారం 12 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నా రు. 96,696 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తొంది. సాగర్ జలాశయం మొత్తం నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 589.60 అడుగులకు చేరుకుంది. నీటి నిల్వ సామర్థం 312 టీఎంసీలు ఉంది. మొంథా తుఫాన్ కారణంగా గోదావరి కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులలో గత రెండు రోజులుగా జలకళ మళ్లీసంతరించుకొంది. శ్రీశైలం1984 నుంచి పరిశీలిస్తే ఈ ఏడాదే శ్రీశైలం ప్రాజెక్టుకు అత్యధిక వరద వచ్చింది. మొదట జులై 8న గేట్లు తెరుచుకున్నాయి. మొత్తం తొమ్మిదిసార్లు గేట్లు తెరిచారు. దాదాపు 60 రోజులకు పైగా గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి కృష్ణా ప్రవాహం, తుంగభద్ర నది నుంచి కలిపి ఇప్పటివరకు 2,262 టీఎంసీల వరద వచ్చింది. దిగువకు 2,086 టీఎంసీలను వదిలారు. ప్రస్తుతం 74 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.జూరాలకు 28 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా అంతే కిందకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 4 లక్షల క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 2.49 లక్షలు వదులుతున్నారు.ఎస్సారెస్పీకి 1983లో 1,168 టీఎంసీలు, 1988లో 913 టీఎంసీల వరద వచ్చింది. గురువారం నాటికి 890 టీఎంసీల మేర వరద చేరింది. ప్రస్తుతం 59 వేల క్యూసెక్కుల ఇన్ ఉంది. త్వరలో ప్రాజెక్టు చరిత్రలోనే రెండో అత్యధిక వరద రికార్డు నమోదు కానుంది. మహారాష్ట్రతో పాటు మంజీర నది నుంచి వరద వస్తూనే ఉంది. ఈ ఏడాది ఆగస్టు 18న మొదటిసారి గేట్లు తెరిచారు. ఆగస్టు 27, సెప్టెంబరు 6 తేదీల్లో మాత్రమే మూసివేశారు. మిగిలిన రోజుల్లో తెరిచే ఉన్నాయి. ఇప్పటివరకు 733 టీఎంసీలు దిగువన నదిలోకి విడుదల చేశారు.చరిత్రలోనే ఈ ఏడాది అత్యధిక వరద నమోదైంది. ఎగువ నుంచి 1,368టీఎంసీలు రాగా... గురువారం నాటికి దిగువకు 1,356 టీఎంసీలను విడుదల చేశారు. ఈ ఏడాది ఆగస్టు 11న తొలిసారి గేట్లు తెరవగా... అప్పటినుంచి నిరంతరం దిగువకు నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. ఎస్సారెస్పీ, కడెంతో పాటు స్థానికంగా పెద్దవాగు తదితర ప్రవాహాలు వచ్చి చేరుతున్నాయి. ప్రాజెక్టుకు 1.56 లక్షల క్యూసెక్కులు వస్తోంది.గోదావరి పరీవాహకంలోని దిగువ మానేరుకు 23 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద 1.33 లక్షలు, భద్రాచలం వద్ద 235 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది.

## పెహాల్గాం సైనికులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి కేంద్రం అవార్డులు

### తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురి ఎంపిక

### మొత్తం 1,463 మందికి ఏక్తా అవార్డులు

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ఈ యేడాది ఏప్రిల్‌లో పెహల్గాంలో పర్యాటకులపై పాక్ ప్రేరేపిత ఉగ్ర వాదులు జరిపిన దాడి తరువాత ఉగ్రవాద ఆపరేషన్‌లో పాల్గొన్న 40 మంది సైనికులతో పాటు పారా మిలటరీ అధికారులకు కేంద్రం ప్రత్యేక అవార్డులను ప్రకటించింది. వీరిలో కా శ్మీర్ రేంజి ఐజి వికె బిర్డి, శ్రీనగర్ ఎస్‌పి సందీప్ చక్రవర్తి, జమ్మూ కాశ్మీర్ పోలీసు విభాగంలోని 19 మంది పోలీసులతో పాటు సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 21 మంది అధికారులు, సిబ్బంది కూడా ఉన్నారు. దివంగత కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ జన్మదినం సందర్భంగా అక్టోబరు 31న ప్రతీయేటా నిర్వహించే ఏక్తాదివస్ రోజున ఈ అవార్డులను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. దీంతోపాటు దేశవ్యాప్తంగా నక్సలిజంతో పాటు ఉగ్రవాదం విషయంలో ఆయా రాష్ట్రాల పోలీసులతో కలిసి పోరాడుతున్న పారా మిలటరీ బలగాలు, ఆయా రాష్ట్రాల పోలీసులు మరో 1463 మందికి ప్రత్యేక ఆపరేషన్ అవార్డులను కేంద్రం ప్రకటించింది.

ఇందులో తెలంగాణ నుంచి హెడ్ కానిస్టేబుల్ ఎ. లక్ష్మణ్ రావు వున్నారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా కీలక కేసుల విచారణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆయా రాష్ట్రాల అధికారులు మరో 93 మందికి కూడా కేంద్రం అవార్డులను ప్రకటించింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక ఎస్‌పి, మరో అదనపు ఎస్‌పిసహా ఏడుగురు అధికారులున్నారు. ఎపి నుంచి ఐపిఎస్ అధికారి అద్నాం నయీం హాష్మీ, అదనపుఎస్‌పి భీమారావు, డిఎస్‌పి జయసూర్య, ఎస్‌ఐ నసీరుల్లా వున్నారు. తెలంగాణ నుంచి ఇన్‌స్పెక్టర్లు నగరి చంద్రబాబు, ఉపేంద్రరావు, తిరుపతి ఉన్నారు. వీరితోపాటు ఫోరెన్సిక్ లాబ్ విభాగంలో విచారణాధికారులకు కీలక ఆధారాలు అందించడంలో విశేష ప్రతిభ కనబర చిన మరో తొమ్మిది మంది అధికారులకు కేంద్రం అవార్డులు ప్రకటించింది. వీరిలో ఎపి నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ఫణిభూషణ్ ఉన్నారు. వీరంతా కేంద్ర హోంశాఖ మంత్రి దక్షతా పథక్ అవార్డులను అందుకోనున్నారు.

## పదవీవిరమణ రోజు కరీంనగర్ ఇఎన్‌సిగా అనిల్‌కుమార్‌కు పోస్టింగ్

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** ఇంజొనీర్-ఇన్-చీఫ్ జనరల్ గా పదవి బాధ్యతలు నిర్వహించిన అనీల్‌కుమార్‌కు ఎట్టకేలకు పదవి విరమణ రోజున కరీంనగర్ ఇఎన్‌సిగా పోస్టింగ్ ఇవ్వాలని ఐఅండ్ సిఎడి అడ్మిన్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు శుక్రవారం ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జ ఉత్తర్వులు వెంటనే జారీచేశారు. ప్రభు త్వం కాళేశ్వరం కుంగుబాటు కారణంగా తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ ఇన్‌చీఫ్‌గా వ్యవహరించే మురళీధరావును తొలగించి అనిల్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. గుమ్మడి అనిల్‌కుమార్ ఇఎన్ సిగా బాధ్యతలు సరిగా నిర్వహించడంలేదని గతంలో ఎసిబి తనిఖీ లలో ఆదాయంకు మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ప్రాధా న్యత లేని పోస్టింగ్‌లోకి బదిలీచేయాలని ప్రభుత్వం చేసిన సూచనలు పెడచెవిన పెట్టారని ఆరోపణలు ఆయనపై వచ్చాయి. వందల కోట్లు కూడబెట్టిన నూనె శ్రీధర్‌కు వత్తాసు పలికారనే అభియోగంతో ఆయనను బదలీ చేసి ఆయన స్థానంలో జూన్‌లో మహ్మద్ అంజద్ హుస్సేన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అనీల్‌కుమార్‌ను బాధ్యతరాహిత్యంగా వ్యవహరించడంతో ఇన్నాళ్లు సెక్రటేరియట్‌లో పోస్టింగ్ కోసం ఎదురుచూశారు.

## పటేల్ దృఢ సంకల్పం నేటి తరానికి ఆదర్శం

### ఐక్యత రన్‌ను ప్రారంభించిన అగ్ర నటుడు చిరంజీవి

### పాల్గొన్న డిజిపి, సిపి తదితరులు



పీపుల్స్ ప్లాజాలో ఐక్యత రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న అగ్ర సినీనటుడు చిరంజీవి. డిజిపి శివధర్‌రెడ్డి, సిపి సజ్జనార్.

**హైదరాబాద్ (బేగంపేట) అక్టోబరు 31, ప్రభాతవార్త :** రాష్ట్ర ఏక్తా దివస్ 2025 లో భాగంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో శుక్రవారం భారతదేశ ఉక్కు మనిషి అఖండ భారత్ నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరిం చుకొని దేశవ్యాప్తంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) జరుపు కుంటున్న సందర్భంగా ఐక్యత రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కేంద్ర మాజీమంత్రి, సినీ నటుడు కొణిదెల చిరంజీవి హాజరై రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ హైదరాబాద్ సిటీ పోలీసు ఆధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటీ అనే కార్యక్రమంలో డిజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ సజ్జనార్ హాజరయ్యారు.

వీరితోపాటు సందీప్ శాండిల్య, యంయం భగవత్,విసి సజ్జనార్, తఫ్సీర్ ఇక్బాల్, జోయల్ డేవిస్, కె.శిల్పవల్లి, కె.అపూర్వరావు,ధార కవిత, లావణ్యనాయక్‌జాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మాజీమంత్రి, సినీహీరో చిరంజీవి మాట్లాడుతూ 560 ముక్కలైన దేశాన్ని ఒక్కటిచేసి వన్ నేషన్‌ను మనకు అందించిన గొప్పవరం సర్దార్ పటేల్ అని తెలిపారు. యూనిటీ ఇన్ డైవర్సిటీ అనే పటేల్ సందేశాన్ని పోలీసులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయ మన్నారు. డీప్ ఫేక్ అనేది పెద్ద గొడ్డలిపెట్టు లాంటిదని, ఈ సమస్యను డిజిపి శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సిపి సజ్జనార్ సీరియస్‌గా తీసుకుని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ప్రజలకు పోలీసు లు అండగా ఉన్నారని ధైర్యం చెప్పారు.

**జాతీయ ఐక్యత కోసం స్ఫూర్తిగా తీసుకోవాలి: డిజిపి బి.శివధర్‌రెడ్డి**

డీజీపీ బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం పరుగు మాత్రమే కాదని, అందరూ జాతీయ ఐక్యత కోసం స్ఫూర్తిగా తీసుకోవాల్సిన కార్య క్రమం అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ తన పట్టుద లతో 560కు పైగా ముక్కలైన సంస్థానాలను ఏకతా టిపైకి తెచ్చి దేశాన్ని బలోపేతం చేసారని కొని యాడారు.

**మంచి సమాజ నిర్మాణానికి పాటుపడాలి: సిపి విసి సజ్జనార్**

హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూ యువత సర్దార్ వల్ల భాయ్ పటేల్‌ను ఆదర్శం గా తీసుకుని మంచి సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని తెలిపారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలు ఆందోళణ చెంద వద్దన్నారు. ముఖ్యంగా డీప్‌ఫేక్ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని సైబర్ నేరస్థుల మూలాలపై దృష్టి సారించామన్నారు. పిల్లలు 5000, 10,000 కోసం సైబర్ నేరస్థులకు మ్యూల్ అకౌంట్స్ ఇవ్వడం వల్ల వారు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జెఎన్‌టియులో గిరిజన విద్యార్థి ఆత్మహత్య



మహేందర్ (ఫైల్)

**చౌటకూరు, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సూర్యపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామ పంచాయితీ పెద్దరాజు తండాకు చెందిన విద్యార్థి బానోత్ మహేందర్(20) శుక్రవారం సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలంలోని సుల్తాన్‌పూర్‌లోని జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కళాశాలలో తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేసి తను ఉండే మానేరు బ్లాక్‌లో 304వ గదికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేరుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మహేందర్ ఎంతకూ తరగతి గదికి రాకపోవడంతో విద్యార్థులు 304వ గదికి చేరుకుని మూసి ఉన్న తలుపులను పగలగొట్టి పరిశీలించగా మహేందర్ ప్యాన్‌కు వేలాడుతూ విగత జీవిగా కానరావడంతో విద్యార్థులు ప్రిన్సిపాల్ విశ్వనాథం రాజుకు సమాచారం అందించారు. ఉరివేసున్న మహేందర్‌కు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆసు పత్రికి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే విద్యార్థి తిరిగిరాని లోకాలకు చేరిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఓ, డిఎస్‌పి**

సుల్తాన్‌పూర్ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకున్న ఆర్‌డిఓ పాండు, డిఎస్‌పి సత్తయ్య, జోగిపేట సిఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ విశ్వజన్, తహసీల్దార్ నామాల కిష్టయ్య, గార్దవార్ ప్రమోద్‌కుమార్‌లు సంఘ టన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విశ్వజన్ వివరించారు.



## భారత్-అమెరికాల మధ్య పదేళ్ల కాలానికి రక్షణరంగ ఒప్పందం

**కౌలాలంపూర్, అక్టోబరు 31:** అమెరికా భారత్‌లమధ్య ట్రేడ్‌వార్ జరుగుతున్న తరుణంలో రెండుదేశాలమధ్య పదేళ్లకాలానికి రక్షణరంగంలో పరస్పర సహకారం మరింత పటిష్టంచేసుకోవాలన్న ఒప్పందం జరిగింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్‌లమధ్య జరిగిన చర్చల అనంతరం ఈ ఒప్పందంపై సంతకాలుజరిగాయి. భారత్ అమెరికా రక్షణ భాగస్వామ్యంలో అన్ని అంశాలను ఈ ఒప్పందం స్పృశిస్తుందని అన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇదొక కీలక సంకేతలమని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణరంగం అనేది కీలకంగా నిలుస్తోంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో నిబంధనల ఆధారిత స్వేఛ్ఛాయుత సహకారం అనేది కొనసాగుతుందని రక్షణ మంత్రి తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్లప్రాంతీయ స్థిరత్వం, అశాంతికి కళ్లెం పడుతుందని ఆశాభావం వ్యక్తంచేసారు. రక్షణరంగంలో అధునాతన టెక్నాలజీ భాగస్వామ్యం, సాంకేతిక సహకారం కూడా పెరుగుతాయని, దీనివల్ల రెండు దేశాలమధ్య అధునాతన రక్షణ సాంకేతికతను బదలీచేసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ఆగ్నేయాసియా రక్షణమంత్రుల సమావేశం సందర్భంగా రెండుదేశాల రక్షణమంత్రులు కౌలాలంపూర్‌లో భేటీ అయ్యారు.

## ఆర్థిక మోసగాడిని తప్పించిన కేసులో మరికొందరు అధికారుల ప్రమేయం

### సతీష్ కోసం కొనసాగుతున్న గాలింపు

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** బడా ఆర్థిక నేరగాడు ఉప్పలపాటి సతీష్‌ను అదుపులోకి తీసుకుని రెండు కోట్ల రూపాయల డీల్ కుదిరిన తరువాత వదిలేసిన ఆరోపణలపై సస్పెండ్ అయిన టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ ఉదంతంలో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కే సులో శ్రీకాంత్ గౌడ్‌తో పాటు మరికొందరు టాస్క్‌ఫోర్స్ అధికారుల ప్రమేయం వుందని వార్తలు వస్తున్నాయి. ముంబాయి కేంద్రంగా షెల్ కంపెనీ లను ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా వేలాది మంది నుంచి 350 కోట్ల రూపాయలకు పైగా డబ్బులు వసూలు చేసి బిచాణా ఎత్తేసిన కేసులో సతీష్ ప్రధాన నిందితుడు. ముంబాయిలోని అంధేరిలో ఇతను రహస్యంగా వుంటున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ తన బృందంతో అక్కడికి వెళ్లి, నిందితుడిని పట్టుకుని హైదరాబాద్‌కు వస్తుండగా సంగారెడ్డి సమీపంలో ఒక దాబా వద్ద అతను తమ కళ్లుగప్పి పా రిపోయినట్లు ఎస్‌ఐ ఉన్నతాధికారులకు తెలిపాడు. అయితే దీనిపై అనుమానం వచ్చిన ఉన్నతాధికా రులు ఈ ఉదంతంపై ఆరా తీయగా సదరు ఎస్ ఐ రెండు కోట్ల రూపాయల డీల్ కుదుర్చుకుని నేరగాడు సతీష్‌ను వదిలేసినట్లు తేలడంతో దీనిపై వారు కొత్వాల్ సజ్జన్నార్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. దీనిపై టాస్క్‌ఫోర్స్‌లోని సీనియర్ అధికారిచేత విచారణకు ఆదేశించారు. కా గా ఈ విచారణలో ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు మరికొందరి ప్రమేయం వుందని వార్తలు వస్తున్నాయి. ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ తీసుకున్న డబ్బులో కొంతభాగం పై అధికారులకు అందజేసినట్లుగా ఉన్నతాధికారుల విచారణలో వెల్లడయ్యిందని తెలిసింది. దీనిపై మరింత లోతుగా విచారణ జరుగు తోంది. ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్‌కు సహకరించిన పై అధికారుల గురించి ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. వీరిపైనా వేటు పడే వీలుందని సమాచా రం. మరోవైపు తప్పించుకున్న ఆర్థిక నేరగాడు సతీష్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ముంబాయికి ప్రత్యేక బృందాలు వెళ్లగా అక్కడి పో లీసుల సహకారంతో గాలింపు కొనసాగుతోంది. సతీష్ అనుచరులు. కుటుంబ సభ్యులను ముంబాయి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చే స్తున్నట్లు తెలిసింది.

## హైదరాబాద్‌లో ఆగని డిజిటల్ అరెస్టు మోసాలు

### బాంబు పేలుళ్ల కేసులో నిందితుడివంటూ బెదరించి

### విశ్రాంత ఉద్యోగికి నుంచి రూ.51 లక్షల టోకరా

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** హైదరా బాద్‌లో డిజిటల్ అరెస్టు మోసాలు ఆగడం లేదు. ఓవైపు పోలీసులతో పాటు సైబర్ నిపుణులు డి జిటల్ అరెస్టుపై ఎన్ని ప్రకటనలు చేసినా సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలు చేస్తూనే వున్నారు. తాజాగా హైదరాబాద్‌లో ఇటువంటిదే మరో మోసం వెలుగు చూసింది. ఓ విశ్రాంత ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు బాంబు పేలుళ్ల కేసులో నిందితుడుగా వున్నావని బెదిరించి 51 లక్షల రూపాయల ను కాజేశారు. నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన 78 ఏళ్ల విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి వారం రోజుల క్రితం గుర్తు తెలియని నంబర్ నుం చి ఫోన్ వచ్చింది. ఇందులో సైబర్ నేరగాళ్లు తాము ముంబాయి క్రైం బ్రాంచ్ పోలీసులమని చెప్పి సదరు వృద్ధుడిని హడలెత్తిం చారు. మొదట ఓ వ్యక్తి తాను ఏసిపినని బెద రించగా ఆ తరువాత మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లమని భయపెట్టారు.

నీవు వాడుతున్న సెల్‌ఫోన్‌లో వున్న సిం కార్డు ముంబయి బాంబుపేలుడులో వాడినట్లు తమకు ఆధారాలు లభించాయని, నీపేరు మీద మరిన్ని సిం కార్డులు వున్నట్లు భయ పెట్టారు. నీపై నోటీసులు జారీ అయ్యాయి అంటు నకిలీ నోటీసులను వాట్సాప్ ద్వారా పంపారు. అనంతరం డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు చెప్పి వెంటనే తాము చెప్పిన బ్యా ంకు ఖాతాలకు 51 లక్షల రూపాయలు బదిలీ చేయాలని భయపెట్టి మళ్లించుకున్నారు. దీని తరువాత సైబర్ నేరగాళ్ల సెల్‌ఫోన్‌ను స్విచాఫ్ చేయడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో సైబర్ నేరగాళ్ల విదేశాల నుంచి ఫోన్ చేసినట్లు తేలగా బ్యాంకు ఖాతాలు మ్యూల్ ఖాతాలుగా తేలింది. మ్యూల్ ఖాతాలు అందించిన వారు భారత్‌కు చెందిన వారుగా తేలింది. వీరి ని గుర్తించేందుకు సైబర్ క్రైం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. నగరంలో వారం రోజుల క్రితం ఇటువంటిదే ఒక మోసం జరిగింది. 73 ఏళ్ల ఓ వృద్ధు రాలిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి 1.43 కోట్ల రూపాయలను కొట్టేశారు. చైల్డ్ ట్రాఫికింగ్, హత్య కేసుల్లో నీవు వున్నట్లు ఆమెను బెదరించిన నేరగాళ్లు ఈ డబ్బును కాజేశారు.

## నిజాయితీగా పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటాం

### కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** నిజాయితీగా పనిచేయడం వల్ల మనం అనుకున్న లక్ష్యాలను తప్పకుండా చేరుకుంటామని కేంద్ర విద్యా శాఖ కార్యదర్శి ఎస్‌హెచ్ సంజయ్ కుమార్ అన్నారు. విద్యార్థులు విలువైన విద్యను పొందాలంటే పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ విద్య డైరక్టర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనతోపాటు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. సంజయ్ కుమార్ ఎఎక్స్ఎల్ ల్యాబ్‌ను సందర్శించి ఎఫ్ఎల్ఎన్‌లో విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షి ంచి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను గమనించి వారిని ఎంతగానో ప్రశంసించారు. కార్యక్రమంలో ఏర్పాటుచేసిన వివిధ ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శిస్తూ విద్యార్థుల వివరణను ఎంతో ఆసక్తిగా వింటూ వారిని ప్రోత్సహించారు.

వార్త

హంస ఏ విధంగా నీటిని వదిలి పాలను మాత్రమే గ్రహిస్తుందో, సాధకుడు అదే విధంగా శాస్త్రాలలోని సారాన్ని గ్రహించి, మిగిలింది విడిచిపెడతాడు.

-ఖలీల్ జిబ్రాన్

# నిరర్థక ప్రయోగాలేల!

వరుణుడి కటాక్ష వీక్షణాల కోసం రాజధాని నగరం ఎదురుచూస్తున్నా ఒక చుక్కనీరు కూడా కురవలేదు. కాలుష్యం తగ్గాలంటే వర్షం కురిస్తే సరిపోతుందని ఎవరు సెలవిచ్చారో కానీఢిల్లీ పాలక వర్గం 'క్లౌడ్ సీడింగ్' ప్రక్రియను చేపట్టింది. ఎంతో ఖర్చు చేసింది.అయినా ఢిల్లీ కాలుష్యం ఇప్పటికీ ఏక్యూఐ 375 వద్దనే ఉంది. అంటే అనుకున్నది సాధించడంలో వారి పథకాలు అంచనాలు ఫలవంతమైనట్లే కదా! చరిత్ర లో ఎన్నడూ ఏ ప్రాంతంలోనూ 'క్లౌడ్ సీడింగ్' ప్రక్రియ ఫలవంతమైన రికార్డులేవీ నమోదు కాలేదు. బుధవారం వరకు మూడుసార్లు మేఘాల సీడింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. శుక్రవారం నాటికి కూడా ఎలాంటి వర్షపాతమూ ఢిల్లీ ఛాయల్లో నమోదు కాలేదు. ఈ ప్రాజెక్టును కాన్పూరు ఐటిఐ నిపుణుల అంచనాల ప్రకారం మేఘాల తేమను బట్టి 24 గంటల్లో ఎప్పుడైనా వర్షాలు పడవచ్చునని విశ్వాసంతో ఎంతో వ్యయపరచి 'క్లౌడ్ సీడింగ్' ప్రయోగాలు చేశారు. అయితే ఢిల్లీ నోయిడా బోర్డర్‌లో 0.1 నుంచి 0.2 మి.మీ తేలిక పాటి వర్షపాతం నమోదైందని ఈ ప్రయోగాన్ని నిర్వహించిన సంస్థ చెబుతోంది. తొలి సీడింగ్ న్యూఢిల్లీలోనూ, రెండోది మీరట్‌లోనూ ఆ సంస్థ విమానం నుంచి క్లౌడ్ సీడింగ్ జరిపినట్లు సమాచారం. నగరంలోని ఖేక్రా, బురా, విహార్,సడక్‌పూర్, భుజ్‌పూర్, నార్త్ కరోల్‌బాగ్, మయూర్‌లలోను, బురారి, మయూర్ విహార్, ఖేక్రా, పాలిస్ కుక్‌పూర్, నోయిడా, భోజ్‌పూర్, మోడినగర్‌లలో జరుగగా తమ ప్రయోగాలు పరిపక్వదశ కు వచ్చినట్లు ప్రయోగసంస్థ ప్రకటించింది. 25పాయింట్ల వాయుకాలుష్యాన్ని తగ్గించే ప్రక్రియలో భాగంగా జరిగినా ఎలాంటి ప్రయోజనం కనపడలేదు. వర్షపు బిందువు కూడా ఎవరికీ కనపడలేదు. కాలుష్యరహిత రాజధానిగా చేయడానికి ఢిల్లీ ప్రభుత్వాలు చేపట్టని ఆలోచన లేదు. చేయని ప్రయోగమూ లేదు. ఎన్నో విధాలుగా వాహనా లను క్రమబద్ధీకరించినా, ఎంత కట్టడిచేసినా ఇసుమంతైనా కాలుష్య తీవ్రత తగ్గలేదు. జూన్ 2025లో సీడింగ్ ప్రణాళికను చేపట్టారు. కృత్రిమ వర్షంగా పిలువబడే 'క్లౌడ్ సీడింగ్' సాంకేతికత ఎందుకు విఫలమైందో శాస్త్రజ్ఞులు ఎవరూ చెప్పలేకపోతున్నారు. అలాంటి ప్రయోగాలకు వరుణుడు కరుణిస్తాడని ఆ మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వానలు రాని తరుణంలో పంటలు ఎండిపోకూడదని, సామాన్యుని ఆహార భద్రతకు ఎలాంటి లోటు రాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో చేపట్టారు. ఫలితం శూన్యం. ఆ తర్వాత కూడా ఇదే లక్ష్యంతో కృత్రిమ వర్షం కురిపించాలన్నా సాధ్యం కాలేదు. పాలకులకు అదొక విఫల మనోరథంగా మిగిలిపోయింది. రాష్ట్ర ఖజానాకు చేతి చమురు మాత్రం వదిలింది అని సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తాజాగా ఢిల్లీ ప్రభుత్వం వేరొక లక్ష్యంతో కృత్రిమ వర్షం కురిపించే ప్రయత్నం చేసింది. కానీ ఫలితం లేదనే చెప్పాలి. ఇక్కడి ఢిల్లీ క్లౌడ్‌సీడింగ్ ప్రయోగం విషయమై కాన్పూరు ఐటిఐ శాస్త్రజ్ఞులు చెబుతున్న విషయాలను పరిశీలిస్తే ప్రతి నీటి చుక్క పరిమాణం సుమారు 0.05 మిల్లీ లీటర్లు ఉంటుంది. కనుక వారిలెక్కల్లో కొన్ని చుక్కలు నీరు కురిసినట్లే.కేవలం ఈ అంచనాలు కారణంగా మేఘనాధుడు వర్షించినట్లు భావించడం హాస్యాస్పదం అవుతుంది.అదీగాక కాలుష్య తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. కనుక ఈ ప్రయోగం ఫలవంతమైనట్లు కాదు. కేవలం కరువుల సమయంలో వర్షాన్ని ప్రేరేపించడానికి ప్రయోగించే పాత సాంకేతిక మార్గం 'కృత్రిమ వర్షం'. 1950లో తొలిసారిగా ప్రభుత్వం 'క్లౌడ్ ఏరోసావ్ ఇంటరాక్షన్ అండ్ ప్రిసిపిటేషన్ ఎన్‌హాన్స్‌మెంట్ ఎక్స్‌పెరిమెంట్' ద్వారా పశ్చిమ కనుమలలో పరిశోధించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటీయోరాలజీ ఆధ్వర్యంలో జరిగింది. ఇలాంటి ప్రయోగాలకు థాయ్‌లాండ్‌లో ప్రత్యేకించి రాయల్ రెయిన్ మేకింగ్ అండ్ అగ్రికల్చరల్ ఏవియేషన్ విభాగం ఉంది. ఎన్నో దేశాలు 'కృత్రిమ వర్షం' కురిపించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కానీ అవన్నీ వర్షాకాలంలో చినుకుపడని ప్రాంతాల కోసమే నిర్దేశించుకున్నారు. కాగా కాలుష్యాన్ని తీవ్రతను తేలిక చేయడానికి క్లౌడ్ సీడింగ్' కొత్తప్రయత్నమే. లాహోర్, చైనా కౌలాలంపూర్, థాయ్‌లాండ్ వంటి దేశాలు విఫలయత్నం జరిగి ఈ ప్రయోగాన్ని వదిలిపెట్టాయి. వాయుకాలుష్య నాణ్యతను మెరుగుపరిచే ఇలాంటి ప్రయోగాలు గతంలో ఎన్నడూ వర్షపాతాన్ని నమోదు చేయలేదన్న అనుభవాలను ఢిల్లీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. ఏదో ప్రయత్నం చేయాలన్న తపనతోనే ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టినట్లయింది. వర్షాభావ పరిస్థితులలో వర్షపాతం పెంచేందుకు 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 'క్లౌడ్ సీటింగ్' చేపట్టినా ఫలితం దక్కలేదు.శాస్త్రీయ ధృవీకరణ లేని ప్రయోగాలకు ప్రభుత్వాలు ఎందుకు పూనుకుంటాయో ఎవరికీ అర్థంకాదు. లక్ష్యం మంచిదే అయినా వ్యర్థ ప్రయోగాలుగా నిరూపితమైనప్పుడు ఖజానాకు భారం తెచ్చే ఇలాంటి ప్రయోగాలు మంచివి కావేమో! 2024లో ఈవిధమైన ప్రయోగాలు శాస్త్రీయంగా ఫలవంతం కాదని, అదీ ఢిల్లీలో కాలుష్యనాణ్యతను క్రమబద్ధీకరించడానికి అసలు ఉపయోగపడదని, సాధ్యం కాదని పార్లమెంట్‌కు నివేదిక కూడా సమర్పించింది.అయినా ఈ విఫల ప్రయత్నం ఎందుకు జరిగిందో ఢిల్లీ పాలకులే చెప్పాలి. ఢిల్లీలో కాలుష్యం తగ్గాల్సిన అవశ్యకత ఉన్నది నిజమే.దీని విషయంలో వేర్వేరుప్రయత్నాలు కనుగొనడమే శరణ్యం. కీలకరిగి వాత పెట్టాల్సిన అంశాల్లో రాజకీయ నిర్ణయాలు నిరర్థకమే అవుతాయి. నిరర్థక ప్రయోగాలకు నిర్ణయించడం కాలుష్య నివారణకు ఏదో ఒకటి చేస్తున్నదనే భావన ఢిల్లీ ప్రజల్లో కలిగించడానికేనా అనే భావన కలుగుతుంది.

విలువలు పతనమవడం కన్నా, విలువల పట్ల విశ్వాసం క్షీణించడం మరింత ప్రమాదకరం.



రాబర్ట్ లూయి స్టీవెన్ సన్

అవమానించేవాడు ఇసుకపై రాతలాగా వెంటనే దాన్ని విస్మరిస్తాడు. అవమానానికి గురైన వాడు ఇతడిపై చెక్కిన రాత లాగా ఎన్నటికీ మరిచిపోడు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రమాదాల పాపం తలా పిడికెడు!

**ఎవరో చేసిన తప్పు ఏకంగా పంతొమ్మిది మంది సజీవ దహనానికి కారణమైంది. నిద్రలో ఉన్నవారిని అటు నుంచి అటే శాశ్వత నిద్రలోకి పంపింది. కొన్ని కుటుంబాలను చిదిమేసి శాశ్వత చీకట్లు నింపింది. నిమిషాల వ్యవధిలో కొన్ని కుటుంబాలు, మరికొన్ని కుటుంబాల పెద్దదిక్కులు భవిష్యత్తు ఆశలు అగ్నికీలలకు ఆహుతయ్యాయి. ఇంతటి ఘోరవిషాదానికి కారణాలు ఏమిటి, కారకులు ఎవరో తదితర అంశాలపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఇందులో తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు పాలకపెద్దలతోపాటు, అధికారగణంతోసహా అందరూ భాగస్వాములు అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'నీ చేతన్ నా చేతన్ వరమడిగిన కుంతి చేతన్, వాసవి చేతన్, ధరచేత,శల్యుచేత అరయంగా కర్ణుడీల్గె ఆరుగురిచేతన్.. అన్నట్లు ఈ విషాద సంఘటనకు ఎవరు కారకులో? కారణాలు ఏమిటి? ఎవరి పాత్ర ఎంత? ఎవరెవరిని నిర్లక్ష్యంపాలెంత? తదితర అంశాలు పెద్దగా పరిశోధించాల్సిన అవసరం లేదు**

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. వీటిలో ఎక్కడ లోపం ఉన్నా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేం. దేశంలో అంతకంతకు పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలు ఏమిటో తెలుసు, కారకులు ఎవరో తెలుసు. ఎందుకు ఈ ప్రమాదాలు జరుగుతున్నాయో, ఎలా వాటిని నివారించవచ్చో కూడా తెలియనిది కాదు. అమాయకుల ప్రాణాలు తీస్తున్న ఈ ప్రమాదాలకు అడ్డుకట్టవేసేందుకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు చేస్తున్నట్లు పాలకులు చెప్పుకోవడమే కాదు, అందుకోసం ఎన్నో చట్టాలు తెచ్చారు, తెస్తున్నారు. కాలానుగుణంగా సవరణలో మార్పులు చేస్తున్నారు. భారీ ఎత్తున జరిమానాలు విధిస్తున్నారు. కోట్లాది రూపాయలు జరిమానాల రూపేణ ఆదాయం వస్తున్నది. అయినా రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఇందుకు సామర్థ్యంతోపాటు అమల్లో త్రికరణశుద్ధి లేకపోవడమే. ఈ పార్టీ ఆ పార్టీ అని కాదు అధికారంలో ఎవరుఉన్నా ఈ ఘోరాలు ఆగడంలేదు. గత శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లాలో చోటు చేసుకున్న మహావిషాదం గుండెలను పిండేసింది. ఎవరో చేసిన తప్పు ఏకంగా పంతొమ్మిది మంది సజీవ దహనానికి కారణమైంది.నిద్రలో ఉన్నవారిని అటు నుంచి అటే శాశ్వత నిద్రలోకి పంపింది. కొన్ని కుటుంబాలను చిదిమేసి శాశ్వత చీకట్లు నింపింది. నిమిషాల వ్యవధిలో కొన్ని కుటుంబాలు, మరికొన్ని కుటుంబాల పెద్దదిక్కులు భవిష్యత్తు ఆశలు అగ్నికీలలకు ఆహుతయ్యాయి. ఇంతటి ఘోరవిషాదానికి కారణాలు ఏమిటి, కారకులు ఎవరో తదితర అంశాలపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఇందులో తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు పాలకపెద్దలతోపాటు, అధికారగణంతో సహా అందరూ భాగస్వాములు అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'నీ చేతన్ నా చేతన్ వరమడిగిన కుంతి చేతన్, వాసవి చేతన్, ధరచేత,శల్యుచేత అరయంగా కర్ణుడీల్గె ఆరుగురిచేతన్.. అన్నట్లు ఈ విషాద సంఘటనకు ఎవరు కారకులో? కారణాలు ఏమిటి? ఎవరి పాత్ర ఎంత? ఎవరెవరి నిర్లక్ష్యం పాలెంత? తదితర అంశాలు పెద్దగా పరిశోధించాల్సిన అవసరం లేదు.రహదారుల పక్కన మద్యాన్ని అందుబాట్లు ఉంచిన పెద్దలది మొదటి తప్పు, సీట్లను పడకలుగా మార్చడంతోపాటు ఎన్నో నిబంధనలు అతిక్రమించి యధేచ్ఛగా అక్రమంగా వాహనాలను నడుపుతున్న బస్సు యాజమాన్యాలది. రోడ్లపై పడ్డ గుంతలను మరమ్మత్తు చేయకుండా నిర్లక్ష్యం వహించిన రోడ్లుభవనాల శాఖ, వీటిన్నింటిని మించి వేలాది వాహనాలు ఇన్ని అవకతవకలతో నిబంధలకు విరుద్ధంగా రోడ్లపై వీరవిహారం చేస్తూ మారణహోమం సృష్టిస్తున్న మా చిన్ని పొట్టకు శ్రీరామ రక్ష అన్నట్లు అవినీతి కూపంలో మునిగి తేలుతున్న రోడ్డు రవాణా శాఖ, ఇక పోలీసు శాఖ గూర్చిఎంత తక్కువ చర్చిస్తే అంత మంచిదేమో. నిత్యం రోడ్లపై చెకింగ్ చేస్తుంటారు. సామాన్యులు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ పరిమితి దాటితే వేలాది రూపాయల జరిమానాను ముక్కుపిండి వసూల్ చేసే పోలీసులు నిత్యం కొన్ని ట్రావెల్స్ బస్సులు గంటకు120నుండి 140కిలోమీటర్లుకు పైగా వేగంతో నడిచే బస్సులను ఎందుకు పట్టించుకోరు. వారి తనిఖీలో సీటకు అనుమతి లేకుండా పడకలుగా మార్చిన అతిక్రమణలతో పాటు మరెన్నింటినో ఎందుకు పట్టించుకోలేదు.కొన్ని సందర్భాల్లో చలాన్లు వేసినా నెలల తరబడి అవి చెల్లించకపోయినా చర్య లు తీసుకోవడానికి చేతులు రావు. ప్రస్తుతం 19 మంది అమాయకులను పొట్టన పెట్టుకొన్న బస్సుపై కూడా తెలుగు రాష్ట్రాల్లో వేలాది రూపాయలు చెల్లించాల్సిన చలాన్లు నెలలతరబడి పెండింగ్‌లో ఉన్నాయి.అవినీతి కంటే వీటిలో రాజకీయజోక్యం ఉండడంతో సమర్థులు అంతో ఇంతా నిజాయితీ అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు. ఫలితంగా దేశంలో నిత్యం రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా పరిశీలిస్తే 2001 నుంచి 2020 వరకు రెండు దశాబ్దాల్లో తొంభైఆరు లక్షల అరవై వేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవైమూడు లక్షల ఇరవైఐదువేల మంది మృత్యువాతపడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైనవారి సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత నాలుగేళ్లలో ఇరవై తొమ్మిది వేల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయస్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి నిస్సహాయంగా రోడ్ల పైనే ప్రాణాలు వదిలినవారు వేల సంఖ్యలోఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్ లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోరవిషాదానికి మద్యమే కారణమనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు జిల్లాకు చెందిన శివశంకర్ అనే యువకుడు అతని మిత్రుడితో కలిసి అర్థ రాత్రి వరకు మద్యం సేవించిన తర్వాత ఆ మైకంలోనే బయలుదేరారు.మధ్యలో పెట్రోలు పంపువద్ద ఆగి పెట్రోలు పోయించుకొని వెళ్లే క్రమంలో వాహనం నడిపిన తీరు సిసికెమెరా పరిశీలిస్తే ఎంతటి మత్తులో ఉన్నాడో బోధపడుతుంది. ఆ మత్తులోనే కొంతదూరం వెళ్లి డివైడర్‌కు ఢీకొట్టి పడిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. వెనుక కూర్చొని ఉన్న అతని మిత్రుడు ఎర్రి స్వామి రోడ్డుపైనున్న మోటారు సైకిలును పక్కకు లాగేందుకు విఫల ప్రయత్నం చేశాడు. రెండు బస్సులు అదే రోడ్డుపై మోటార్‌సైకిల్ పక్కనుండే వెళ్లిపోయాయి. అదే సమయంలో ఇప్పుడు ప్రమాదానికి గురైన బస్సుఆ మోటార్ సైకిల్‌ను ఈడ్చుకొంటూ మూడువందల మీటర్ల వరకు పోయింది. మోటార్ సైకిల్ రాపిడికి నిప్పురవ్వలు వచ్చి బస్సు అంటుకున్నది. ఏం జరుగుతుందో తెలియని గాఢ నిద్రలో ఉన్న వారికి ఒక్క సారిగా పొగ చుట్టుముట్టింది. దీనికితోడు ఆ బస్సులో ఉన్న హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు పంపుతున్న పార్సిల్లో నాలుగువందల సెల్‌ఫోన్లకు మంటలు అంటుకోవడంతో అవి భారీశబ్దాలతో పేలుళ్ల మొదలయ్యాయి. కొందరు అతికష్టంగా బయటపడి ప్రాణాలు కాపాడుకోగలిగారు. పంతొమ్మిది మంది సజీవదహనం అయ్యారు. మృతదేహాలు నల్లని ముద్దలుగా మారిపోయాయి. ఒక్కొక్క కుటుంబానిది ఒక్కో విషాదగాథ. ఇలా ప్రమాదాల్లో పెద్ద ఎత్తున చనిపోయినప్పుడు అధికారగణం చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. తనిఖీలు, జరిమానాలు, వాహనాలు సీజ్ చేయడం లాంటివి ఎన్నో చేస్తారు. పాలక పెద్దలుకూడా అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండాకఠిన చర్యలు తీసుకుంటామని, పొరపాట్లు, తప్పులు చేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రకటనలు ఇస్తుంటారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యదర్శి రాఘవేంద్రరావు విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన స్కూటర్‌పై వెళ్తుండగా స్థానిక లోకల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. దీనిపై ఆగ్రహించిన ఎన్టీఆర్ హుటాహుటిన విజయవాడకు తరలివెళ్లారు.మొత్తం యంత్రాంగమే అక్కడికి చేరుకున్నది.సమీక్షలు చేశారు. ఇటువంటివి మళ్లీ మళ్లీ జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులకు అప్పగించారు. అప్పటి నుంచి ఎన్నో చట్టాలు తెచ్చారు, సవరణలు చేశారు. రోడ్డు భద్రతా సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులు, చేర్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షించేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ హోదా కలిగిన అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. వ్యక్తుల మీద కోపంతో వ్యవస్థను కూలదోశారనేందుకు ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ.ఇక కొన్ని రాష్ట్రాల్లో డ్రైవింగ్ లైసెన్సు జారీ ఒక పెద్ద ప్రహసనంగా మారిందని, కనీసం సంతకం చేయలేనివారు లైసెన్సులు పొందుతున్న విషయం కూడా బయటపడింది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదానికి బస్సు డ్రైవర్‌కు పదోతరగతి ఫేక్ సర్టిఫికెట్‌తో లైసెన్సులు పొందినట్లు పోలీసులే చెబుతున్నారు.అన్నిటికంటే మించి మద్యం వాడకం రోడ్డు ప్రమాదాలను పెంచుతున్నదనేది కాదనలేని వాస్తవం. రహదార్ల వెంట ఉన్న మద్యం షాపులు వాహన డ్రైవర్లను మత్తులో ముంచుతున్నాయి. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాలను పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ఈప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు ఆత్మీయులను కోల్పోయి తల్లడిల్లిపోతున్నాయి. కోట్ల సంఖ్యలో అంగవైకల్యంతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవంలా బతుకులు ఈడుస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి. •

## ఒక్క మాట

# కేన్సర్‌కు దారి తీస్తున్న టాటూ కల్చర్

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్యకాలంలో టాటూ కల్చర్ విపరీతంగా పెరిగిపోవడమే కాదు నేటి యువత దానిని వెలం వెర్రిలా ఆరాధించడం మరీ శృతిమించిపోయింది అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఒకప్పుడు కేవలం సూదితో పొడిచే పచ్చబొట్టు చాలా ప్రత్యేకంగా ఉండేది. అయితే అది ఆరోగ్యాని కంటే సంప్రదాయానికి ప్రతీకగా కొనసాగింది. ఇప్పుడు అదే పచ్చబొట్టు ఫ్యాషన్‌గా రూపాంతరం చెంది అది నేటి యువతకు ఒక వ్యసనంగా సైతం మారిపోయింది అనే మాట సత్యదూరం కాదు. ముఖ్యంగా పూర్వం కలప బూడిదతో, నూనె, పసుపు కాల్చిన మసితో మూలికలను జోడించి పచ్చబొట్టు సిరాలను తయారుచేసేవారు.అయితే అవి మానవాళి ఆరోగ్యానికి ఏ మాత్రం హానిచేసేవి కావు.కానీ నేడు వేసే టాటూలలో రకరకాల ఫిగ్మెంట్స్‌తో తయారు అయిన కెమికల్ ఇంకును వాడుతున్నారు.పైగా ఏది ఎంత మోతాదులో వాడుతున్నారు అనే దానికి సరైన తూకం సైతం లేదు. అంతేకాకుండా ఇటీవల అమెరికా సైంటిస్టులు టాటూ ఇంక్స్ మీద పలు పరిశోధనలు చేసి వారు ఒక దిగ్భ్రాంతికరమైన,షాకింగ్ విషయాన్ని బయటపెట్టారు. అదేమంటే టాటూల కోసం ఉపయోగించే ఇంకుల్లో క్యాన్సర్ కారకం ఉందని చాలా స్పష్టంగా తెలియజేయడంతో నేటి సమాజంలో ఇది ఒక ఆందోళనకరమైన పరిణామంగా పరిణమించిది అనే మాటసత్యదూరం కాదు. అంతేకాదు స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌కు చెందిన సైంటిస్ట్ స్వియార్క్ నేతృత్వంలో దాదాపు వంద రకాల టాటూ ఇంకులను పరీక్షించారు.సైంటిస్టులతో పరీక్షించిన 100 ఇంకుల్లో 23 ఇంకుల్లో అజో అనే సింథెటిక్ రంగుల ఉనికిని గుర్తించారు. సాధారణంగా అజో సింథెటిక్ రంగులను ఆహార పదార్థాల,సౌందర్య ఉత్పత్తులు,దుస్తుల తయారీలో ఉపయోగిస్తుంటారు.ఇందులో బ్యాక్టీరియా చేరిన,అధిక సూర్యరశ్మి తగిలినా క్యాన్సర్ కారకంగా మారి మానవాళి ప్రాణాలకు హాని తలపెడతాయని బల్లగుద్ది మరీ చెప్పారు. ఇంకా చెప్పుకుంటూపోతే ఈ టాటూ కల్చర్ వల్ల విచ్చలవిడిగా టాటూ వేయించుకున్న వారికి కొన్ని రకాల చర్మ వ్యాధులు, హెపటైటిస్ ఏ,హెపటైటిస్ బీ,హెచ్ఐవీ వంటి ప్రాణాంతకర వ్యాధులు సోకే ప్రమాదం సైతం ఉండటం ఎంతైనా భీతి గోల్పే,దిగ్భ్రాంతికరమైన విషయం.అందుకే ఇలా టాటూలు తమ శరీరంపై విచ్చలవిడిగా వేయించుకునే ఆలోచన వున్నవారు ఒక్క విషయాన్నీ ఎలాంటి పరిస్థితుల్లో మరువరాదు.అదేమంటే టాటూలు వేయించుకున్నవారుప్రభుత్వ ఉద్యోగులైనా పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్ ),ఇండియన్ ఫారిన్‌సర్వీస్ ( ఐఎఫ్ఎస్ ) వంటి ఉద్యోగాలు ఒంటిపైన పచ్చబొట్లు వుంటే ఎట్టి పరిస్థితుల్లో రావు కాకరావు. అంతేకాదు ఈ టాటూలు వేయించుకొన్నవారికి రక్తదానాలు సైతం చేసేందుకు కూడా అనుమతి ఉండదు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కాస్తంత వివేకంతో, పరిణతితో అలోచించి వీలైనంతవరకు ఈ టాటూల సంస్కృతికి దూరంగా ఉంటే అది మన ఇంటికి, వంటికి ఎంతో మంచిది.ఏదిఏమైన ఇప్పటికైనా అర్థం పర్థం లేని ఓ ఫ్యాషన్ లా, ఓ వెలం వెర్రిలా టాటూ కల్చర్‌వైపు యమస్పీడుగా దౌడుతీస్తున్న నేటి యువత కాస్తంత స్పీడుతగ్గించి ఒక్కసారి దీనివల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఆత్మావలోకనం చేసుకొని తమ శరీరాలపై టాటూలు వేయించుకోవాలనే విపరీత ధోరణికి వీలైనంత త్వరగా స్వస్తిచెప్పగలిగితే, అటు ఆరోగ్యరీత్యా,ఇటు వారి భవిష్యత్‌కు సైతం ఎంతో సర్వదా శ్రేయస్కరం. •

# ప్రజావాక్కు



### కాళేశ్వరం ఆలయంలో సమస్యల తిష్ట

జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో భక్తులు గోదావరిలో పుణ్యస్నానం చేసి దేవాలయాన్ని సందర్శిస్తారు. గోదావరి మెట్ల నుండి నీరు వుండే ప్రదేశం వరకు అపరిశుభ్రంగావుంది.ఎక్కడచూసినాచెత్తప్లాస్టిక్ కవర్స్ బాటిల్స్ గుట్టలుగా పేరుకుపోయాయి. ఆలయ కమిటీ దేవాదాయ శాఖ సిబ్బంది వున్నా ప్లాస్టిక్ కవర్స్ తొలగించడంలో నిర్లక్ష్యంవహిస్తున్నారు. అలాగే అద్దె గదుల నిర్వాహకులు అద్దె ఎక్కువ వసూలు చేస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. దుకాణాదారులు ఎక్కువ రేటుకు వస్తువులు విక్రయిస్తూ జేబులు గుల్ల చేస్తున్నారు. గుడి ముందు యాచకులు వందల మంది భిక్షాటన చేస్తూ డబ్బులు వారికి ఇచ్చే వరకు భక్తుల కాళ్లు మొక్కి బలవంతంగా డబ్బులు లాగుతున్నారు. ఇవ్వకపోతే పరుష పదజాలము తో దూషిస్తున్న ఘటనలు ఉన్నాయి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### రోడ్లు మరమ్మతులు

ఇటీవల కురిసిన వర్షాలకు చాలా రహదారులు వరదలకు రోడ్లు చాలావరకు కొట్టుకుపోవడం, మట్టి కొట్టుకుపోవడం, రాళ్లుతేలడం ప్రయాణంకు చాలాఅంతరాయం జరుగుతుంది. వాహనాలు, బస్సులు,లారీలు, కార్లు, ఆటోలు, జీపులు, స్కూటర్,సైకిల్, పాదచారులు.ప్రయాణానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు నడిపించే డ్రైవర్లు నరక యాతన పడుతున్నారు.ప్రభుత్వంరోడ్లు భవనాలశాఖ, రెవిన్యూ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నష్టం అంచనా వేయించాలి. స్వచ్ఛంద సమూష్టాల సహకారంతో రోడ్లు మరమ్మతులు వెంటనేచేయించిప్రజలప్రయాణానికిసహకారం అందించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కొత్త డ్యాములను నిర్మించాలి

భారత దేశంలో అతి పురాతన నదులు చెరువులు, కుంటలు, వాగుల చెక్ డ్యాములను పునరుద్ధరించి కొత్త డ్యాములను నిర్మించాలి. ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన ఆనకట్టలు శిథిలావస్తకు చేరుకుంటున్నాయి. వర్షా కాలంలో ఈఆనకట్టలు తెగిపోవడంవల్ల ముంపు గ్రామాలు మునిగిపోవడం జరుగుతుంది. కావున ప్రభుత్వం తక్షణం పాత డ్యాంల స్థానంలో కొత్తవి నిర్మించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### బస్సుల్లో ప్రయాణం.. ఆలోచనీయ అంశం

ఇటీవలి కాలంలో రాత్రి ప్రయాణాలకు ఎక్కువ మంది ఏసీ స్లీపర్‌బస్సులను ఎంచుకుంటున్నారు. సౌకర్యవంతమైన బెడ్లు, శుభ్రమైన వాతావరణం, వేగవంతమైన ప్రయాణం వంటి అంశాలు వీటిని ప్రజాదరణ పొందేలా చేస్తున్నాయి. అయితే, సౌకర్యం ఉన్నంత మాత్రాన భద్రతా ప్రమాణాలు నిర్లక్ష్యం చేయబడితే ప్రమాదాలు తప్పవు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన వోల్వోబస్సు ప్రమాదం భద్రతపరంగా ఎన్నో ప్రశ్నలను లేవనెత్తింది. ఏసీ బస్సుల్లో పూర్తిగా మూసివేసిన కిటికీలు, సెంట్రల్ లాక్‌సిస్టమ్స్,తగిన ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ల లేమి కారణంగా ప్రమాదం సంభవించినప్పుడు ప్రయాణికులు బయటపడటం కష్టమవుతోంది.ప్రతి బస్సులోఫైర్ ఎక్స్టింగ్విషర్‌లు,అత్యవసర ద్వారాలు, అలారం వ్యవస్థలు తప్పనిసరిగా ఉండాలి.

-తిప్పర్తి శ్రీనివాస్,చొప్పదండి

### ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

మొంథా తుఫాను కారణంగా రైతులు పండించిన పంట ఒకసారిగా నీట కొట్టుకు పోయింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కావునా రాష్ట్ర ప్రభుత్వం యాత్రంగం వెంటనే క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రతి ఒక రైతుకు ఆర్థిక సాయం అందిస్తూ న్యాయం జరిగేలా ప్రభుత్వం చూడాలి. రైతులకు నోటి దగ్గరకు వచ్చిన ముద్ద నేలపాలు అయింది. రాష్ట్రంలో అన్ని వస్తువులకు బీమా ఉంటుంది. కానీ రైతులకు పండించిన పంటకు బీమా లేదు రైతులు ఆరుకాలం పండించిన పంట ప్రతిసారి ఆకాల వర్షాలతో వరదలో కొట్టుకుపోతుంది.అందుకే దీనికి శాశ్వత పరిష్కారం ఆలోచించాలి. రైతులు మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేయాలి. ప్రస్తుతం తడిసిన ధాన్యని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూలు జిల్లా

### విజయవంతమైన పరిపాలన అందించాలి

శ్రీలంక,బాంగ్లాదేశ్‌లలో నేపాల్‌లో జరిగేదంత జెన్ జీ యుగం. విద్యార్థులే నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరిస్తున్న నేపథ్యాన్ని ఇవ్వాళ్ల చూస్తున్నాం. అయితే శ్రీలంక బాంగ్లాదేశ్ పరిణామాలు అస్సాం ను తలపించగా నేపాల్ పరిణామాలు మాత్రం ఒక ఆశ రేఖను చూపిస్తున్నాయి.నిజంగా ఇదిమంచి పరిణామమే. కొన్ని పదుల ఏండ్లుగా కుటుంబ పాలన దిశగా సాగుతున్న ఆయా దేశాల పాలన పద్ధతులను దిశ మారింది.

-భారత అవినాష్, జనగామ

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పెట్టుబడిదారులు లాభాల కోసమా! ఉద్యోగ కల్పన కోసమా?



డాక్టర్‌ఎనుగొండ నాగరాజ నాయుడు

పెట్టుబడిదారీ వ్యవస్థ ఉద్యోగ కల్పనలో ఎంత నిబద్ధత కలిగి ఉన్నదో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐనీ ప్రవేశపెట్టడమే తెలియజేస్తోంది.టెక్నాలజీ అనేది మనిషి శ్రమను తగ్గించడానికి దోహదం చేయాలి కానీ మనిషికి జీవనాధార అవకాశాలను దూరం చేయడానికి దారి తీయకూడదు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో అదే జరుగుతోంది. ఇదే సోషలిజంలోనైతే ఇటువంటి కొత్త టెక్నాలజీ ప్రవేశం వలన కార్మికులు ఉపాధి కోల్పోరు. అదే కొత్త టెక్నాలజీని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశపెట్టినప్పుడు కార్మికులు ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగానికి దారితీస్తుంది. దీనివలన ఆర్థిక వ్యవస్థలోఆదాయ అసమానతలు పెరగడం, ఇది కొంతమంది పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవడం అశేష ప్రజానీకం వినియోగస్థాయి పడిపోవడం, డిమాండ్ తగ్గిపోవడం, ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి దిగజారిపోతుంది. ఇటీవలనే అమెజాన్ కంపెనీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ఏఐ వినియోగం వలన 14వేల ఉద్యోగాలు పోతున్నాయని తెలియజేసింది. ఇలా ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులు ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టకుండా ఆదాయాలను పెంపొందించుకునే దిశగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. ఇప్పటికే అమెజాన్ నుంచి మైక్రోసాఫ్ట్ కంపెనీ వరకు ఉద్యోగం కోల్పోయే వారి సంఖ్య 80000 వరకు ఉంటుందని ఒక అంచనా. ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రభావం వలన మొత్తం మీద 81 వేల 416 ఉద్యోగాలు పోతున్నాయని ఒకఅంచనా. ప్రపంచవ్యాప్తంగా మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజేస్లో ఆర్థిక అభివృద్ధి పరంగా మొత్తం పారిశ్రామిక రంగాన్ని ఇంజన్‌లాగా పని చేస్తున్నాయని ఆర్థికవేత్తలు గుర్తించారు. 145 కోట్ల మంది జనాభా గల మనదేశంలో పేదరికం పోవాలన్న ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదాయ సమాంతర తగ్గాలన్న సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఐ అభివృద్ధితోనే సాధ్యం. చైనాలో ఇంటింటికి ఒక కుటీర పరిశ్రమ ఉంటూ చైనా ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా చెలామణి అవుతున్నాయి.అంటే అక్కడి ప్రభుత్వ పెద్దల నిబద్ధత ఉంది. అందుకే చైనా నేడు ప్రపంచ కర్మాగారంగా ఉంది. మనదేశంలో పాలకులు లాగా ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని చైనా పాలకులు అనుకోవడం లేదు. చైనాలో స్థానికంగా పరిశ్రమలు స్థాపించి అభివృద్ధిపరిచిన అందువలన అక్కడి పేదరికం పోయింది. దీనిగానో ప్రజలకు రుణాల



రూపంలో పెట్టుబడులు సమకూర్చడం వారికి తగిన శిక్షణ ఇవ్వడం పరిశ్రమలకు కావాలసిన సాంకేతిక సామాగ్రిని అందించడం మార్కెట్లను చూపించడం ఇలాంటి పనుల్లో ప్రభుత్వం ఒక వైపు ప్రైవేట్ ఒక వైపు పారిశ్రామిక రంగం మరొకవైపు భాగస్వాములు అవుతున్నాయి.ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయి. అనేక పారిశ్రామిక యూనిట్లను ఎక్కడికక్కడ నెలకొల్పుతున్నారు. వీటి ఆధారంగా చైనాలో 1.3 కోట్ల మందికి గ్రామీణ ఉపాధి లభించింది. ఇళ్లలోనే పెట్టే చిన్నచిన్న వర్క్షాపులో ఉత్పత్తి యూనిట్లద్వారా ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. దీనికి టూరిజంపర్యావరణ ఆర్థిక కార్యకలాపాలు తోడు చేయడం వలన ఈచిన్నతరహా పరిశ్రమలో మరింతగా పేదరిక నిర్మూలనకు ఉద్యోగ కల్పనకు తోడ్పడ్డాయి.మన దేశంలో ఎప్పటి నుంచో 1905 స్వదేశీ ఉద్యమం ద్వారా చేపట్టిన కుటీర పరిశ్రమల స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి పరచుకునేందుకుఆనాడు స్వాతంత్ర్య సంగ్రామాన్నే నడిపించడం జరిగింది. నేడు మనదేశంలో 97 శాతం ఉద్యోగ కల్పన జరుగుతున్నది. భారీ పరిశ్రమల ద్వారా కేవలం 3 శాతం మాత్రమే ఉద్యోగిత ప్రజలకు లభిస్తున్నది. ఇవి ప్రస్తుతం దేశంలో 6.3 కోట్ల సంస్థలు ఎనిమిది వేలరకాల ఉత్పత్తులను చేస్తూ మన స్థూలజాతీయ ఉత్పత్తికి 30శాతం కల్పించనున్నది. దేశపారిశ్రామిక ఉత్పత్తిలో 33శాతంగా ఉంది. ఈ పరిశ్రమలన్నీ అసంఘటిత రంగంలో ఉన్నాయి. వీటిని సంఘటితపరచి ఆర్థికపరమైన సాంకేతికపరమైన తదితర సబ్సిడీలు కల్పిస్తే చిన్న తరహా పరిశ్రమలు ఉపాధి కల్పనలో ఆదాయాలు పెంపొందించడంలో దేశంలో ప్రధానమైన పాత్ర పోషిస్తాయి.అభివృద్ధి అంటే అందరివృద్ధి అంతేగాని కొందరి వృద్ధి మాత్రం కాదు అని గాంధీజీ అన్నారు.దేశ ఆదాయం ఎంత అనేది ముఖ్యంకాదు ప్రజలకు కనీస అవసరాలైనా తిండి,బట్ట విద్య, వైద్యం ఏ మేరకు పొందగలుగుతున్నారు అనేది ముఖ్యమన్నారు.ప్రభుత్వాల సేవకులుగా పనిచేయాలిగాని పెత్తందారులుగా ప్రజలపై ఆధిపత్యం చేయించకూడదు అన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చేవిధంగా పాలన చేసేదే రాజ్యం. గాంధీజీ ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని నిర్మూలించలేదు.పరిపాలన విధానాలు చట్టాల ద్వారా అందరికీ క్షేమం అందించేదే రాజ్యం.నేటి ఆర్థిక విధానాలన్నీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో జరిగి ఉత్పత్తులు గణనీయంగా పెరిగినప్పటికీ మానవ శ్రేయస్సు పెంపొందించలేకపోవడం శోచనీయం. అందుకే ఆనాడు గాంధీజీ అన్నారు భారీ ఉత్పత్తులు కాదు ముఖ్యం భారీ సంఖ్యలో ప్రజలు ఉత్పత్తిలో పాల్గొనాలి. తద్వారా ఉపాధి ఆదాయంఉండి ప్రజలు సౌభాగ్యంతో ఉంటారు. పెట్టుబడిదారీ విధానం చిన్నచిన్న ఉత్పత్తిదారులను నిర్వీర్యం చేసి నిరుద్యోగం పెరిగేటట్టుగా చేస్తుందనిగాంధీజీ స్వాతంత్రోద్యమం కాలంలోనే అన్నారు. ఈరోజుటికి కూడా ఈచిన్నతరహా కుటీర పరిశ్రమలు రిజిస్టర్ కాబడినవి మన దేశంలో 5.93కోట్ల యూనిట్లు ఉన్నాయి.వీటిలో 25 కోట్ల మంది పనిచేస్తున్నారు.ఇవి చేసే ఉత్పత్తులలో మన విదేశీ వాణిజ్యంలో 45.73శాతంగా ఉన్నది.అయితే నేడు కష్టాల్లో ఉన్న ఎంఎస్ఎం ఈ యాజమాన్యాల ఇబ్బందులుప్రభుత్వం వినాలి.వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఎంఎస్ఎంఈల అభివృద్ధికి పాలసీలు రూపొందించాలి. అప్పుడే మన ప్రధాని కోరుకున్నట్లుగా నిజమైన ఆత్మనిర్భర్ భారత మేకిన్ ఇండియా పథకాలు విజయ్నవతమవుతాయి. •

# 3న కోర్టుకు రండి

## వీధికుక్కల కేసులో వివిధ రాష్ట్రాల సిఎస్‌లకు 'సుప్రీం' ఆదేశం

### మినహాయింపు కోరిన బీహార్ సిఎస్‌ను మందలించి ప్రత్యక్షంగా హాజరుకావాలన్న కోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 31:** వీధి కుక్కల కేసులో రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై శుక్రవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు తీర్పును గౌరవించడం లేదంటూ అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసులో నవంబర్ 3న కోర్టు ముందు వర్చువల్‌గా హాజరయ్యేందుకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు అనుమతి కోరగా నిరాకరించింది. అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిద్రపోతున్నారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా వారు అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వ్యక్తిగతంగా వచ్చి వివరించాలి. కోర్టు సమయం ఇచ్చినా ఎలాంటి చర్యలు లేకపోవడం దురదృష్టకరం అని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా మందలించింది. తమ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని బీహార్ ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన అభ్యర్థనను తోసిపుచ్చింది. రాష్ట్రంలో అంతా ఎన్నికల సంఘం చూసుకుంటుంది. మీరు చింతించకండి. కోర్టుకు రండి అని తేల్చి చెప్పింది. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలకు షెల్టర్లకు తరలించాలిన ఆగస్టు 11న ఆదేశించింది. దానిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ నేపథ్యంలో జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆ కేసును విచారించింది. ఆ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంటూ ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది. ఈ క్రమంలోనే ఆ ఆదేశాల అమలుపై తీసుకుంటున్న చర్యలను తెలియచేసేలా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే వాటిని దాఖలు చేశాయి. అలాగే ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత కూడా వీధి కుక్కల దాడులు నమోదవుతుండటాన్ని గత విచారణలో తీవ్రంగా పరిగణించింది. ఆ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు వ్యక్తిగతంగా న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించింది. తాజాగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరగా ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది.

# వలసదారులపై అమెరికా అక్కసు


## భారత్‌ను నిందిస్తూ యాడ్



**వాషింగ్టన్, అక్టోబరు 31:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలు.. ఇలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే హెచ్-1బి వీసాదారులను ఉద్దేశించి ట్రంప్ యంత్రాంగం అక్కసు వెళ్లగక్కింది. ఈ మేరకు లేబర్ డిపార్ట్‌మెంట్ ఎక్స్ వేదికగా ఒక యాడ్ విడియోను విడుదల చేసింది. ఆ వీసాను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్ యువత స్థానంలో విదేశీ కార్మికులతో భర్తీ చేస్తున్నాయని నిందించింది. ఆ వీసాదారుల్లో అత్యధికులు భారతీయులే ఉన్నారని ఆక్షేపించింది.
'హెచ్-1బి వీసా దుర్వినియోగం కారణంగా విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయి. యువ అమెరికన్ల అమెరికా డ్రీమ్ దొంగతనానికి గురవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, లేబర్ విభాగం నాయకత్వంలో వీసాను దుర్వినియోగం చేస్తోన్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నాం. అమెరికా ప్రజల కోసం అమెరికా కలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. కష్టపడి పనిచేస్తే.. అమెరికా కలను సాధించుకోవచ్చని మేం తరతరాలుగా చెప్తున్నాం. కానీ మా యువత విషయంలో అలా జరగడం లేదు' అని యాడ్‌లో ప్రస్తావించారు. హెచ్-1బిల్లో 72 శాతం భారతీయులకే వెళ్తున్నాయని ఒక గ్రాఫ్ రూపంలో వెల్లడించారు. ఈ వీసా విషయంలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయా? అని గుర్తించేందుకు 'ప్రాజెక్టు ఫైర్‌వార్' పేరిట లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ఈ సమయంలోనే ఈ యాడ్‌ను పోస్ట్ చేసింది. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ యువతతో భర్తీ చేయకుండా చూడటమే దీని ఉద్దేశం. హెచ్-1బి వీసా విషయంలో ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం సంచలనం సృష్టించింది 'హెచ్-1బి వీసా వ్యవస్థ మోసాలతో నిండి ఉంది. అది అమెరికన్ల వేతనాలను తగ్గించింది. కాబట్టి ట్రంప్ ఈ వ్యవస్థను మెరుగు పరచాలనుకుంటున్నారు' అని అమెరికా ప్రభుత్వం స్పందించిన సంగతి తెలిసిందే. అయితే ఆయన నిర్ణయాన్ని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయం కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను దెబ్బతీస్తోందని ఆ గ్రూప్ ఆందోళన వ్యక్తం చేసింది. హెచ్-1బిపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని తన వ్యాజ్యంలో వాదించింది. ఇక పలు ఉద్యోగ సంఘాలు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ఆయనకు లేఖ కూడా రాశారు. ట్రంప్ నిర్ణయం యుఎస్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నైపుణ్యం కలిగిన వలసదారులను కోల్పోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పంజాబ్‌లో కేజ్రీవాల్‌కు ఏడంతస్తుల అద్దాల మేడ

## బిజెపి జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై మళ్లీ ఆరోపణలు వస్తున్నాయి. పంజాబ్ సిఎం భగవంత్ మాన్ తన కోటాలో.. కేజ్రీవాల్ కోసం అద్దాల మేడ నిర్మిస్తున్నట్లు బిజెపి ఆరోపించింది. 7-స్టార్ సదుపాయాలు ఆ మేడలో కల్పిస్తున్నట్లు పేర్కొన్నది. పంజాబ్‌లో కేజ్రీవాల్ ఎమ్మెల్యే కాదు, కనీసం ప్రభుత్వంలో లేరని బిజెపి పేర్కొన్నది. బిజెపి జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా దీనిపై ఆరోపణలు చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓడిన ఆమ్ ఆద్మీ నేతలు పంజాబ్‌లోని వివిధ బోర్డులు, కమిషన్‌లలో చోటు దక్కించుకున్నట్లు ఆరోపించారు. అద్దాల మేడ నిర్మాణం పట్ల కేజ్రీవాల్, ఆయన పార్టీ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి చేస్తున్న ఆరోపణల పట్ల ఆప్ కానీ, పంజాబ్ ప్రభుత్వం కానీ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. ఢిల్లీలో నిర్మించిన అద్దాలమేడ నుంచి కేజ్రీవాల్‌ను అక్కడ ప్రజలు తరిమేశారని, కానీ అద్దాలమేడ కాన్సెప్ట్ అనేది ఆయన మెదడు నుంచి పోలేదని, అద్దాలమేడ రెండో భాగం పంజాబ్‌లో జరుగుతున్నదని, ఆ రాష్ట్ర ప్రజలు పన్నులతో దాన్ని నిర్మిస్తున్నారని, అది కూడా సిఎం కోటాలో పనులు జరుగుతున్నాయన్నారు.

# నేతాజీ మరణం విమానప్రమాదం కాదు!

## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**చెన్నై, అక్టోబరు 31:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అందరూ భావిస్తున్నట్లుగా నేతాజీ విమాన ప్రమాదంలో మరణించలేదని తాను గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. అయితే, తన నమ్మకాన్ని బలపరిచేందుకు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. తమిళనాడు పర్యటనలో ఉన్న ఉప రాష్ట్రపతి మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీకి అత్యంత నమ్మకమైన అనుచరుడైన పసుపొన్ ముత్తురామలింగ దేవర్ చెప్పిన మాటల వల్లే తాను ఈ విషయాన్ని నమ్ముతున్నట్లు వివరించారు. నేతాజీ ఆ విమాన ప్రమాదంలో మరణించలేదు, నేను ఆయన్ను కలిశాను' అని దేవర్ నాతో చెప్పారు. అందుకే నేను నమ్ముతున్నాను" అని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దేవర్ ఎప్పుడూ అబద్ధం చెప్పలేదని, రాజకీయ ప్రస్థానంలోనూ ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించారన్నారు.



# యువతకు కోటి ఉద్యోగాల కల్పన

### - కోటి మంది లఖ్‌పతి దీదీలు - కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య - బీహార్ ఓటర్లపై ఎన్‌డిఎ హామీల వర్షం

### - 24 హామీలతో మేనిఫెస్టో విడుదల

**పాట్నా, అక్టోబరు 31:** ఎన్‌డిఎ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామంటూ 69 పేజీలతో కూడిన మేనిఫెస్టోను శుక్రవారంనాడిక్కడ విడుదల చేసింది. ఇందులో 24 హామీలను పొందుపరిచింది. ఈ మేనిఫెస్టోను 'సంకల్ప పత్ర'గా నామకరణం చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, సిఎం నితీశ్ కుమార్, కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితిన్‌రామ్ మాంజి తదితరుల చేతుల మీదుగా మేనిఫెస్టోను విడుదల చేశారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటికిపైగా ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. వీటిలో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఇతరత్రా ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపింది. నైపుణ్యం ఆధారంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రంలో స్కిల్స్ సెన్సస్‌ను నిర్వహిస్తామని పేర్కొంది. ప్రతి జిల్లాలో మెగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. గ్లోబల్ స్కిల్ ట్రెనింగ్ సెంటర్‌గా బీహార్‌ను మారుస్తామని తెలిపింది. వలస కార్మికులను ఆకట్టుకునేలా రాష్ట్రంలో కోటి ఉద్యోగాల హామీతో పాటు కోటి మంది మహిళలను లక్షాధికారులను (లక్‌పతి దీదీస్) చేయడమే తమ లక్ష్యమని ప్రకటించింది. మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ.2 లక్షల వరకు ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చింది. ప్రతి జిల్లాలో మెగా లెర్నింగ్ సెంటర్లతో బీహార్‌ను ప్రపంచ అభ్యాస కేంద్రంగా ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం తన మేనిఫెస్టోలో తెలిపింది. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తారు. ఉన్నత విద్యను చదువుతున్న ఎస్‌సీ విద్యార్థులకు నెలకు రూ.2వేల సాయాన్ని అందిస్తారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మెడిసిటీని నిర్మిస్తారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీని నిర్మిస్తారు. ఈబీసీలకు రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకాలు, గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, ప్రతి రైతుకు ఏడాదికి రూ.9 వేల పెట్టుబడి సాయం, బీహార్‌లో ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, నాలుగు నగరాల్లో (పాట్నా, దర్భంగా, పూర్ణియా, భాగల్పూర్) అంతర్జాతీయ విమానాశ్రయాలు, మెట్రో రైలు సేవల ఏర్పాటు, 3,600 కి.మీ రైలు మార్గాలను ఆధునీకరించడం వంటి హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచారు.

రాష్ట్ర ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తారు. పేదలకు 50 లక్షలకుపైగా పక్కా ఇళ్లను నిర్మిస్తారు. రాష్ట్ర ప్రజలకు రూ.5 లక్షల దాకా ఉచిత వైద్య చికిత్సల సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తారు.

# 'బంగ్లాను వీడటం నాకు తప్పనిసరి అవసరం'

## మాజీ ప్రధాని షేక్ హసీనా



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తన ప్రవాసంపై తొలిసారిగా మౌనం వీడారు. తన ప్రాణాలను, తన చుట్టూ ఉన్నవారి భద్రతను కాపాడేందుకే దేశం విడిచి పెట్టాల్సి వచ్చిందని, అదొక 'తప్పనిసరి అవసరం'గా మారిందని ఆమె స్పష్టం చేశారు. తన పాలనను కూల్చివేసిన విద్యార్థుల నిరసనలను 'హింసాత్మక తిరుగుబాటు'గా అభివర్ణించిన ఆమె, భద్రతా బలగాలు కాల్పులు జరపాలని తాను ఆదేశించానన్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బ్రిటిష్ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా పలు కీలక విషయాలు వెల్లడించారు. "నేను అక్కడ ఉండి ఉంటే నా ప్రాణాలకే కాదు, నా చుట్టూ ఉన్నవారికి కూడా ప్రమాదం వాటిల్లేదని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు 5న ఆమె దేశం విడిచి భారత్ కు వచ్చేసిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌లో తన అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఉన్నప్పటికీ, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే తన లక్ష్యమని ఆమె పునరుద్ఘాటించారు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ఉద్యోగాల్లో కోటాను రద్దు చేయాలనే డిమాండ్‌తో మొదలైన విద్యార్థుల నిరసనలు, చివరికి తన ప్రభుత్వాన్ని కూల్చివేసే స్థాయికి చేరాయని హసీనా అన్నారు. ఈ నిరసనలను 'హింసాత్మక తిరుగుబాటు'గా పేర్కొన్న ఆమె, "నాయకురాలిగా నేను బాధ్యత తీసుకుంటాను. కానీ, భద్రతా బలగాలను కాల్పులు జరపమని ఆదేశించాననడం పూర్తిగా అబద్ధం" అని తేల్చిచెప్పారు. ఘర్షణల్లో మరణాలు సంభవించడానికి క్షేత్రస్థాయిలో భద్రతా దళాల్లో క్రమశిక్షణ లోపించడమే కారణమని ఆరోపించారు. మృతుల సంఖ్యను 1,400గా ప్రచారం చేయడాన్ని ఆమె తోసిపుచ్చారు.

అది కేవలం తనపై జరుగుతున్న ప్రచారంలో భాగమేనని, ఆ సంఖ్యను భారీగా పెంచి చెబుతున్నారని అన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఐసిజె తనపై జరుపుతున్న విచారణను హసీనా 'బూటకపు విచారణ'గా కొట్టిపారేశారు.

"నన్ను రాజకీయంగా అంతం చేయడానికే, ఎన్నిక కాని ప్రభుత్వం నా రాజకీయ ప్రత్యర్థులతో ఈ బూటకపు కోర్టును నడుపుతోంది" అని ఆమె ఆరోపించారు. ఈ విచారణలో తనకు మరణశిక్ష విధించినా ఆశ్చర్యపోనని,
భయపడబోనని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం మాత్రం విద్యార్థుల నిరసనల సమయంలో జరిగిన హింసకు, మానవ హక్కుల ఉల్లంఘనకు షేక్ హసీనానే 'ప్రధాన సూత్రధారి' అని ఆరోపిస్తున్నారు.

ఈ ఇంటర్వ్యూలో హసీనా తన రాజకీయ పునరాగమనంపై గానీ, బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చే ప్రణాళికలపై గానీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

# షట్‌డౌన్‌తో ఆహార సంక్షోభం

## ఎమర్జెన్సీ ప్రకటించిన న్యూయార్క్



**వాషింగ్టన్, అక్టోబరు 31:** అమెరికాలో కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్ తీవ్ర ఆహార సంక్షోభానికి దారితీస్తోంది. ఫెడరల్ ప్రభుత్వం నుంచి అందే ఆహార సాయం నిలిచిపోనున్న నేపథ్యంలో న్యూయార్క్ రాష్ట్రం స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ మేరకు గవర్నర్ కేథీ హోచుల్ సంచలన ప్రకటన చేశారు. అత్యవసర ఆహార సహాయం కోసం రాష్ట్రం తరఫున 65 మిలియన్ డాలర్ల నిధులను విడుదల చేస్తున్నామని, దీని ద్వారా 4 కోట్ల మీల్స్ అందిస్తామని ఆమె మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా అమెరికాలో అల్పాదాయ కుటుంబాలకు జీవనాధారమైన సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ లేదా ఫుడ్ స్టాంప్స్ ప్రయోజనాలు కోట్లాది మందికి అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. నిధుల కొరత కారణంగా నవంబర్ నెల ప్రయోజనాలను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిలిపివేయాలని ఈ నెల ప్రారంభంలోనే అమెరికా వ్యవసాయ శాఖ రాష్ట్ర ఏజెన్సీలను ఆదేశించింది. రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలోని ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతుండగా, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చట్టబద్ధంగా ఆమోదించిన అత్యవసర నిధులను విడుదల చేయడానికి ట్రంప్ ప్రభుత్వం నిరాకరిస్తోందని గవర్నర్ హోచుల్ ఆరోపించారు. ఈ సంక్షోభం నేపథ్యంలో పలు రాష్ట్రాలు సొంతంగా చర్యలు తీసుకుంటున్నాయి. లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీ గత వారం ఎమర్జెన్సీ ప్రకటించి, లబ్ధిదారులకు రాష్ట్ర నిధులను కేటాయించారు. వెర్మంట్ రాష్ట్రం కూడా నవంబర్ 15 వరకు ఫుడ్ స్టాంప్స్ కొనసాగించేందుకు నిధులను ఆమోదించింది. న్యూ మెక్సికో సైతం 30 మిలియన్ డాలర్ల అత్యవసర ఆహార సహాయాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో 25 రాష్ట్రాలకు చెందిన డెమోక్రటిక్ గవర్నర్లు, అటార్నీ జనరళ్లు ట్రంప్ ప్రభుత్వంపై మంగళవారం దావా వేశారు. అత్యవసర నిధులను వినియోగించే అధికారం తమకు లేదనడాన్ని వారు సవాలు చేశారు. ప్రజలకు ఆహార సాయం కొనసాగించేందుకు కాంగ్రెస్ ఆమోదించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోర్టును కోరారు. అమెరికాలో న్యూట్రిషన్ పథకం ద్వారా సుమారు 4.2 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు.

# నేటి నుంచి 'భారత్ పర్వ్'

## దేశవ్యాప్తంగా ఘనంగా ఏక్తా దివస్

### సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ప్రధాని నివాళి

### ఏక్తానగర్‌లో ఘనంగా ప్రత్యేక కార్యక్రమాలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** భారతదేశ ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గౌరవార్థం ఏటా అక్టోబర్ 31న నిర్వహించినట్లుగానే ఈసారి కూడా దేశవ్యాప్తంగా వాడవాడలా రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. పటేల్ స్వస్థలం గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించిన ఏక్తా దివాస్ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు మనిషికి ప్రధాని పుష్పాంజలితో నివాళి అర్పించారు. ఏక్తానగర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు దేశ ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యం, దేశభక్తిని ప్రతిబింబించాయి. ఆహుతులను ఆకట్టుకున్నాయి. సర్దార్ పటేల్ 150వ జయంతిని జరుపుకుంటున్నందున ఈ వేడుక ప్రత్యేక ప్రాముఖ్యత ఏర్పడింది. సర్దార్ పటేల్ దార్శనికత మరియు సంకల్పం 565 రాచరిక రాష్ట్రాలను ఏకం చేసి, ఆధునిక భారత దేశాన్ని రూపొందించాయి. ఈ రోజు జాతీయ సమైక్యత, ఐక్యత మరియు సమగ్రతకు ఆయన జీవితకాల అంకితభావాన్ని గుర్తుచేస్తుంది. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్‌లు), రాష్ట్ర పోలీసు యూనిట్లు, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) బృందాలను ఒకచోట చేర్చే గ్రాండ్ పెరేడ్, సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. ఈసారి వేడుకల్లో మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రధానమంత్రికి అందించే గార్డ్ ఆఫ్ ఆనర్‌కు ఒక మహిళా అధికారి నాయకత్వం వహించారు. సిఐఎస్‌ఎఫ్, సిఆర్‌పిఎఫ్ నుండి మహిళా సిబ్బంది భారతీయ మహిళల బలం, విశ్వాసాన్ని ప్రతిబింబించే మార్షల్ ఆర్ట్స్, పోరాట ప్రదర్శనలను ప్రదర్శించారు.

**నవంబర్ 1 నుండి 15 వరకు భారత్ పర్వ్**

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతిని పురస్కరించుకుని నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు 'భారత్ పర్వ్' పేరిట కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశమంతటా సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రాంతీయ వంటకాలను ప్రదర్శించే గొప్ప ఆహార ఉత్సవం.. జాతీయ సమైక్యతను జరుపుకునే ప్రదర్శనలు, కార్యకలాపాలు ఇందులో ఉండనున్నాయి. ఈ భారత్ పర్వ్ ఉత్సవాలు నవంబర్ 15న బిర్సా ముండా జయంతితో ముగియనున్నాయి. గిరిజన వీరుడు బిర్సా ముండా, భారతదేశ గిరిజన సమాజాల గొప్ప వారసత్వాన్ని సత్కరించనుంది.

# బీమా సొమ్ముకోసం కొడుకును హత్యచేసిన తల్లి



**లక్నో, అక్టోబరు 31:** బీమా డబ్బు కోసం ఒక మహిళ తన ప్రియుడితో కలిసి కుమారుడ్ని హత్య చేసింది. రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ దేహత్‌లో ఈ సంఘటన జరిగింది. 23 ఏళ్ల ప్రదీప్ శర్మ తండ్రి కొన్ని నెలల కిందట మరణించాడు. ఆ తర్వాత మయాంక్ అలియాస్ ఇషు కటియార్‌తో అతడి తల్లికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ప్రదీప్ దీనిని వ్యతిరేకించాడు. ఈ నేపథ్యంలో తల్లికి దూరంగా ఉంటూ విడిగా నివసిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగం సంపాదించాడు. కాగా, తమ సంబంధాన్ని వ్యతిరేకించిన కుమారుడు ప్రదీప్ అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు మయాంక్‌తో కలిసి అతడి తల్లి ప్లాన్ వేసింది. మయాంక్ తన సోదరుడు రిషితో కలిసి ప్రదీప్ పేరు మీద పలు బీమా పాలసీలు కొనుగోలు చేశాడు. మరోవైపు దీపావళి సందర్భంగా ప్రదీప్ సొంతూరుకు తిరిగి వచ్చాడు. అక్టోబర్ 26న మయాంక్, రిషి కలిసి డిన్నర్ పేరుతో అతడ్ని కారులో తీసుకెళ్లారు. సుత్తితో తలపై పలుసార్లు కొట్టి హత్య చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించారు. బల్హారామో గ్రామం సమీపంలోని కాన్పూర్‌ఎటావా హైవేపై మృతదేహాన్ని పడేశారు. కాగా, ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు.

# సంక్షిప్తంగా..

## ఆరెస్సెస్‌ను నిషేధించాలి: మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ, అక్టోబర్ 31:** దేశంలో ఎక్కువగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తడానికి బిజెపి, ఆరెస్సెస్ కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. ఈ క్రమంలో ఆరెస్సెస్‌ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ చేసిన విమర్శలను పటేల్‌చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ చీఫ్ ఉదహరించారు. ఉక్కు మనిషి సర్దార్ పటేల్, ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గొప్ప నేతలని ఖర్గే పేర్కొన్నారు. వారు దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ ఐక్యతను కాపాడేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రీయ స్వయంసేవకర్‌సంఘ్ నిషేధం వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తు అది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన వాతావరణానికి ఆరెస్సెస్ సృష్టించిందన్నారు.

## ఆయుర్వేద సిరప్ తాగి చిన్నారి మృతి

**భోపాల్, అక్టోబరు 31:** ఆయుర్వేద సిరప్ తాగి ఆరు నెలల చిన్నారి మరణించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయుర్వేద సిరప్ అమ్మిన షాపును సీజ్ చేశారు. దర్యాప్తు కోసం కమిటీని ఏర్పాటు చేశారు. విషపూరిత దగ్గు మందు తాగి 24 మంది పిల్లలు మరణించిన మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆరు నెలల వయస్సున్న రోహి మినోటేకు వారం కిందట జర్వం, జలుబు వచ్చింది. ఆ పాప తల్లిదండ్రులు డాక్టర్‌కు చూపించలేదు. స్థానిక మెడికల్ స్టోర్‌లో ఆయుర్వేద దగ్గు సిరప్ కొనుగోలు చేశారు. ఆ చిన్నారికి ఆ మందు తాగించారు. నాలుగు రోజుల తర్వాత ఆ చిన్నారి ఆరోగ్యం క్షీణించింది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ పాప మరణించింది. ఈ నేపథ్యంలో ఆయుర్వేద దగ్గు సిరప్, డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల తమ కుమార్తె చనిపోయినట్లు ఆ కుటుంబం ఆరోపించింది.

## భారత్‌కు చైనా ఎయిర్‌లైన్స్ విమానసర్వీసులు

**బీజింగ్,అక్టోబరు 31:** భారత్, చైనా మధ్య విమాన ప్రయాణాలు తిరిగి పుంజుకుంటున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్, షాంఘైన్యూఢిల్లీ మధ్య డైరెక్ట్ విమానాల సంఖ్యను పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. భారత మార్కెట్ నుంచి బలమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. వారానికి మూడుగా ఉన్న సర్వీసులను 2026 జనవరి 2 నుంచి ఐదుకు పెంచనుంది. ఈ సంస్థవిమాన సర్వీసులు ఢిల్లీ నుంచి బయలుదేరే విమానం రాత్రి 7:55 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 4:10 గంటలకు షాంఘై చేరుకుంటుంది. షాంఘై నుంచి బయలుదేరే విమానం మధ్యాహ్నం 12:50 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 5:45 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) న్యూఢిల్లీలో ల్యాండ్ అవుతుంది.

## రోగాలు తెచ్చిపెడుతున్న ఢిల్లీ కాలుష్యం!



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. దీపావళి తర్వాత గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరింది. ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. ఈ వాయు కాలుష్యం రాజధాని ప్రాంత వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విషపూరిత గాలి ప్రజారోగ్య సంక్షోభానికి దారి తీస్తోంది. గాలి కాలుష్యం కారణంగా ప్రతీ ఇంట్లో ఒకరు ఏదో ఒక అనారోగ్య సమస్యతో సతమతమవుతున్నారు. కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో అనేక శారీరక రుగ్మతల అంశాలు బయటపడ్డాయి. ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలోని దాదాపు 75 శాతం కుటుంబాల్లోని ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు అనారోగ్యంతో ఉన్నారని తేలింది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్ నుంచి దాదాపు 15వేల కంటే ఎక్కువ .

## బాలీవుడ్ బిగ్ బీ అమితాబ్‌కు భద్రత పెంపు!



**ముంబయి, అక్టోబరు 31:** బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్‌కు భద్రత పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఖలిస్తానీ అనుకూల సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' (ఎస్‌ఎఫ్‌జె) నుంచి ఆయనకు బెదిరింపులు రావడంతో కేంద్ర ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇటీవల అమితాబ్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కెబిసి) షోకు పంజాబీ గాయకుడు, నటుడు దిల్జిత్ దోసాంజ్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన అమితాబ్ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సంఘటనే తాజా వివాదానికి దారితీసింది. దిల్జిత్ చర్య

# బిసి రిజర్వేషన్లకు కాంగ్రెస్ సిద్ధం

## కేంద్రం అడ్డుకుంటోంది: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 31, ప్రభాతవార్త :** బీసీలకు రిజర్వేషన్స్ ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కేంద్ర ప్రభుత్వమే బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకుంటుందని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఓయూ బీసీ జేఏసీ విద్యార్థుల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మదీక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. డా. నిజ్జన రమేష్ ముదిరాజ్, డా. దేశగాని సాంబశివ గౌడ్ అధ్యక్షత వహించిన ఈ దీక్ష కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హాజరై ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి హాజరై మాట్లాడుతు. రాహుల్ గాంధీ చట్ట సభలలో బీసీ లకు 42 రిజర్వేషన్ లు ఇవ్వాలని భారత దేశం మొత్తం పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని బీసీల చట్ట సభ లలో రిజర్వేషన్ లు ఇవ్వాలని నిర్ణయం జరిగిందని, అందుకే కాంగ్రెస్ రిజర్వేషన్ లు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇవ్వడానికి సిద్దంగా ఉన్నారని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్ లో చేర్చాలని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో ఆమోదంతెలిపిందని కోర్టు లో రిజర్వేషన్ కేసు వేసి అడ్డుకోవడం సిగ్గు చెటన్నారు. 42 శాతం రిజర్వేషన్ లు సాధించేందుకు కాంగ్రెస్ కట్టు బడి ఉందని, అవసరం అయితే బీసీ ప్రజలతో భారీ ఉద్యమం కు సిద్దంగా ఉన్నామని చెప్పారు.

**బిసి రిజర్వేషన్లను సాధించుకుంటాం: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజ్వర్వేషన్ కల్పించే బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసి కేంద్రానికి పంపినప్పటికి కేంద్ర బిల్లును అడ్డుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం మాటఇచ్చాము కట్టు బడి ఉన్నామని అన్నారు. రిజర్వేషన్‌పై యూనివర్సిటీల విద్యార్థులతో భారీ ఉద్యమంను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ రెండు ప్రభుత్వాలు బీసీల పై ప్రేమ ఉంటే వెంటనే రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలు చేస్తామని అన్నారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ లను రాజ్యాంగంలో 9 వ షెడ్యూల్ లో చేర్చాలని అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ రాజకీయ నాయకులను నమ్మలేమని, విద్యార్థులుగా రిజర్వేషన్ లకోసం ఉద్యమం చేయాలన్నారు. డా. విశారదన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పై ఉద్యమం చేయాలని విద్యార్థులు యూనివర్సిటీ లలో తెలంగాణ కోసం కొట్లాడారు ఇప్పుడు మన హక్కుల కోసం పోరాడాలని అన్నారు. టీజెస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడుతూ 42 బీసీ రిజర్వేషన్‌ల కోసం అందరం కలిసి కొట్లాడాలని కేంద్రం వెంటనే 9వ షెడ్యూల్ లో చేర్చాలని అన్నారు. మాజీ రాజ్య సభ సభ్యులు వి. హన్మంత్ రావ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమంలు కాదు త్వరలో ఢిల్లీ లో భారీ ఉద్యమం చేద్దామన్నారు. సాయంత్రం ధర్మ దీక్షను చేస్తున్న విద్యార్థులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.



మాట్లాడుతున్న మంత్రి వాకటి శ్రీహరి


ఎర్రగడ్డలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

# కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి

## మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 31, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో భాగంగా శుక్రవారం ఆయన ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గల్లీగల్లీ తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల అభ్యున్నతి కోరుకునే పార్టీ అని అన్నారు. పేదల బతుకులు బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్‌కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు అందించామన్నారు. విజయారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పీజేఆర్‌ను ప్రజలు ఎలా గుండెల్లో పెట్టి చూసుకుంటున్నారో తాను వెళితే సైతం అలానే చూసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 31, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాగంటి సునీతపై బోరబండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీ గుర్తులతో కూడిన స్లిప్పులను పంపిణీ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ మోహన్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాంకు ఫిర్యాదు చేశారు. ఆయన బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మాగంటి సునీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కాంగ్రెస్ అభ్యర్థిపై ఫిర్యాదు..**

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని అతనిపై చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో బీఆర్ఎస్ క్యాడర్‌ను లేకుండా చేస్తానని, ఈ ప్రాంతంలో లేకుండా చేస్తానంటూ బెదిరింపులకు దిగాడని బీఆర్ఎస్ నేతలు పల్లె రవి కుమార్, కిషోర్‌గౌడ్ తదితరులు ఫిర్యాదు చేశారు.

# గాంధీ మాట కోసమే పటేల్ ప్రధాని పదవీత్యాగం: ఎం.వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 31, ప్రభాతవార్త:** నాడు జాతిపిత మహాత్మా గాంధీ కోరిక మేరకు సర్దార్ వల్లభాయ్‌పటేల్ ప్రధాన మంత్రి పదవిని వదులుకున్నారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

సర్దార్ ఒక ఉక్కు మనిషి, దేశ సమైక్యత శిల్పి అని కొనియాడారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఆనేక మంది బిజెపి కార్యకర్తలు శుక్రవారం ఉదయం బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అసెంబ్లీ ఎదురుగా ఉన్న పటేల్ విగ్రహం వరకు 'రన్ ఫర్ యూనిటి' పేరిట ఏక్ భారత్ శ్రేష్ట భారత్ ర్యాలీ నిర్వహించిన తరువాత జరిగిన సమావేశంలో వెంకయ్యనాయుడు ప్రసంగించారు. పటేల్ సంస్కరణలు నేడు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, దేశానికి ప్రధాన మంత్రి కావాల్సిన మొదటి వ్యక్తిని చెప్పారు. నాడు దేశంలో ఉన్న 15 రాష్ట్రాలలో 14 రాష్ట్రాల ప్రజలు పటేల్‌ను ప్రధాన మంత్రిగా కావాలని కోరుకున్నారని, కాని గాంధీ కోరిక మేరకు పటేల్ ప్రధాన మంత్రి పదవిని వదులుకున్న త్యాగశీలి అని కొనియాడారు. యువత పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మొంథా తుఫాన్‌లో మరణించినవారికి ఆయన సంతాపం వ్యక్తం తెలిపారు. పటేల్, పి.వి.నరసింహా రావు, సుభాష్‌చంద్రబోస్, చంద్రశేఖర్ అజాద్, వంటి దేశ భక్తులను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తక్కువగానే చూసిందని ఆయన ఆరోపించారు. ఈ జయంతి వేడుకల్లో బిజెపి నేతలు డా.కె.లక్ష్మణ్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జనరల్ హాస్పిటల్ ఘటనపై ఎంక్వైరీ

## ముగ్గురు సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీ

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో బతికి ఉన్న రోగిని మార్చురీలో ఉంచడం జరిగిన ఘటనపై విచారణ జరిపించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వేర్వేరు మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీని నియమిస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డిఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి చంద్రశేఖర్, జనగామ్ జనరల్ ఆసుపత్రి జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ గోపాల్ రావు, సిద్దిపేట గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఆర్ శ్రీధర్ చారితో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో జీవించి ఉన్న రోగి వెల్ది రాజు అనే 45 సంవత్సరాల పురుషుడు..జయ్యారాం విలేజ్, గూడూరు మండలం, మహబూబాబాద్ జిల్లాకు చెందిన డ్రైవర్ వృత్తి చేసుకునే వ్యక్తిని బతికి ఉండగానే మార్చురీలో ఉంచినట్లు ఆరోపణలు ఉన్నాయని వచ్చిన వార్తలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, ఇందుకు సంబంధించిన వాస్తవాలను శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు విచారణ నివేదికను అందించాలని ఆదేశిస్తూ డిఎంఇ ఆదేశాలు జారీ చేశారు.

# కాగజ్‌నగర్ డివిజన్ విద్యుత్ అధికారులకు వినియోగదారుల ఫోరమ్ జరిమానా

**కాగజ్‌నగర్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** వినియోగదారునికి విద్యుత్ సరఫరా చేయకపోవడం, చెల్లించిన మొత్తం మొత్తాన్ని వృథా చేసినట్లు వ్యవహరించిన విద్యుత్ అధికారులపై వినియోగదారుల ఫోరమ్ చర్యలు తీసుకుంది. ఈ మేరకు కాగజ్ నగర్ డివిజన్ అధికారులకు రూ.7,000 జరిమానా విధిస్తూ, ఉత్తర్వులు జారీ చేసింది. సిర్పూర్ కాగజ్ నగర్ మండలంలోని బోరిగావ్ గ్రామానికి చెందిన ముస్తాఫా అలీ తన బంధన్ ఫంక్షన్ హాల్ కోసం కొత్త విద్యుత్ కనెక్షన్ పొందేందుకు విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసి రూ.1,92,536 చెల్లించారు. అయితే ఏడాది గడిచినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో పాటు, ఆయన చెల్లించిన డిటిఆర్‌ను ఇతరులకు కనెక్షన్ ఇవ్వడానికి ఉపయోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయంపై నిజామాబాద్ వినియోగదారుల ఫోరమ్ విచారణ జరిపింది. ఫోరమ్ చైర్‌పర్సన్ ఈ.నారాయణ, సభ్యులు ఎస్.రామకృష్ణ, ఎల్.కిషన్ ఆధ్వర్యంలో విచారణ సాగింది. విచారణ అనంతరం ఫోరమ్ తేల్చిన మేరకు, విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారుని సమ్మతి లేకుండా ఇతరు లకు కనెక్షన్ ఇచ్చారని, దీనివల్ల వినియోగదారుడు నష్టపోయారని నిర్ధారిం చింది. దీంతో సిర్పూర్ కాగజ్ నగర్ డివిజనల్ ఇంజినీర్‌పై రూ.7,000 జరిమానా విధిస్తూ, 15 రోజుల్లో ఆదేశాలు అమలు చేయాలని ఫోరమ్ ఆదేశించింది.

# ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా ప్రజా విజయోత్సవాలు

## ఉత్సవాల కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 31:** తెలంగాణ రైజింగ్‌తో పాటు తెలంగాణ ఆవిర్భావం, అభివృద్ధి అంశాలు కలగలిపి ఒక సమగ్ర ప్రణాళికతో ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రజా పాలన విజయోత్సవాల నిర్వహణపై ప్రభుత్వ సలహాదారు కే కేశవరావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం ఎలా సాధించాం, కొత్త రాష్ట్రంలో ఎన్ని విజయాలు నమోదు చేశాం, భవిష్యత్తు లో తెలంగాణ రాష్ట్రం ఏం సాధించబోతుంది అనే విషయాలను ప్రపంచానికి వివరించే విధంగా కార్యక్రమాలు ఉండాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

పెట్టుబడిదారులను ఈ విజయోత్సవానికి ఆహ్వానిస్తున్నాం, పెద్ద ఎత్తున ఎంఓయులు జరిగేలా వాతావరణం ఉండాలి అన్నారు. దుబాయ్ ఫెస్టివల్ పూర్తిగా దుబాయ్ పట్టణానికి దూరంగా జరుగుతుంది అదే పద్ధతిలో మన రాష్ట్రంలోనూ ఫ్యూచర్ సిటీలో కొన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. సీనియర్, జూనియర్ అధికారులతో కలిపి కమిటీలు వేయాలని ప్రణాళికా ప్రకారం పనులు విభజించుకుని నాణ్యతతో సకాలంలో అనుకున్న ప్రణాళికను అమలు చేసేలా ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం, మూసి పునర్జీవనం, ఫ్యూచర్ సిటీ, ఇప్పటికే అనేక పరిశ్రమలను తెలంగాణ ఆకర్షిస్తుంది, భవిష్యత్తు తెలంగాణ ఎలా ఉండబోతుందో ఈ వేడుకల్లో ప్రపంచానికి చూపించే విధంగా ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు, స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానీయ, వివిధ విభాగాల కార్యదర్శులు, సమాచార పౌర సంబంధాల కమిషనర్ ప్రియాంక, సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

# దేశద్రోహులెవరో, సేవకులెవరో తెలియకపోవడం బాధాకరం

## మైనార్టీలకు మంత్రి పదవిస్తే కిషన్‌రెడ్డికి అక్కసెందుకు?

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి దేశద్రోహులెవరో దేశ సేవకులెవరో తెలియకపోవడం బాధకరం అని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కిషన్ రెడ్డి కి సవాల్ విసురుతున్నా, అజారుద్దీన్ పైన ఎలాంటి కేసులు ఉన్నాయి? అవి ఏం అయినయో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి? అని అన్నారు. మైనార్టీ వ్యక్తికి కేబినెట్‌లో తీసుకొంటే ఎందకు అంత అక్కసు అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత కెప్టెన్ గా అజారుద్దీన్ ఎన్నో విజయాలు అందించిన విషయం కిషన్ రెడ్డి మరిచిపోయారా? అని నిలదీశారు. నిరుపేదగా పుట్టి అంచెలంచలుగా ఎదిగిన వ్యక్తి అజారుద్దీన్ అని కితాబు ఇచ్చారు. ఎంపిగా అజారుద్దీన్ ప్రజలకు సేవలు అందించారని చెప్పారు. కిషన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. సుదీర్ఘ కాలం అజహర్ దేశానికి సేవలు అందించిన వ్యక్తి. కాబట్టి ప్రత్యేక నిర్ణయం తీసుకున్నామని అన్నారు. దీని వల్ల మైనారిటీలకు కొంత మేలు జరుగుతుంది అని భావిస్తున్నామని అన్నారు. మంత్రి పదవి గురించి మూడు నెలల ముందు గానే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎన్నో విజయాలు అందించారో మరిచిపోయారా? అజారుద్దీన్ మంత్రి పదవిపై బిజెపి నేతలు ఎందుకు అసహనం వెళ్లగక్కుతున్నారని ఆయన ప్రశ్నించారు.

**ప్రేమ్‌సాగర్, సుదర్శన్‌రెడ్డి నియమకాలు స్వాగతించిన పిసిసి చీఫ్**

తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా సుదర్శన్ రెడ్డి, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రేమ్ సాగర్ రావ్‌లు నియమించబడటం ఎంతో ఆనందించదగ్గ విషయమని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు, మంచి అనుభవం ఉన్న నేతలు ప్రజల్లో రాజకీయాలలో మంచి పట్టు ఉన్న సీనియర్ నాయకులు అని ఆయన ప్రశంసించారు. సుదర్శన రెడ్డి కి ప్రభుత్వ సలహాదారు గా నియమించడం, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావ్‌ని అత్యంత కీలకమైన పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడం హర్షించదగ్గ విషయం ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సాగర్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి

## లక్ష్యాన్ని మించి 2,012 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

## రూ.1,500 కోట్ల ఆదాయం అధిగమించే అవకాశం


**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఫలితంగా సాగర్ ప్రాజెక్టులోని ప్రధాన జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ప్రాజెక్టులో ప్రస్తుత సంవత్సరం 1450 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం కలిగి ఉంది. అయితే జల విద్యుత్ పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయడంతో ఈ నెల 30వ తేదీ రాత్రి నాటికి 2012.23 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయిందని తెలంగాణ జెన్కో అధికారులు తెలిపారు. దీంతో జెన్కోకు ఇప్పటివరకు 400 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. అయితే ఎగువ నుంచి వరద రాక మరో రెండు నెలలు ఇలాగే కొనసాగితే ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి 3 వేల మిలియన్ యూనిట్ల చేరనుంది. ఈ నేపథ్యంలో జెన్కోకు సుమారు రూ.1500 కోట్ల ఆదాయం సమకూరుతుందిన అధికారులు అంచనా వేశారు. కాగా 18 సంవత్సరాల తర్వాత ఈ ఏడాది నాగార్జునసాగర్‌కు జూలై నెలలో వరద రావడంతో జూలై 29వ తేదీ నుంచిపూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1450 మిలియన్ యూనిట్లకు కేవలం రెండు నెలల్లో సెప్టెంబరు 30వ తేదీ మధ్యాహ్నం నాటిని విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నట్లు జెన్కో అధికారులు తెలియచేశారు.

# సిఎం ప్రజావాణి చొరవతో సౌమ్యకు పునర్జన్మ

## రూ. 9 లక్షల ఆర్థిక సహాయం అందజేత

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాలిక తల్లిదండ్రులు ధన్యవాదాలు

**హైదరాబాద్ (బేగంపేట) అక్టోబరు 31, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ప్రజావాణీ చొరవతో బాలిక సౌమ్యకు పునర్జన్మ లభించింది. ఊపిరి తిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న సౌమ్యకు సీఎం ప్రజావాణి కొండంత అండగా నిలిచి ఆ బాలిక చికిత్సకు అవసరమైన రూ 9లక్షల ఆర్థిక సహాయం సమకూర్చి బాలిక కు సహకరించింది. శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణీకి సౌమ్య తన తల్లి దండ్రులతో కల్సి వచ్చి తనకు ఆర్థికంగా సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు చిన్నారెడ్డి, దివ్యలకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణీలో సౌమ్యకు 4లక్షల సీఎం ఆర్ ఎఫ్ చెక్కును చిన్నారెడ్డి, దివ్యలు బాలికకు అందించారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) నుంచి మరో 5లక్షల ఆర్థిక సహాయాన్ని సౌమ్యకు అందించారు. జనగాం జిల్లా వెంకిర్యాల గ్రామానికి చెందిన ఈర్ల శ్రీనివాస్ అనురాధల కుమార్తె సౌమ్య అనారోగ్య సమస్యను రెండు నెలల క్రితం సీఎం ప్రజావాణీ దృష్టికి వారు తీసుకు వచ్చారు. తల్లి అనురాధ స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు, తండ్రి ఈర్ల శ్రీనివాస్ సన్నకారు రైతు. సౌమ్య దీన స్థితిని వారు సీఎం ప్రజావాణీ దృష్టికి తీసుకు రావడంతో స్పందించి బాలిక కుటుంబానికి అండగా నిలిచారు. కర్నాటక రాష్ట్రం బెంగుళూరు ఆసుపత్రిలో బాలికకు శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఈ సందర్భంగా సౌమ్యతో పాటు ఆమె తల్లి దండ్రులు సీఎం రేవంత్‌తో పాటు చిన్నారెడ్డి, దివ్యలకు కృతజ్ఞతలు తెలియజేసారు.


బాలికకు 9లక్షల ఆర్థిక సహాయం చెక్కు అందిస్తున్న చిన్నారెడ్డి, దివ్య

**సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 193**

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 193 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీ రాజ్ గ్రామీణాభి వృద్ధి శాఖకు సంబంధించి 42 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 33 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 75 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 03దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణీ ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# చిన్నారిపై కామాంధుల దాడి

## పోలీసుల అదుపులో నిందితులు

**చౌటుప్పల్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని ముక్కుపచ్చలారని మూడున్నరేళ్ల బాలికపై ఇద్దరు కామాంధులు లైంగికదాడికి పాల్పడిన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వలస కూలీ జంట జీవనోపాధి నిమిత్తం వలసవచ్చి స్థానిక పరిశ్రమలో పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. వీరి ఇంటి పక్కనే మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేష్ (42), శివరాజ్ (45) నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బాలిక రోడ్డుపై ఆడుకుంటూ ఉండగా, నిందితులు ఆమెకు మిఠాయిలను చూపి మోసపూరితంగా ఇంటిలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాలిక కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు అక్కడికి చేరుకొని తలుపు పగులగొట్టి చిన్నారిని రక్షించారు.

స్థానికులు ఆగ్రహంతో నిందితులను చితకబాదిన అనంతరం పోలీసులకు అప్పగించారు. బాలికను చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా వలస కూలీలు నిత్యం గంజాయి మత్తులో తూలుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వలస కార్మికులు నివాసముండే ప్రాంతాలపై పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



# ప్రపంచ రాజకీయ చిత్రపటం మార్చిన ధైర్యశాలి ఇందిరాగాంధీ

## దేశసమగ్రత కోసం ప్రాణాలను బలిపెట్టారు

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** పాకిస్థాన్ తూర్పు దేశ ప్రజలను అణిచి వేస్తుంటే మానవహక్కుల పరిరక్షణకోసం బంగ్లాదేశ్ ఏర్పాటు ప్రపంచరాజకీయ చిత్రపటంను మార్చిన ధైర్యశాలి ఇందిరాగాంధీ అని దేశం కోసం స్వతంత్రగా నిర్ణయాలు తీసుకొని అమలుచేసేవారని ఇప్పుడు పాలకులు అమెరికా పాలకులకు అణిగిమణిగి ఉన్నట్లు ఆమె ఏనాడు లేదని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు. గాంధీభవన్ లో శుక్రవారం మాజీ ప్రధాని, భారత రత్న ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆ మహనీయుల చిత్రపటాలకు నివాళులు అర్పించిన టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే గణేష్, మాజీ పిసిసి హనుమంతు రావు, కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు, పలువురు జనరల్ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశసమగ్రత కోసం అపరకాళీ వలే ఆమె ధైర్య సహసాలతో నిర్ణయం తీసుకొనేదని ఆ క్రమంలోనే ఆమె ప్రాణాలను కోల్పోయిందని చెప్పారు.


నష్టపోయిన రైతుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కవిత

# పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

## జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత కొంత కాలంగా అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు సతమతమవుతున్న తరుణంలో రెండు రోజుల క్రితం ఒక్కసారిగా పెనుభూతంలా రైతాంగంపై విరుచుకుపడిన మొంథా తుఫాన్ వల్ల రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతాంగాన్ని సమగ్ర సర్వే జరిపి తక్షణమే రైతులను ఆదుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేసారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని హుజురాబాద్, శంకరపట్నం మండలాలలో వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను కల్వల ప్రాజెక్టు మత్తడిని కవిత స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో తూ తూ మంత్రంగా కాకుండా ఒక గుంటభూమిలో రైతుపంటనష్టం తప్పిపోకుండా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న నష్టపోయిన పంటలను సర్వే జరిపి తక్షణమే ఎకరాన 50వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేసారు. మొదట కవిత హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అంతకుముందు హుజురాబాద్ శివారు ప్రాంతాలలో వరదల వల్ల నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి, రైతులను ఓదార్చారు. తక్షణమే ప్రభుత్వం పంట నష్టం నిధులు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేసారు.

# జూబ్లీపై మూడురంగుల జెండా ఎగరేస్తాం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### వెంగళరావునగర్ రోడ్‌షోలో ముఖ్యమంత్రి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 31, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ గడ్డపై మూడు రంగుల జెండాను ఎగుర వేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో వెంగళ్‌రావునగర్ డివిజన్ రోడ్ షోలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పీజేఆర్ చౌరస్తా నుంచి జౌహర్‌నగర్ మీదుగా సాయి బాబా దేవాలయం చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో అవకాశాలు అందరికీ రాకపోవచ్చని మనలో ఉన్న వారికి అవకాశం వచ్చినప్పుడు దక్కించుకోవాలన్నారు. ఈ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు సెంటిమెంట్ అంటూ ఓట్లు అడుగుతున్నారని అయితే 2007లో పేదల పెన్నిది బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పీజేఆర్ చనిపోతే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోటీ పెట్టకపోవడంతో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పోటీ పెట్టారని గుర్తు చేశారు. నగరానికి కృష్ణా జలాల కోసం హైటెక్ సిటీ నిర్మాణంలో ఎంతో కృషి చేసిన గొప్ప నాయకుడు పీజేఆర్ పైనే ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నిలబెట్టిందని ఇప్పుడు సానుభూతి ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు ఉందా అని ప్రశ్నించారు. కంటోన్‌మెంట్‌లో కూడా ఉప ఎన్నికలు వచ్చాయని సాను భూతి ఓట్లు గెలవలేదని శ్రీ గణేష్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలవడంతో కంటోన్‌మెంట్‌ను అన్ని విధాల అభివృద్ధి పర్చుకోవడం జరుగుతుందని ఇప్పటికే 4 వేల కోట్ల నిధులు మంజూరు చేయించుకుని పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2014, 2018, 2023 బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకున్నారని మూడుసార్లు ఎమ్మెల్యేగా మాగంటి గోపీనాథ్ గెల్చినప్పటికి నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకర్గం సమస్యలపై అసెంబ్లీలో ఏరోజు కూడా మాట్లాడలేదన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి రెండుసార్లు గెలిచి కేంద్రమంత్రి అయినా కూడా మెట్రో రైల్ రాకుండా అడ్డుకుంటున్నారని బీఆర్‌ఎస్ బీజేపీ కుమ్మక్కై నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీల బందం ఫెవికోల్ బంధమన్నారు. బీజేపీ 8 పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవటంలో బీఆర్‌ఎస్ ఎంతో సహకరించి వాళ్ల గెలుపునకు దోహదపడ్డదని తెలిపారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్రానికి నిధులు సాధించ లేకపోయారన్నారు. దేశానికి మూడుసార్లు ప్రధానిగా మోడీ ఎన్నికయ్యారని, రెండు సార్లు కేసీఆర్ ఉమఖ్యమంత్రి అయ్యారని అయినా రాష్ట్రానికి ఏమి మేలు చేశారని ప్రశ్నించారు. ఆటో వాలాలను రెచ్చగొడుతు బీఆర్‌ఎస్ నాయకులు ఉచిత బస్సు పథకాన్ని ఆపాలని చూస్తున్నామని అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే గెలిపిస్తే సన్న బియ్యం రద్దు అవుతాయని 200 యూనిట్ల కరెంట్ రద్దు అవుతుందని, రేషన్ కార్డు రద్దు అవుతాయని, ఉచిత బస్సు పథకం రద్దు అవుతుందని అన్నారు. నవీన్ యాదవ్‌ను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే మీ సమస్యలను ప్రస్తావించి మీ అభివృద్ధికి పెద్ద పీటవేస్తారన్నారు. రెండు నెలల్లోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వందల కోట్లు మంజూరు చేయటం జరిగిందని గుర్తు చేశారు. 2023లో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థిగా అజహారుద్దీన్‌ను నిలబెట్టగా కొద్ది తేడాతో ఓడిపోయారని ఆరోజుల్లోనే తాను అజహారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వటం జరిగిందని అదే హామీని ఈ రోజు మంత్రి పదవి ఇచ్చి ఎన్నికల ప్రచారానికి రావటం జరిగిందని తెలిపారు. మైనారిటీలకు మంత్రి పదవి ఇస్తే బీజేపీ, బీఆర్‌ఎస్ తట్టుకోలేక పోతున్నారని అన్నారు. అజహారుద్దీన్ అన్ని వేలల ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత ప్రజల పరిష్కారానికి తగిన విధంగా కృషి చేస్తారన్నారు. ఫామ్ హౌస్‌ల్లో గంజాయితో దొరిక వాళ్ల



రౌడీలా నవీన్ యాదవ్ లాంటి చదువుకున్నవారు రౌడీనా ఓటర్లు గమనించాలని తెలిపారు. సినీ కార్మికులకు తాను మాట ఇచ్చిన ప్రకారం వారి పిల్లలకు విద్య ఆరోగ్యం విషయంలో తగిన విధంగా సహాయ సహకారాలు అందివ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మైత్రివనం వద్ద నందమూరి తారకరామారావు విగ్రహాన్ని తొందర్లోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నాగార్జున రెడ్డి, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇవీ కొత్త సిజె ఆస్తిపాస్తులు!

## సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వివరాలు వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** భారతదేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ తనకు తన కుటుంబానికి ఉన్న ఆస్తులు, ఆదాయ వివరాలనను అత్యంత పారదర్శకంగా ప్రకటించారు. ఆయనకు సంబంధించిన మొత్తం వివరాలు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. జస్టిస్ సూర్యకాంత్ 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న సంగతి తెలిసిందే. నియామకం ప్రకటన వెలువడిన వెంటనే తన మొత్తం ఆస్తిపాస్తులు ఆదాయ వివరాలను వెల్లడించడం ఆయన దార్శనికతకు అద్దంపట్టింది. తనకు తన భార్యతో కలిసి రూ. 8 కోట్లకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, న్యూఢిల్లీ, చండీగఢ్, గురుగ్రామ్ లలో ఇళ్లు సహా ఆస్తులు, 1.1 కిలోల బంగారు ఆభరణాలు కలిగి ఉన్నారు. సుప్రీంకోర్టు తదుపరి



ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా పడింది. 2025 నవంబర్ 24వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్న ఆయన 14 నెలల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ సూర్యకాంత్ కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు కలిగి ఉన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో సమాచారాన్ని పొందుపర్చారు. జస్టిస్ సూర్యకాంత్ పేరు మీద మొత్తం 16 ఫిక్స్‌డ్ డిపాజిట్ రిసీట్స్ ఉన్నాయి. వడ్డీతో కలిపి వాటి విలువ రూ.4,11,22,395 కాగా, ఆయన కుటుంబం పేరు మీద రూ.1,92,24,317 విలువైన మరో 15 ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, భార్య పేరు మీద రూ.1,96,98,377 విలువైన 6 ఫిక్స్‌డ్ డిపాజిట్ రిసీట్స్ ఉన్నాయి. జస్టిస్ సూర్యకాంత్ స్వయంగా 100 గ్రాముల బంగారం, భార్య కిలో బంగారు ఆభరణాలు కలిగి ఉన్నారు. వారి వద్ద 6 కిలోల వెండి సామాగ్రి ఉంది. ఆయన పేరు మీద ఎలాంటి కారు లేదు. కానీ భార్య పేరు మీద వ్యాగనార్ కారు ఉంది. చండీగఢ్‌లోని సెక్టార్ 10లో భార్య పేరు మీద ఒక ఇల్లు, పంచకుల జిల్లాలోని గోల్పురా గ్రామంలో 13.5 ఎకరాల వ్యవసాయ భూమి, న్యూచండీగఢ్‌లో 500 చదరపు గజాల స్థలం, న్యూఢిల్లీలోని జీకే 1లో 285 చదరపు గజాల ఇల్లు, గురుగ్రామ్‌లో 300 చదరపు గజాల స్థలం, చండీగఢ్‌లోని సెక్టార్ 18లో 192 చదరపు గజాల స్థలం కలిగి ఉన్నారు. హిసార్ జిల్లాలోని పెట్వార్ గ్రామంలో 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరు కుమార్తెల వద్ద 100 గ్రాముల చొప్పున బంగారు ఆభరణాలు ఉన్నాయి. అంతేగాక పెద్ద కుమార్తె పేరు మీద రూ.34,22,347 విలువ చేసే 8 ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిన్న కుమార్తె పేరు మీద రూ.25,20,665 విలువచేసే 7 ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు కలిగి ఉన్నారు.

# భూదాన్ భూముల వ్యవహారంలో ఐఎఎస్, ఐపిఎస్‌లకు హైకోర్టులో ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు31:** భూదాన్ భూముల వ్యవహారంలో ఐఎఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. అక్టోబర్ 17వ తేదీన సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ శుక్రవారం సస్పెండ్ చేసింది. నాగారం సర్వే నంబర్ 194, 195ల్లోని బ్యూరోక్రాట్స్ భూములను నిషేధిత జాబితాలో ఉంచాలంటూ గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో బ్యూరోక్రాట్స్ ఆపిల్ చేశారు. ఈ నేపథ్యంలో ఆధారాలను పరిశీలించిన తర్వాత డివిజన్ బెంచ్ తీర్పు వెల్లడించింది. అవి భూదాన్ భూములు కానప్పుడు నిషేధిత జాబితాలో ఎందుకు ఉండాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. అయితే ఐఎఎస్, ఐపీఎస్‌లకు సర్వే నంబర్ 194,195 లోనివి పట్టా భూములేనని జిల్లా కలెక్టర్ రిపోర్ట్ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181,182, 194, 195లలో గల భూదాన్ భూములను ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరులు అక్రమంగా పొందారంటూ ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై విచారణ జరపాలంటూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ వ్యవహారం గత కొద్ది కాలంగా హైకోర్టులో విచారణ జరుగుతోంది.

## పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కోసం

# నేటి నుంచి 4 వరకు ఆందోళనలు

## ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేటి (నవంబర్1) నుంచి 4 వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన సంఘం రాష్ట్ర నాయకులు కిరణ్, అశోక్‌రెడ్డి, రమేష్, లెనిన్‌తో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాకి తెలిపారు.

రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ జయప్రదమయిందని, అయినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. విద్యార్థులు, తల్లితండ్రులు రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నప్పటికీ పభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని, తక్షణమే రాష్ట్రంలో పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



# పాక్-అఫ్ఘాన్ కాల్పుల విరమణ చర్చలు వాయిదా

## మళ్లీ 6న తుర్కియే లేదా ఖతార్‌లో సమావేశం

**ఇస్లాంబుల్, అక్టోబరు 23:** పాకిస్తాన్ ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో జరుగుతున్న కాల్పుల విరమణను పాటించేందుకు ఇరుదేశాలప్రతినిధుల మధ్యజరిగిన చర్చలు కొలిక్కిరాకపోవడంతో వాయిదాపడ్డాయి. నవంబరు ఆరవ తేదీ మరోసారి ఇస్లాంబుల్‌లోనే సమావేశం అవుతారని తుర్కియే ఈసందర్భంగా ప్రకటించింది. తాత్కాలిక విరామాన్ని కూడా పాటించాలని ఖతార్ దేశం మధ్యవర్తిత్వం చేయడంతో రెండుదేశాలు చర్చల వేదికపైకి వచ్చినా కొన్ని ఆఫ్ఘన్ డిమాండ్స్ పై పాకిస్థాన్‌ప్రతినిధిబృందం వ్యతిరేకించి సమావేశంనుంచి బయటకు వచ్చేసినట్లు సమాచారం. ఆఫ్ఘనిస్తాన్ గగనతలంలోకి పాకిస్తాన్ చొరబడి నిబంధనలు ఉల్లంఘించిందని ఆఫ్ఘన్ బృందం ఆరోపించింది. ఆఫ్ఘన్ సరిహద్దుల్లో అమెరికా డ్రోన్ ఆపరేషన్లు నిలిపివేయాలని చేసిన ఆఫ్ఘన్ డిమాండ్లను పాకిస్తాన్ వ్యతిరేకిస్తోంది. ఫ్రాన్స్‌లోని ఆఫ్ఘన్ రాయబారి ఓమర్‌సమద్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉద్దేశ్యపూర్వకంగానే దాడులు చేస్తోందని అందుకే కాల్పుల విరామానికి కూడా ముందుకురావడంలేదని ఆరోపించారు. అలాగే పాకిస్తాన్‌కూడా ఆఫ్ఘన్ సరిహద్దుల్లో ఉన్న టటిపిని నిషేధిత ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని డిమాండ్‌చేస్తోంది. ఈ డిమాండ్‌ను అఫ్ఘాన్ రక్షణమంత్రి మాలావి మహ్మద్‌యాకూబ్ ముజాహిద్ వ్యతిరేకించారు. రాజకీయ ప్రయోజనాలకోసం పాకిస్తాన్, ఇతర దేశాలు ఉగ్రవాదాన్ని సాకుగా చూపిస్తున్నాయని ప్రత్యర్థులను ఉగ్రవాదులుగా ముద్రవేస్తున్నాయని ఆరోపించింది.

# శంషాబాద్‌లో భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన డిజిపి

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** సైబరాబాద్ పరిధిలోని శంషాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని డిజిపి శివధర్ రెడ్డి శుక్రవారం నాడు ప్రారంభించారు. శంషాబాద్ డిసిపి కార్యా లయ ప్రాంగణంలో అధునాతనంగా నిర్మించిన ఈ కేంద్రం రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌ల పరిధుల్లోని 17 పోలీసు స్టేషన్లలో మహిళలకు సంబంధించిన కేసులను పర్యవేక్షిస్తాయని డిజిపి శివధర్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కేంద్రం లో 17 మంది సిబ్బంది వుంటారని, వీరిలో ఒక ఎస్ఐతో పాటు మరో ఏఎస్ఐ న్యాయ సలహాదారు వున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో 2016లో భరోసా కేంద్రాల ప్రారంభం జరిగిందని ప్రస్తుతం 24 జిల్లాలతో పాటు ఆరు కమిషనరేట్లలో మొత్తం 33 కేంద్రాలున్నట్లు ఆయన వెల్లడి ంచారు. మహిళా బాధితులకు అండగా వుండడంలో భరోసా కేంద్రాలకు ప్రత్యేక పాత్ర వుందని ఆయన తెలిపారు. మహిళలపై జరిగే దాడులతో పా టు గృహ హింస, వేధింపులు, లైంగిక దాడులు, బాలలపై జరిగే దాడులకు సంబంధించిన కేసుల పర్యవేక్షణలో భరోసా కేంద్రాలు ఆమోఘంగా ప నిచేస్తున్నాయని డిజిపి కితాబునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో భరోసా కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామని డిజిపి తెలిపారు. భరోసా కేం ద్రాల నిర్వహణ మహిళా భద్రతా విభాగం చూస్తుందని, స్త్రీ, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ సహకారం అందిస్తోందని డిజిపి తెలి పారు. రాష్ట్రంలోని భ రోసా కేంద్రాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని, ఇందుకు పోలీసుల కృషి కారణమని ఆయన అన్నారు. కాగా శంషాబాద్‌లో ఏర్పాటు చే సిన భరోసా కేంద్రాన్ని బంగారు తల్లి ఫౌండేషన్ అనే సంస్థ స్పాన్సర్ చేసింది. ఈ కార్యక్రమంలో సిఐడి, మహిళా భద్రతా విభాగం చీఫ్ చారుసిన్హా, సైబరాబాద్ కమిషనర్ అవినాష్



శంషాబాద్‌లో భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి. చిత్రంలో సిఐడి చీఫ్ చార సిన్హా, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మొహంతి తదితరులు

మొహంతి, రాజేంద్రనగర్ డిసిపి యోగేష్ గౌతం, శంషాబాద్ డిసిపి రాజేష్, సైబరాబాద్ మహిళా భద్రతా విభాగం డిసిపి సృజన తదితరులు పాల్గొన్నారు.

# సెంటిమెంట్ కాదు.. అభివృద్ధి కావాలి

## బిల్లా, రంగాలు ఆటోలో తిరుగుతున్నారు

### జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో సిఎం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 31, ప్రభాతవార్త:** ప్రజలకు కావల్సింది సెంటిమెంట్ కాదని, అభివృద్ధి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళ్‌రావునగర్, సోమాజీగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ కార్నర్ మీటింగ్‌లో శుక్రవారం రాత్రి ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో ఒడిదుడుకులు ఉంటాయని, ఎత్తు పల్లాలు ఉంటాయన్నారు. అవకాశం వచ్చినప్పుడు మన బిడ్డను గెలిపించుకోకపోతే చారిత్రక తప్పిదం అవుతుంద న్నారు. బీఆర్‌ఎస్ సెంటిమెంట్ రాజకీయాలు చేస్తుందని, ఈ విషయంలో కేసీఆర్‌ను తాను ఒక మాట అడగదలచుకున్నానంటూ ప్రశ్నించారు. 2007 లో పీజేఆర్ అకాల మరణం చెందితే, బీజేపీ, టీడీపీ ఆయనపై గౌరవంతో పీజేఆర్ కుటుంబాన్ని ఏకగ్రీవం చేయాలంటే అభ్యర్థిని నిలిపింది బీఆర్‌ఎస్ కాదా అంటూ ప్రశ్నించారు. ఈ దుష్ట సంప్రదాయానికి తెర తీసింది కేసీఆర్ కాదా అంటూ ప్రశ్నించారు. అలాంటి వాళ్లు ఈ రోజు సానుభూతితో ఓట్లు పొందాలని చూస్తున్నారని, వారికి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోనూ సానుభూతితో గెలవాలని మొసలి కన్నీరు కార్చారని, కానీ ప్రజలు అభివృద్ధికే ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్‌ను గెలిపించారన్నారు. దాదాపు రూ. 4 వేల కోట్లతో కంటోన్మెంట్ అభివృద్ధి జరుగుతోందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు, జూబ్లీహిల్స్‌కు వచ్చి ఇక్కడి ప్రజల ముఖం చూశారా అంటూ ప్రశ్నించారు.

# రైల్వే క్లెయిమ్‌లను పరిష్కరిస్తున్న ట్రిబ్యునళ్లు

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 31, ప్రభాతవార్త :** రైల్వేలలో ప్రమాదాలు.. అనుకోని సంఘటనలు, నష్టం మొదలైన వాటికి సంబంధించిన పరిహారం, క్లెయిమ్‌లను రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునళ్ళు పరిష్కరిస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు పేర్కొన్నారు. సాధారణ ప్రజల సంబంధిత రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్‌లల్లో మాత్రమే కేసులు దాఖలు చేయాలని సూచించారు. భారతీయ రైల్వే చట్టం 1989 లోని సెక్షన్లు 124 అండ్ 124 ఎ క్రింద ప్రమా దాలు, అవాంఛ నీయ సంఘటనలు, నష్టం మొదలైన వాటి వలన ప్రభావితమైన బాధితులకు త్వరగా న్యాయం అందించే లక్ష్యంతో రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ స్థాపించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు సికింద్రాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు అమరావతి (గుంటూరు వద్ద), మహారాష్ట్ర రాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు నాగ్‌పూర్ అండ్ ముంబై,కర్ణాటక రాష్ట్ర ప్రాంతం కిందకు వచ్చే కేసులకు బెంగళూరులో తన బెంచ్‌లను కలిగి ఉందని వెల్లడించారు. ఇవి ప్రజలు దాఖలు చేసిన కేసులు, వివిధ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించడం లక్ష్యంతో పనిచేస్తాయని తెలిపారు.రైల్వే ద్వారా రవాణా కోసం రైల్వేలకు అప్పగించబడిన జంతువులు లేదా వస్తువుల నష్టం, విధ్వంసం, చెడిపోవడం లేదా డెలివరీ కాకపోవడం, తక్కువ డెలివరీకి పరిహారం చెల్లించడం,ఛార్జీల వాపసు, సరుకు రవాణా కోసం చెల్లించిన రుసుం లేదా దానిలో కొంత భాగాన్ని తిరిగి చెల్లించడానికి సంబంధించిన క్లెయిమ్‌లు. రైలు ప్రమాదాలు, ఏవైనా అవాంఛనీయ సంఘటనలలో ప్రయాణికుల మరణం, గాయాలకు పరిహారం చెల్లించనున్నారు. కేసులను సకాలంలో పరిష్కరించడానికి మరియు క్లెయిమ్ కేసులను త్వరగా పరిష్కరించడానికి తగిన అధికార పరిధి కలిగిన రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్‌లలో మాత్రమే కేసులు దాఖలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే బాధిత వ్యక్తులకు విజ్ఞప్తి చేస్తుంది.

# యుద్ధప్రాతిపదికన అత్యవసర పనులు చేపట్టాలి

## ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ సిఎండి కృష్ణభాస్కర్

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, విద్యుత్‌కు సంబంధించిన అత్యవసర పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని తెలంగాణ ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్కో) సిఎండి కృష్ణ భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా బ్రేక్‌డౌన్ పనులను వెంటనే సరిదిద్దడానికి అన్ని ఇహెచ్‌టి సబ్‌స్టేషన్లలో సెంట్రల్ బ్రేక్ డౌన్ గ్యాంగ్‌లు కూడా సిద్ధంగా ఉంచాలన్నారు. తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రాంతాల్లో కృష్ణ భాస్కర్ పర్యటించి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను సకాలంలో పునరుద్ధరించినట్లు తెలిపారు. ఎక్కడైనా ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినట్లయితే వాటిని పరిష్కరించేందుకు అవసరమైన సిబ్బంది వారి ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాల న్నారు. వరద ప్రభావిత ఇహెచ్‌టి సబ్‌స్టేషన్ ఫీడర్‌లను తనిఖీ చేసిన ఆయన విని యోగదారులకు ఇబ్బందులు కలుగ కుండా యుద్ధ ప్రాతిపదికన అత్యవసర పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంతకు ముందు ఆయన హైదరాబాద్‌లోని అత్తాపూర్ ప్రాంతంలో వరద ప్రభావిత ఇహెచ్‌టి సబ్‌స్టేషన్ ఫీడర్‌లను పరిశీలించారు. అన్ని సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను డైరెక్టర్ (ట్రాన్స్ మిషన్) మరియు ఫీల్డ్ అధికారులతో సమీక్షించారు. అలాగే వరదలు మరియు భారీ వర్షాల కారణంగా, నల్గొండ జిల్లాలోని 132 కెవికెఎమ్ పల్లి ఎస్ఎస్ లోకి నీరు ప్రవేశించడం తో, దీని వలన ఫీడర్ బేలు, ఐసోలేటర్లు, ఎబి స్విచ్‌లు మొదలైన పరికరాలు మునిగిపోయాయి. అత్యవసర పరిస్థితిని గ్రహించిన విద్యుత్ ఇంజనీర్లు వెంటనే చర్య తీసుకొని ఇతర సబ్‌స్టేషన్ల నుండి లోడ్‌లకు ప్రత్యామ్నాయ సరఫరాతో పునరుద్ధరించారు. అంతేకాకుండా ప్రమాదాలను నివారించడానికి 2 ఫీడర్‌లను సర్క్యూట్ బ్రేకర్‌లను చేతితో ట్రిప్ చేయడం ద్వారా సేవలను నిలిపివేశారు. మరమ్మతు పనులకు హాజరైన తర్వాత, అన్ని పరిక రాల సాధారణ స్థితిని పునరుద్ధరించారు.

# కుల, మతాంతర వివాహితుల రక్షణ చట్టం తేవాలి

## ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కుల, మతాంతర వివాహితుల రక్షణ చట్టం తేవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. కుల దురహంకారంతో నిండు గర్భిణి అయిన తలండి శ్రావణి హత్యకు గురైనందున ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని లేఖలో సీఎంని కోరారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కుమురంభీం జిల్లా, దహెగాం మండలం, గెర్రె గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ తలండి శ్రావణి, అదే గ్రామం బీసీ కులానికి చెందిన శివార్ల శేఖర్ 2024 అక్టోబర్ 10న బెల్లంపల్లిలో ప్రేమ వివాహం చేసుకున్నారని, శేఖర్ తండ్రి శివార్ల సత్తయ్య, వారి కుటుంబ సభ్యులు ఈ కులాంతర వివాహాన్ని అంగీకరించలేదని.. దీనితో ఈ జంట శ్రావణి తండ్రి చెన్నయ్య ఇంట్లోనే కాపురం ఉంటున్నారని లేఖలో పేర్కొన్నారు.

# క్రికెట్‌లోనే కాదు రాజకీయాల్లోనూ ఫిక్సరే

## బిజెపి నేత ఎలేటి మహేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు31:** మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన క్రికెట్ మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ క్రికెట్‌లోనే కాదు రాజకీయాల్లోనూ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన ఫిక్సరేనని బిజెపి శాసన సభాపక్షం నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. మజ్లీస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అండదండలతో, ఆశీస్సులతో మంత్రి పదవి దక్కిందని ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ముస్లింల ఓట్ల కోసం ఉన్నఫళంగా అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిందని ఆయన



విమర్శించారు.

అజహరుద్దీన్‌ను భారత దేశ క్రికెట్ కెప్టెన్‌గా చేస్తే, ఆయన దేశం కోసం కాకుండా డబ్బుల కోసం కక్కుర్తితో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. దీంతో రెండు వేల సంవత్సరంలో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యంలో బిసిసిఐ జీవితకాలం నిషేధం విధించిందని ఆయన గుర్తు చేశారు.

కాంగ్రెస్‌కు మైనారిటీ ఓట్లు మాత్రమే కావాలి కానీ వారి బాగోగులు పట్టించుకోదని ఆయన వ్యాఖ్యానించారు. మైనారిటీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రెండేళ్ళుగా మంత్రివర్గంలోకి మైనారిటీ నాయకునికి ప్రాతినిథ్యం ఎందుకు కల్పించ లేదని ఆయన ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌ను మజ్లీస్ పార్టీకి రాసి ఇచ్చేస్తారేమోనన అనుమానాన్ని మహేశ్వర్ రెడ్డి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు, మజ్లీస్ ఆగడాలకు వ్యతిరేకంగా బిజెపికి ఓటు వేయాలని ఆయన ఓటర్లను కోరారు

# వరద కాలువలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

## హైడ్రా కమిషనర్ రంగనాథ్

**రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** వరద కాలువలు,చెరువులు, కుంటలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన, పెద్ద గోల్కొండ చిన్న గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్ అండర్పాంండ్ పరిశీలించి అనంతరం నరసింహా చెరువును పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా చిన్నగోల్కొండ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగురోడ్డు అండర్ పాస్‌లు వరద నీటిలో మునుగుతున్నాయని తాము పాఠశాలకు వర్షాకాలం వెళ్లలేకపోతు న్నామని విద్యార్థినులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు పాఠశాల విద్యార్థులు ఫిర్యాదు చేశారు.




# హాలోవీన్ వీకెండ్‌పై ఉగ్రదాడికి కుట్రలు

## భగ్నం చేసిన ఎఫ్‌బిఐ అధికారులు

**మిచిగాన్,అక్టోబరు 31:** అమెరికాలో జరిగిన హాలోవీన్ వీకెండ్ కార్యక్రమంలో భారీ ఎత్తునజరిగే ఉగ్రకుట్రను ఎఫ్‌బిఐ భగ్నంచేసింది. ఈసందర్భంగా అనేకమంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ తన ఎక్స్‌లో పోస్టుచేసారు. హాలోవీన్2025 వీకెండ్‌పై భారీ ఎత్తున ఉగ్రదాడులుచేసేందుకు కుట్రలుజరిగాయని, సిఐఎ సమాచారంతో ఎఫ్‌బిఐ ముందస్తుగానే స్పందించి ఎక్కడికక్కడ అరెస్టులుచేసినట్లు క్యాష్ పటేల్ తెలిపారు. అయితే అనుమానితుల పేర్లను మాత్రం ఎఫ్‌బిఐ విడుదలచేయలేదు. ప్రణాళికాబద్ధంగా ఈ దాడులుచేసేందుకు కుట్ర పథకం వేసారని మాత్రమే తెలిపారు. ఈ దాడులకు సంబంధించి డియర్‌బోర్న్ పోలీస్ శాఖకూడా తన ఫేస్‌బుక్‌లో పోస్టుపెట్టింది. ఆందోలన చెందాల్సిన అవసరం లేదని, అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. శుక్రవారం ఉదయమే ఎఫ్‌బిఐ జరిపిన దాడులసమాచారం తమకు పూర్తిగా ఉందని తెలిపింది. అయితే ఈరెండు సంఘటనలు ఒక్కటేనని నిర్ధారించడంలేదు. ఫోర్డ్‌సన్‌హైస్కూలువద్ద ఎఫ్‌బిఐ ఏజెంట్లు, స్థానిక పోలీసులు మొహరించారు. ఎఫ్‌బిఐ ట్రక్కునుంచి ఒక ఇంట్లోకి భారీ ఎత్తున కొన్ని వస్తువులను తరలించే దృశ్యాలు ఈసందర్భంగా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి.

# ఇంటర్ బోర్డు కమాండ్ కంట్రోల్‌ను సందర్శించిన కోబ్సే ప్రతినిధులు

**హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:** తెలంగాణ ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌ను సందర్శించిన కోబ్సే సమావేశానికి హాజరైన ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. హబ్సిగూడలోని సీఎస్‌సీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరుగుతున్న మూడు రోజుల కోబ్సే (సీవోబిఎస్‌ఈ) సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలు, నేపాల్, భూటాన్ దేశాలలోని విద్యా బోర్డుల ప్రతినిధులు శుక్రవారం తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌ను సందర్శించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తున్న డిజిటల్ పర్యవేక్షణ, పారదర్శకత చర్యలను పరిశీలించారు. ప్రతినిధులు స్టేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించగా బోర్డ్ అధికారులు అమలు చేస్తున్న విధానాలను వివరించారు. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సీసీటీవీ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేశారు. విద్యార్థుల హాజరును ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా నమోదు చేస్తున్నారు. అలాగే హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (హెచ్‌ఆర్‌ఎంఎస్) ద్వారా ఉద్యోగుల సేవలను డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నారు.

# మహిళల వరల్డ్ కప్.. భారత్, సౌతాఫ్రికా ఫైట్




## 2న తుది సమరం

**న్యూఢిల్లీ:** ఐసిసి ఉమెన్స్ వరల్డ్ కప్-2025 చివరి దశకు చేరుకుంది. మొత్తం 30 రోజుల పాటు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు, కొన్ని షాకింగ్ ఫలితాల తర్వాత ఫైనలిస్ట్‌లు ఎవరనేది తేలింది. నవంబర్ 2న నవీ ముంబైలో జరగనున్న ఫైనల్‌లో భారత్, సౌతాఫ్రికామధ్య టైటిల్‌కోసంతుది సమరం జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై టీమిండియా చారిత్రక, ప్రపంచ రికార్డు విజయం సాధించడంతో ఈ ఫైనల్ ఖరారైంది. దీంతో 25 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మహిళా క్రికెట్‌కు ఒక కొత్త ఛాంపియన్ లభించడం ఖాయమైంది. వరల్డ్ కప్ సెప్టెంబర్ 30న గౌహతిలో భారత్, శ్రీలంక మ్యాచ్‌తో ప్రారంభమైంది. అక్టోబర్ 30న డీవై పాటిల్ స్టేడియంలో టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్ జరిగింది. ఈమ్యాచ్‌లో ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసి 338 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే జెమిమా రోడ్రిగ్జ్ రికార్డు సెంచరీ, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌అద్భుత ఇన్నింగ్స్ సహాయంతో టీమిండియా 5వికెట్ల తేడాతో ఈ మ్యాచ్ గెలిచి ఫైనల్‌లో స్థానం సంపాదించింది. అలాగే సౌతాఫ్రికా మొదటి సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఇక టీమిండియా వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకోవడం ఇది మూడోసారి. ఇంతకు ముందు 2017లో చివరిసారి ఫైనల్‌ఆడింది. అయితే మొట్టమొదట 2005లో భారతజట్టు వరల్డ్ కప్ గెలుచుకునే అవకాశం దగ్గర వరకు వచ్చింది. గత రెండు ఫైనల్స్‌లోనూ భారత జట్టు ఓటమిని ఎదుర్కొంది. 2005లో ఆస్ట్రేలియా చేతిలో, 2017లో విజయం అంచున ఇంగ్లాండ్ చేతిలో ఓడిపోయింది. కాగా, సౌతాఫ్రికా తొలిసారిగా వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరుకుంది. అంతకుముందు, 2017, 2022లో రెండు సార్లు ఇంగ్లాండ్ చేతిలోఓడిపోయింది. కానీ ఈసారి లారా వోల్వార్ట్ కెప్టెన్సీలో ఆఫ్రికా జట్టు దూసుకొచ్చింది. మరోపక్క మహిళా క్రికెట్‌కు కొత్త ఛాంపియన్ లభించబోతోంది. సరిగ్గా 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మహిళా వరల్డ్ కప్ ఫైనల్‌లో కొత్త ఛాంపియన్‌ను నిర్ణయించనున్నారు. ఇంతకు ముందు 2000లో ఇలా జరిగింది. అప్పుడు న్యూజిలాండ్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తొలిసారిగా, ఏకైకసారి టైటిల్‌ను గెలుచుకుంది. అంతకు ముందు, ఆతర్వాత కూడా కేవలం ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మాత్రమే అన్ని టైటిళ్లను గెలుచుకున్నాయి. ఈ విధంగా ప్రపంచ క్రికెట్‌కు నాల్గవ ఛాంపియన్ జట్టు లభించనుంది.



### హైలో ఓపెన్-2025లో

# కిరణ్ సంచలనం

## క్వార్టర్ ఫైనల్స్‌కు లక్ష్య, రక్షిత, ఆయుష్

**న్యూఢిల్లీ:** హైలో ఓపెన్-2025లో భారత క్రీడాకారుడు కిరణ్ జార్జ్ ప్రపంచ 13వ ర్యాంక్ పోపోవ్‌ని ఓడించి సంచలనంసృష్టించాడు. అలాగే లక్ష్యసేన్, రక్షిత, ఆయుష్ శెట్టి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో 25 యేళ్ల కిరణ్ జార్జ్ అద్భుతమైన పునరాగమనం చేసి పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకున్నాడు. 69 నిమిషాల పాటు జరిగిన ఈ హోరాహోరీ పోరులో ప్రపంచ 38వ ర్యాంకర్ కిరణ్ 18-21, 21-18, 21-19 తేడాతో విజయం సాధించాడు. ఒడిశా ఓపెన్ (2022), ఇండోనేషియా మాస్టర్స్ (2023) లను కైవసం చేసుకుని రెండుసార్లు సూపర్ 100 విజేత అయిన కిరణ్ తదుపరి ఇండోనేషియాకు చెందిన జోనాటన్ క్రిస్టీ లేదా చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్‌తో తలపడతాడు. ఇక లక్ష్యసేన్, రక్షిత రమేష్ కూడా అద్భుతమైన విజయాలతో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత లక్ష్య, ఎస్. సుబ్రమణియన్‌ను 21-14, 21-11 తేడాతో ఓడించగా, రక్షిత 58 నిమిషాల ఆల్ ఇండియన్ పోటీలో 19-21, 21-8, 21-13 తేడాతో శ్రీయాన్షి వాలిశెట్టిని ఓడించింది. లక్ష్య తదుపరి మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన నాల్గవ సీడ్ అలెక్స్ లానియర్‌తో తలపడనుండగా, రక్షిత డెన్మార్క్‌కు చెందిన లైన్ క్రిస్టోఫర్‌సెన్‌తో తలపడనుంది. అలాగే ఆయుష్ శెట్టి 21-11, 21-11 తేడాతో సింగపూర్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ లోహ్ కీన్ యూను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు.




### డబ్ల్యూటిఏ చెన్నై ఓపెన్-2025

# ముగిసిన భారత్ పోరు

## సహజ, శ్రీవల్లి ఔట్

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిఏ చెన్నై ఓపెన్-2025లో భారత యువ టెన్నిస్ స్టార్లు సహజ, శ్రీవల్లి నిష్క్రమణతో భారత సింగిల్స్ ప్రచారం ముగిసింది. యమలపల్లి సహజ మరియు భమిడిపాటి శ్రీవల్లి ఇద్దరూ ప్రిక్వార్టర్ ఫైనల్స్ రెండవ రౌండ్‌లో వరుస సెట్లలో ఓడిపోయారు. సహజను క్రొయేషియాకు చెందిన ప్రపంచ 78వ ర్యాంకర్ డోనా వెకిక్ 2-6, 2-6 తేడాతో ఓడించింది. అదే సమయంలో, శ్రీవల్లిని ఆస్ట్రేలియాకు చెందిన 7వ సీడ్ కింబర్లీ బిరెల్ 5-7, 6-7 చేతిలో చిత్తుగా ఓడిపోయింది. శ్రీవల్లి తొలి సెట్‌లో 1-5 వద్ద రెండు బ్రేక్‌లు డౌన్ తర్వాత అద్భుతమైన పునరాగమనం చేసి, బిరెల్‌పై వరుస బ్రేక్‌లు గెలుచుకోవడం ద్వారా స్కోరును 5-5తో సమం చేసింది. కానీ తర్వాత బిరెల్ 11వ గేమ్‌లో మరో బ్రేక్ సాధించి, తొలి సెట్‌ను 7-5తో ముగించింది. రెండవ సెట్‌లో ఇద్దరు ఆటగాళ్లకు చెరో నాలుగు బ్రేక్‌లు వచ్చాయి. దీని ఫలితంగా 6-6 సెట్ తో టై అయింది. విజేతను నిర్ణయించడానికి టైబ్రేక్ వచ్చింది. ఇందులో అనుభవజ్ఞురాలైన ఆస్ట్రేలియన్ శ్రీవల్లిని 6-2 తేడాతో ఓడించింది. దీంతో మూడేళ్లలో భారత్ యొక్క మొదటి ఇబ్ల్యూటిఏ ఈవెంట్ అయిన 2025 చెన్నై ఓపెన్ సింగిల్స్ విభాగంలో భారత్ యొక్క ప్రచారం కూడా ముగిసింది. మరోవైపు, సహజ మరో నిరాశను ఎదుర్కొంది. ఆమె జర్మనీకి చెందిన కరోలిన్ వెర్నర్‌తో కలిసి తన డబుల్స్ మ్యాచ్‌ను 6-3, 3-6, 7-10తో మూడు సెట్లలో ఓడిపోయింది.

### రెండో టీ20లో..

# టీమిండియా ఘోర ఓటమి

## ఆస్ట్రేలియా ఘనవిజయం



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో టీ20 సిరీస్‌ను కూడా టీమ్‌ఇండియా ఓటమితో ఆరంభించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం అడిలైడ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 126 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ ఆరు వికెట్లు కోల్పోయి 13.2 ఓవర్లలోనే ఛేదించింది. స్వల్ప లక్ష్య ఛేదనను ఆసీస్ ఘనంగా ఆరంభించి 4 ఓవర్లకే 49 స్కోర్ చేయగా, ఐదో ఓవర్లో వరుణ్ ట్రావిస్ హెడ్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత మిచెల్ మార్ష్ జోరందుకున్నాడు. కుల్దీప్ వేసిన ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 20 పరుగులు బాదాడు. అదే ఓవర్ ఆఖరి బంతికి క్యాచ్ ఔట్ అయ్యాడు. టిమ్ డేవిడ్ (1)ను కూడా వరుణ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత జోష్ ఇంగ్లిష్‌ను (20 రన్స్) కుల్దీప్ ఔట్ చేశాడు. 13వ ఓవర్లో ఆసీస్ విజయానికి 5 పరుగులు అవసరం కాగా, తొలి 3 బంతులకు 3 పరుగులు వచ్చాయి. 4, 5 బంతులకు బుమ్రా వరుసగా 2 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18.4 ఓవర్లలోనే 125 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఒకవైపు టపటపా వికెట్లు పడుతున్నా మరోవైపు ఓపెనర్ అభిషేక్ శర్మ (23 బంతుల్లో 68) బౌండరీలతో స్కోర్‌ను పెంచాడు. అతడితోపాటు హర్షిత్ రాణా (33 బంతుల్లో 35) రాణించాడు. 125 రన్స్‌లో ఈ ఇద్దరివే 103 ఉన్నాయి. మిగిలిన తొమ్మిది మంది సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. శుభ్‌మన్ గిల్ (5), సంజు శాంసన్ (2), సూర్యకుమార్ యాదవ్ (1), తిలక్ వర్మ (0), అక్షర్ పటేల్ (7), శివమ్ దూబె (4), కుల్దీప్ యాదవ్ (0), జస్ప్రీత్ బుమ్రా (0) ఎవరూ ఆకట్టుకోలేదు. ముగ్గురు బ్యాటర్లు పరుగుల ఖాతా తెరవకముందే డకౌట్ అయ్యారు. దీంతో 125 పరుగులకే భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

### పారిస్ ఓపెన్ ఎటిపి మాస్టర్స్-1000 సిరీస్


# భారత్ డబుల్స్ స్టార్ యూకీ ఓటమి



**న్యూఢిల్లీ:** పారిస్ ఓపెన్ ఎటిపి మాస్టర్స్-1000 సిరీస్ టోర్న మెంట్‌లో భారత్ డబుల్స్ టెన్నిస్ నంబర్ వన్ యూకీ బాంబ్రీ కథ ముగి సింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)- అడమ్ పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) ద్వయం 4-6, 7-6 (7/5), 7-10తో సూపర్ టైబ్రేక్‌లో రెండో సీడ్ జూలి యన్ క్యాష్-లాయిడ్ గ్లాస్‌ఫూల్ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడిపోయింది. 1 గంటా 42 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-పావ్లాసెక్ మూడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తొలి సర్వీస్‌లో 49 పాయింట్లకు గాను 36 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 27 పాయింట్లకు గాను 14 పాయింట్లు సాధించారు. తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశాడరు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన యూకీ-పావ్లాసెక్‌లకు 26,275 యూరోలు (రూ.26 లక్షల 94 వేలు) ప్రైజ్ మనీతో పాటు, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# మోస్తరు నష్టాల్లో ముగిసిన మార్కెట్లు


## వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీల్లో అనిశ్చితి




**ముంబయి, అక్టోబరు 31:** గ్లోబల్ అనిశ్చితులు, ట్రేడ్ వార్, ట్రంప్ సుంకాలు వంటి వాటితో దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో ఒకమోస్తరు నష్టాలతో ముగిసాయి. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 237.17 పాయింట్లు క్షీణించి 83,938.71 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 73.05 పాయిం ట్లు క్షీణించి 25,722.10 పాయిం ట్లవద్దట్రే డింగ్ నిలిపి వేసింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.96శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ కూడా .0.67శాతం మేర పెరిగినట్లు తేలింది. వివిధ సూచీల పరంగా ప్రైవేటు బ్యాంకుల్లో కోటక్ మహీంద్ర 3.79 శాతం క్షీణించింది. నికరలాభాలు తగ్గడమే ఇం దుకుకారణం. 3343.72 కోట్లనుంచి 3253 కోట్లకు పడిపోయింది. కోఫోర్జ్ 1.50 శాతంపెరిగింది. కంపెనీ లాభాలు మద్దతు పలికాయి. వరుణ్‌బేవరేజెస్ 1.89శాతం పెరిగి లాభాలు 18.5శాతం వృద్ధిని నమో దుచేసాయి. టాటాక్యాపిటల్ ఒకటిశాతం పెరిగింది. సూరాజ్ ఎస్టేట్ డెవలపర్స్ 5.49శాతం ర్యాలీ తీసాయి. నికరలాభాలు నాలుగు శాతం పెరిగి 33.1 కోట్లకు చేరింది. శ్రీసిమెంట్ 1.29శాతం క్షీణించింది. అదే దారిలో వేదాంత కూడా నడిచింది. 0.42శాతం షేరు విలువలు దిగజారాయి. ఇక గ్లోబల్ మార్కెట్లపరంగా యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు తన రెపోరేట్‌ను రెండుశాం గానే ఉంచింది. దక్షిణ కొరియా మూడో త్రైమాసిక జిడిపి గణాంకాలు 1.7శాతంపెరిగి అక్కడి మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. జపాన్ సెంట్రల్ బ్యాంకు కూడా తన రెపోరేట్లను 0.5శాతంవద్దనే స్థిరంగా కొనసాగించింది. అమెరికా ఫెడ్ రిజర్వు బుధవారం బెంచ్ మార్కు ఫెడ్ రిజర్వురేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.75శాతానికి చేర్చిన సంగతి తెలిసిందే. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 88.69వద్ద నిలిచింది. ఇక నిఫ్టీలో ప్రభుత్వరంగ బ్యాంకులసూచీ 1.56శాతం పెరిగింది. యూనియన్ బ్యాంకు 4.46శాతం, కెనరా బ్యాంకు 3.09శాతం, పంజాబ్‌నేషనల్ బ్యాంకు 2.33 శాతం చొప్పున పెరిగాయి. గడచిన ఏడాది కాలంగా నిఫ్టీ ప్రభుత్వ బ్యాంకుల సూచీ 22శాతం వరకూ పెరిగింది. అదే నిఫ్టీ 50సూచీ 6.27శాతంమాత్రమే పెరి గింది. ఇక నిఫ్టీలో మీడియా సూచీ 1.32శాతం, మెటల్‌సూచీ 1.09శాతం చొప్పున పెరిగాయి.

# రూ.10వేల కోట్లు సాయం చేయండి

**ముంబయి, అక్టోబరు 31:** అహ్మదాబాద్ ఎయి రిండియా విమాన ప్రమాదం తర్వాత ఎయి రిండియాకు అనేక షాకులు తగులుతు నష్టాలు చవిచూస్తోంది. వీటినుంచి బయటపడేందుకు రూ.10వేల కోట్లు ఆర్థిక సాయం అందించాలని టాటాసన్స్,సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లను ఎయిరిండియా కోరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎయిరిండియాలో టాటాగ్రూప్‌నకు 74.9శాతం వాటా ఉంది. మిగిలిన వాటా సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కే ఉంది. విమాన భద్రత, ఇంజినీరింగ్, నిర్వహణ వ్యవస్థలను సరిచేయడంతోపాటు సేవలను మెరుగు పరుచుకునేందుకు ఈనిధులు కావాలని అభ్య ర్థించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపా దన చర్చలరూపంలోనే ఉంది.సింగపూర్ ఎయిర్‌లైన్స్ మాత్రం ఎయిరిండియా పునర్ వ్యవస్థీకరణకు టాటాగ్రూప్‌తో కలిసి పనిచే స్తామని ప్రకటించిందన్న వార్తలు వెలువడ్డాయి.




# ఫోర్డ్ ప్లాంట్‌లో 'పవర్‌ట్రైన్స్' ఉత్పత్తి

## రూ.3250 కోట్ల పెట్టుబడితో 2029కల్లా తయారీ షురూ



**చెన్నై, అక్టోబరు 31:** అమెరికా ఆటోమొబైల్‌కంపెనీ ఫోర్డ్ తన చెన్నై ప్లాంట్‌లో పవర్‌ట్రైన్స్ ఉత్పత్తికోసం రూ.3250 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు తేలింది. కంపెనీ ఇందుకోసం తన మరైమలైనగర్ ఫ్యాక్టరీని వినియోగిస్తోంది. నగరశివార్లలో ఉన్న ఎగుమతుల హబ్‌లో ఈ ప్లాంట్ ఉంది. 2.35 లక్షలయూనిట్లు సామర్థ్యంతో ఏర్పాటుచేస్తోంది. 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలన్న లక్ష్యం నిర్దేశించుకుంది. తమిళనాడు ప్రభుత్వంతో కంపెనీ ప్రతినిధులు గత ఏడాది సెప్టెంబరులోనే ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలుచేసారు. సీనియర్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కలిసారు. ప్రస్తుత యంత్రసామగ్రిని ఎగుమతులకు వీలైన ఇంజిన్లను తయారీకి అనుగుణంగా మారుస్తుందని తెలుస్తోంది. తమిళనాడు ప్రభుత్వం తమకు అన్నివిధాలా సహకరిస్తోందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. తమ భవిష్యత్తు ఉత్పత్తులు మరింత వృద్ధిని సాధించేదిశగా తమిళనాడు ప్రభుత్వ సహకారం ఉందని వారు హర్షం ప్రకటించారు. చెన్నై ప్లాంట్‌లో తయారయ్యే ఇంజిన్లు ఎగుమతి మార్కెట్లకు నిర్దేశించినవేనని, దేశీయ అవసరాలకు సైతం ఉపయోగపడేవిధంగా ఉంటాయని కంపెనీ చెపుతోంది. ఈప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభిస్తే చెన్నైలో ఆటోమొబైల్‌హబ్‌గా రూపొందే అవకాశం ఉందని, నిపుణులైన వర్కర్లు, ఇన్వెస్టర్లకు సానుకూల వాతావరణం ఉంటుందని అందువల్లనే తమిళనాడు పారిశ్రామిక హబ్‌గా మారేందుకు ఎంతో అవకాశం ఉందని పరిశ్రమల మంత్రి టిఆర్‌బి రాజా అన్నారు. చెన్నై పోర్టుకు 50 కిలోమీటర్ల దూరంలోను, ఎన్నూరు పోర్టుకు 74 కిలోమీటర్ల దూరంలో మరైమలైనగర్ ఫ్యాక్టరీ ఉంది. అందుకోసమే ఫోర్డ్ ఈ యూనిట్‌ను ఎంచుకుంది. అలాగే బెంగళూరుకు కూడా రోడ్డుమార్గంలో కూడా పోవచ్చు. ఫోర్ట్ కంపెనీ భారత్‌లో పదిలక్షలమందికిపైగా కస్టమర్లు ఉన్నారు. సర్వీస్, ఆఫ్టర్ మార్కెట్ పార్టులు, వారంటీ సపోర్టు వంటివి అందిస్తోంది. ఇపుడున్న పెట్టుబడితో 600మందికి ఉపాధి కల్పిస్తుందని, తమిళనాడు యూనిట్‌లో సుమారు 12 వేల మందిని నియమించుకున్నట్లు అంచనా.

### ఎసిసి నికరలాభం

## రూ. 119.26 కోట్లు

**చెన్నై, అక్టోబరు 31:** చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న సిమెంట్ తయారీ కంపెనీ ఎసిసి తన రెండోత్రైమాసికంలో ఐదు రెట్లు నికరలాభం ఆర్జించింది. 1119.26 కోట్లు వచ్చిందని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజిలకు నివేదిక ఇచ్చింది. కంపెనీ సమిష్టిగా నికరలాభం గత ఏడాది ఇదే త్రైమాసికంలో కేవలం 199.7 కోట్లుమాత్రమే రాగా ఈ ఏడాది ఐదురెట్లు అధికంగా లాభాలు ఆర్జించింది. రాబడులపరంగా చూస్తే గత ఏడాది 4542.23 కోట్లు వస్తే ఈ ఏడాది 5896.16కోట్లు ఆర్జించింది. ఇక ఈ త్రైమాసికంలో మొత్తం వ్యయాలు చూస్తే గత ఏడాదికంటే పెరిగాయి. గత ఏడాది 4473.67 కోట్లు రూపాయలుకాగా ఈ ఏడాది రూ.5393.42 కోట్లుగా వెల్లడించారు. ఇక సిమెంట్ ఇతర అనుబంధ సేవలరంగంలో రాబడులు 5519.18 కోట్లువరకూ రాబట్టింది.

# జీఎస్టీ తొలగింపుతో పెరుగుతున్న ఆరోగ్యబీమా పాలసీలు

**ముంబయి, అక్టోబరు 31:** ఆరోగ్య బీమా పథకాలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీని తొలగించడంతో ప్రజల్లో హెల్త్ ఇన్సూరెన్స్ పట్ల ఆసక్తి గణనీయంగా పెరిగింది. ఫలితంగా, కొత్తగా ఆరోగ్య బీమా పాలసీలు తీసుకునే వారి సంఖ్య ఏకంగా 38 శాతం మేర వృద్ధి చెందినట్లు ప్రముఖ ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ సంస్థ పాలసీ బజార్ తన వెల్లడించింది. జీఎస్టీ ఎత్తివేత సామాన్యులకు ఊరటనివ్వడమే కాకుండా, బీమా ప్రాముఖ్యతను కూడా పెంచిందని తెలిపింది. పాలసీలు తీసుకునే వారి సంఖ్య పెరగడంతో పాటు, వారు ఎంచుకునే బీమా కవరేజీ మొత్తం కూడా భారీగా పెరిగింది. గతంలో సగటున రూ.13 లక్షల కవరేజీతో పాలసీలు తీసుకునేవారు, ఇప్పుడు దానిని రూ.18 లక్షలకు పెంచుకున్నారు. కొత్తగా బీమా తీసుకుంటున్న వారిలో దాదాపు 45 శాతం మంది రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య కవరేజీ ఉన్న పాలసీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మరో 24 శాతం మంది రూ.10లేదా 15 లక్షల కవరేజీని, 18 శాతం మంది రూ.10 లక్షల లోపు కవరేజీని ఎంచుకుంటున్నారు. ఇప్పటికే ఆరోగ్య బీమా కలిగిన వారు కూడా జీఎస్టీ తొలగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.తమ పాత పాలసీలకు అదనపు సదుపాయాలను జోడించుకుంటూ కవరేజీని పెంచుకుంటున్నారు.

ముఖ్యంగా, 61ఏళ్లు పైబడిన వృద్ధుల్లో అధికకవరేజీ ఉన్న పాలసీలపై ఆసక్తి 11.5శాతం పెరిగింది. కేవలం నగరాల్లోనే కాకుం డా, చిన్నపట్టణాల్లోనూ ఆరోగ్య బీమాపై అవగాహన, ఆసక్తి పెరుగుతున్నాయని పాలసీ బజార్ నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమాకు ఆదరణ పెరగడానికి కేంద్రం తీసుకున్న జీఎస్టీ మినహాయింపు నిర్ణయమే ప్రధాన కారణమని నివేదిక తేల్చిచెప్పింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.